తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

బుధవారం 20.05.2026 | సంపుటి : 12 సంచిక : 300 | పేజీలు : 12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్










# పంజరంలో పత్రికా స్వేచ్ఛ

## ప్రపంచవ్యాప్తంగా మరింత దిగజారిన భారత్ స్థానం

## గతేడాది 151, ఈయేడు 157వ స్థానం

- పొరుగుదేశాలు పాక్, బంగ్లా కంటే వెనుకబాటు
- ప్రజాస్వామ్యానికి మాయని మచ్చగా నిపుణుల ఆందోళన
- ప్రెస్ ఫ్రీడమ్ ఇండెక్స్ 2026 నివేదికలో వెల్లడి

న్యూఢిల్లీ, మే 19 (జనంసాక్షి) : ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా గర్వపడే భారత్, పత్రికా స్వేచ్ఛలో మాత్రం అథఃపాతాళంలో కూరుకుపోయింది. గత రెండు దశాబ్దాలుగా ఎన్నడూలేనంతగా బలహీనపడింది. భారత్‌లో జాతీయ భద్రతా చట్టాలను ప్రయోగించడంతో జర్నలిస్టుల పనివాతావరణం తీవ్ర ప్రభావానికి లోనవుతున్నట్టు మిగతా 2లో..

**టాప్ 5లో స్కాండినేవియన్ దేశాలదే హవా :**

నార్వే-1
నెదర్లాండ్స్-2
ఎస్టోనియా-3
డెన్మార్క్-4
స్వీడన్-5

**భారత్‌లో పత్రికా స్వేచ్ఛకు అడ్డంకులేమిటి?**

గత కొన్నేళ్లలో పలువురు విలేకరులు దాడులకు, అరెస్టులకు గురయ్యారు. ప్రభుత్వ విధానాలను విమర్శించిన పలువురు జర్నలిస్టులపై దేశద్రోహం, యూఏపీఏ వంటి కఠిన చట్టాలు ప్రయోగించబడ్డాయి. మీడియా సంస్థలు పెద్ద కార్పొరేట్ గ్రూపుల చేతుల్లో కేంద్రీకృతమవడంతో నిష్పక్షపాత వార్తలకు తావు తగ్గిపోతోందని విమర్శకులు అంటున్నారు. సోషల్ మీడియా, డిజిటల్ పోర్టల్స్‌పై ప్రభుత్వ నిఘా పెరిగిందని, ఇది స్వయంసెన్సార్‌షిప్‌కు దారితీస్తోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వ ప్రకటనలను అడ్డుపెట్టుకుని మీడియా సంస్థలపై ఆర్థిక ఒత్తిడి తీసుకొస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## తెలంగాణ నిరుద్యోగ అభ్యర్థులకు

# గుడ్‌న్యూస్




**గరిష్ఠ వయోపరిమితిని 34 నుంచి 44 ఏళ్లకు పెంచుతూ ప్రభుత్వం జీవో జారీ**

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో నిరుద్యోగ అభ్యర్థులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ప్రభుత్వ ఉద్యోగాలకు గరిష్ఠ వయో పరిమితిని 34 ఏళ్ల నుంచి 44 ఏళ్లకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ ఉత్తర్వులు ఏడాది పాటు అమల్లో ఉంటాయని జీవోలో పేర్కొంది. పోలీసు తదితర యూనిఫామ్ సర్వీసులకు సడలింపు వర్తించదని ప్రభుత్వం స్పష్టం చేసింది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత గరిష్ఠ వయో పరిమితిని మిగతా 2లో..

**ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా సాగునీటి ప్రాజెక్టులు**

**'పాలమూరు-రంగారెడ్డి' భూసేకరణ ప్రక్రియ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయండి : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

# వేగవంతం చేయండి

- జిల్లా సాగునీటి ప్రాజెక్టు పనుల పురోగతిపై ప్రజాప్రతినిధులతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ
- పెండింగ్ బిల్లులను క్లియర్ చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి హామీ




ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రాజెక్టులకు అధికమొత్తంలో నిధులు కేటాయించాలని ఆ జిల్లా ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

హైదరాబాద్(జనంసాక్షి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలతో భేటీ అయ్యారు. ఆ జిల్లా సాగునీటి ప్రాజెక్టు పనుల పురోగతిపై ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో సమీక్షా సమావేశం నిర్వహించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు భూసేకరణ ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి ప్రజా ప్రతినిధులకు రేవంత్‌రెడ్డి కీలక సూచనలు చేశారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ ప్రక్రియను మిగతా 2లో..

**కేసీఆర్ హయాంలో జరిగిన**

## తప్పులను సరిదిద్దుతాం

పాలమూరు ప్రాజెక్టులను పూర్తి చేయడమే లక్ష్యం

అధికారులతో సమీక్షించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



2లో..

## కేబినెట్ భేటీ 23కు వాయిదా ?

సరస్వతీ పుష్కరాల నేపథ్యంలో నిర్ణయం

23న యాదగిరిగుట్టలో నిర్వహించే యోచన



# వీధి కుక్కల్ని ఉపేక్షించొద్దు

**వాటిని తరలించాల్సిందే**

**ప్రజల ప్రాణాలతో చెలగాటమొద్దు**

- ప్రతి జిల్లాలో పూర్తిస్థాయిలో బర్త్ కంట్రోల్
- స్కూళ్లు, కాలేజీలు, బస్టాండ్లలో కుక్కలను లేకుండా చేయాలి
- గతంలో ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాల్సిందే
- మరోసారి స్పష్టం చేసిన సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ(జనంసాక్షి): వీధికుక్కల బెడదను రూపుమాపాల్సిందేనని సుప్రీం మరోమారు స్పష్టం చేసింది. ఈ విషయంలో రాజీలేదని తెలిపింది. ఇది ప్రజల ప్రాణాల భద్రతకు సంబంధించిన అంశగా పేర్కొంది. బహిరంగ ప్రదేశాల్లో వీధి కుక్కలను తొలగించాలంటూ గతంలో జారీ చేసిన ఆదేశాలను ఉపసంహరించాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. గతంలో జారీ చేసిన ఆ ఉత్తర్వులను సవరించాలని చేసిన విజ్ఞప్తిని కూడా సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. స్కూల్, కాలేజీ, రైల్వే స్టేషన్, బస్టాండ్ తదితర బహిరంగ ప్రదేశాల్లో కుక్కలను తొలగించాలంటూ జంతు ప్రేమికులు దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు మంగళవారం విచారించింది. ఈ సందర్భంగా జంతు సంక్షేమ బోర్డు దాఖలు చేసిన అన్ని పిటిషన్లను సుప్రీం కోర్టు కొట్టివేసింది. ఈ సందర్భంగా తన తీర్పులో.. పలు కీలక అంశాలను సుప్రీంకోర్టు ప్రస్తావించింది. వీధి కుక్కల సమస్యను జంతు సంక్షేమ అంశంగా కాకుండా ప్రజల ప్రాణాల భద్రతకు సంబంధించిన అంశంగా పరిగణించాలని పిటిషనర్లకు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. యానిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియా రూపొందించిన నియమావళిని సమర్థవంతంగా అమలు చేయడం కోసం అవసరమైన చర్యలు మిగతా 2లో..



# గత పరీక్షలో గుర్తించిన లోపాలను పరిష్కరించాలి

**'నీట్'పై కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఉన్నతస్థాయి సమీక్ష**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** మళ్లీ నిర్వహించనున్న నీట్-యూజీ పరీక్షపై కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. కట్టుదిట్టమైన భద్రత, ప్రొటోకాల్‌తో పరీక్షను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పరీక్ష నిర్వహణలో సమగ్రత, పారదర్శకత అవసరాన్ని గుర్తుచేశారు. గత పరీక్షలో గుర్తించిన లోపాలను పరిష్కరించాలన్నారు. నీట్ పరీక్షపై కలెక్టర్లు, ఎస్పీలతో సమన్వయ సమావేశాలు జరపాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద అప్రమత్తత, భద్రతపై రాజీపడొద్దన్నారు. నీట్ ప్రశ్నపత్రం లీక్‌పై సీబీఐ విచారణ జరుగుతోందని.. ఈ కేసుతో సంబంధం ఉన్న పలువురిని ఇప్పటికే పోలీసులు అరెస్ట్ చేశారని కేంద్రమంత్రి పేర్కొన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులు నష్టపోకూడదనే పరీక్ష రద్దు చేసి మళ్లీ నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థుల భవిష్యత్తు బాగుండేలా చూడటమే మొదటి లక్ష్యమన్నారు. 2026 నీట్ మిగతా 2లో..

## భారత్‌కు పుతిన్

ఏడాది వ్యవధిలో రెండోసారి పర్యటించనున్న రష్యా అధ్యక్షుడు

9లో..

**ఆదానీపై అమెరికాలో నమోదైన**

## కేసులు కొట్టివేత

ఆధారాలు లేవని తేల్చిన న్యాయశాఖ

**ఉద్యోగులు, పెన్షనర్ల కోసం**

# హెల్త్ కేర్ ట్రస్ట్

**31 లోపు పోర్టల్‌లో ఉద్యోగుల వివరాలు నమోదు**

**తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం**

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య భద్రత కోసం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ పెన్షనర్లకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు



కొత్తగా ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసింది. ఈ కొత్త హెల్త్ స్కీమ్ అమల్లో భాగంగా రాష్ట్ర ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ అన్ని ప్రభుత్వ శాఖలకు అత్యవసర ఆదేశాలు జారీ చేసింది. ఈ పథకం ద్వారా ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు వైద్య భద్రత కల్పించడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యంగా తెలుస్తోంది. ఉద్యోగుల ఆరోగ్య సేవలను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక ట్రస్ట్ ఏర్పాటు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యోగుల పూర్తి సమాచారాన్ని సేకరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక మిగతా 2లో..




# శాస్త్రీయ పద్ధతిలో వ్యర్థాల నిర్వహణ

- సుస్థిర పట్టణాభివృద్ధి, సర్క్యులర్ ఎకానమీ దిశగా చర్యలు
- తెలంగానలో పక్కాగా ఘన వ్యర్థాల నిర్వహణ కార్యక్రమం
- బయో ఎరువులు, విద్యుత్ ఉత్పత్తికి అధిక ప్రాధాన్యమిస్తున్నాం
- న్యూఢిల్లీ స్వచ్ఛ భారత్ మిషన్ జాతీయ సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి

న్యూఢిల్లీ(జనంసాక్షి): తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన తెలంగాణ విజన్-2047 లక్ష్యాలకు అనుగుణంగా భవిష్యత్ అవసరాలకు సరిపోయే విధంగా, సుస్థిరంగా, సమగ్రంగా, పర్యావరణహితంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి దిశగా ప్రభుత్వం క్యూర్, ప్యూర్, రేర్ అభివృద్ధి విధానాన్ని అనుసరిస్తోందని, ఇందులో కోర్ అర్బన్ రీజియన్, పెరి అర్బన్ రీజియన్, రూరల్ అగ్రికల్చరల్ రీజియన్‌ల సమతుల్య అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించారు. ఘన వ్యర్థాల నిర్వహణ అనేది ఇకపై కేవలం చెత్త సేకరణకు పరిమితం కాదని, అది వాతావరణ మార్పులకు ప్రతిస్పందన, పర్యావరణ సుస్థిరత, సర్క్యులర్ ఎకానమి, ఉపాధి కల్పన, ఆర్థిక ఉత్పాదకతలతో నేరుగా అనుసంధానమై ఉందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా పట్టణ పరిశుభ్రత, పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో మంగళవారం కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ అధ్యక్షతన ప్రారంభమైన రెండు రోజుల 'స్వచ్ఛ భారత్ మిషన్-అర్బన్ 2.0' జాతీయ సమీక్ష సమావేశానికి తెలంగాణ రాష్ట్రం తరపున ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు హాజరయ్యారు. మొదటి రోజు సమావేశంలో దేశంలోని పట్టణ ప్రాంతాల్లో పరిశుభ్రత, పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, ఇంటింటి చెత్త సేకరణ, వ్యర్థాల శాస్త్రీయ ప్రాసెసింగ్, పాత చెత్త కుప్పల తొలగింపు, వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి, పీపీపీ విధానాలు, కొత్త ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనల అమలు వంటి అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. రాష్ట్రాలు, నగరాలు అమలు చేస్తున్న అనుభవాలు, ఉత్తమ విధానాలను పరస్పరం పంచుకోవడంపై కూడా సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణ విధానాలు, సుస్థిర పట్టణాభివృద్ధి మిగతా 2లో..



## దేశం తీవ్ర ఆర్థిక సంక్షోభం ఎదుర్కోబోతుంది

**విపక్షనాయకుడు రాహుల్ గాంధీ**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** దేశ ఆర్థిక వ్యవస్థకు సంబంధించి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. ముమ్ముందు చాలా కష్టకాలం రానుందని చెప్పిన ఆయన.. చాలా సంవత్సరాలుగా చూడని తీవ్ర ఆర్థిక సంక్షోభం రాబోతోందన్నారు. అదానీ, అంబానీ వంటి వారిపై ఇది ఎటువంటి ప్రభావం చూపదని.. దేశ యువత, రైతులు, చిన్న వ్యాపారులపై తీవ్ర ప్రభావం చూపిస్తుందన్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా తన సొంత నియోజకవర్గం రాయ్‌బరేలీకి మిగతా 2లో..

**ఉపా కేసుల్లోనూ 'బెయిలే రూల్.. జైలు మినహాయింపు'**

# రాజ్యాంగ సూత్రం వర్తిస్తుంది



**విచారణ జాప్యం పేరుతో నిరవధిక ఖైదు కుదరదు**

**సుప్రీం కోర్టు సంచలన వ్యాఖ్యలు**

- న్యాయాధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే అధికారం హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు లేదు
- రాష్ట్ర బార్ కౌన్సిళ్ల ఎన్నికల వివాద పరిష్కారానికి రెండు ట్రైబ్యునళ్లు ఏర్పాటు

న్యూఢిల్లీ(జనంసాక్షి): కఠిన నిబంధనలతో కూడిన 'చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం' (యూఏపీఏ-ఉపా) కేసుల్లో కూడా 'బెయిలే రూల్.. జైలు మినహాయింపు' అనే రాజ్యాంగ సూత్రం వర్తిస్తుందని సుప్రీంకోర్టు పేర్కొంది. జమ్మూకశ్మీర్‌కు చెందిన నార్కో-టెర్రర్ కేసు నిందితుడు సయ్యద్ ఇఫ్తిఖార్ అంద్రాబీకి బెయిల్ మంజూరు చేస్తూ జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భూయాన్ ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఉపా కింద కేసు దాఖలైనప్పటికీ.. విచారణ ఆలస్యం పేరుతో వ్యక్తిని నిరవధికంగా జైలులో ఉంచలేమని స్పష్టం చేసింది. అంద్రాబీ తన పాస్‌పోర్ట్‌ను సమర్పించాలని, ప్రతి 15 రోజులకు ఒకసారి స్థానిక పోలీస్ స్టేషన్‌లో హాజరు కావాలని కోర్టు ఆదేశించింది. ఈ కేసును జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) 2020లో నమోదు చేసింది. కాగా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి లేదా జడ్జీల కమిటీ అనుమతిలేకుండా న్యాయాధికారులపై తనకు తానుగా క్రమశిక్షణ చర్యలు తీసుకునే అధికారం హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు లేదని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. అనుమతిలేని ఆ చర్యలు చెల్లవని మిగతా 2లో..

# చర్చల్లో పాల్గొనడమంటే లొంగిపోయినట్లు కాదు

**అమెరికాతో సంప్రదింపుల నేపథ్యంలో ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు**

**ఇరాన్‌పై దాడికి ట్రంప్ వెనక్కి • గల్ఫ్ దేశాల అభ్యర్థన మేరకు నిర్ణయం**

టెహ్రాన్(జనంసాక్షి): అమెరికాతో చర్చలు కొనసాగుతోన్న నేపథ్యంలో ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. చర్చల్లో పాల్గొనడం అంటే.. లొంగిపోయినట్లు కాదన్నారు. దేశ హక్కులను పరిరక్షిస్తూనే.. తాము చర్చల్లో పాల్గొంటున్నామన్నారు. ఈ సందర్భంగా దేశం, ప్రజల చట్టపరమైన హక్కుల విషయంలో మిగతా 2లో..



**ఆపరేషన్ సిందూర్‌కు వ్యతిరేకంగా**

## బునియాన్ ఉల్ మర్సూస్

- రాజౌరీ, మామూన్ ఎయిర్ బేస్‌లను మా క్షిపణులు ధ్వంసం చేశాయి
- భారత్ వ్యతిరేక ఆపరేషన్‌ను చేపట్టామని పాక్ అధికారి గొప్పలు
- అసలు అక్కడ ఎటువంటి భారత వైమానిక దళ ఎయిర్‌బేస్ లేదన్న భారత అధికారులు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** గతేడాది భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు వ్యతిరేకంగా తాము 'బునియాన్ ఉల్ మర్సూస్' ఆపరేషన్‌ను చేపట్టామని పాక్ అధికారి ఒకరు వెల్లడించారు. ఆ సమయంలో భారత్‌లోని రాజౌరీ, మామూన్ ఎయిర్ బేస్‌లను తమ క్షిపణులు తాకినట్లుగా గొప్పలు చెప్పారు. మిగతా 2లో..



# జలమండలిలో అవినీతి జలగ

**జనరల్ మేనేజర్ కుమార్ ఇళ్లపై ఏసీబీ దాడులు**

**సోదాల్లో కుప్పలు తెప్పలుగా నగదు, నగలు స్వాధీనం**

**హైదరాబాద్, నిజామాబాద్, రంగారెడ్డిలలో స్థిరాస్తుల గుర్తింపు**

హైదరాబాద్(జనంసాక్షి): హైదరాబాద్ జలమండలిలో భారీ తిమింగలం పట్టుబడింది. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన జనరల్ మేనేజర్ కుమార్ నివాసంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించగా భారీ మిగతా 2లో..



## వాట్సాప్ మీసేవలో మరిన్ని జీహెచ్ఎంసీ సేవలు

- అందుబాటులోకి కొత్తగా తొమ్మిది పౌర సేవలు
- డిజిటల్ సేవలను మరింత విస్తరించిన ప్రభుత్వం




**హైదరాబాద్, మే19 (జనంసాక్షి) :** జీహెచ్ఎంసీకి సంబంధించిన పౌర సేవలను కొత్తగా మీసేవ వాట్సాప్, చాట్‌బాట్ ద్వారా తెలంగాణ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రజలకు మరింత సౌకర్యం, అందుబాటు, పారదర్శకత కల్పించే దిశగా ఈ సేవలను విస్తరించారు. ఈ మేరకు ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ విభాగం ఒక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నాయకత్వంలో మీసేవ ద్వారా పౌర సేవలను మరింతగా తీర్చిదిద్దుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వ డిజిటల్ సేవల ప్రధాన వేదికగా ఉన్న మీసేవను వాట్సాప్, చాట్‌బాట్ ద్వారా మరింత విస్తరించారు. ఈ అదనపు డిజిటల్ ఛానల్‌ను 2025 నవంబర్ 18న ప్రారంభించారు. కొత్తగా జీహెచ్ఎంసీ ప్రాపర్టీ అసెస్‌మెంట్ రివిజన్, జనన ధ్రువీకరణ సవరణ, మరణ ధ్రువీకరణ సవరణ, బర్త్ హోమ్, డెత్ హోమ్, ప్రాపర్టీ డోర్ నంబర్ సవరణ, ప్రాపర్టీ పేరు సవరణ, ప్రాపర్టీ ట్యాక్స్ సేవలు, ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ సేవలను వాట్సాప్ మీసేవలో చేర్చారు. రాష్ట్రవ్యాప్తంగా పౌరులు ఈ సేవలను వాట్సాప్ ద్వారానే పొందవచ్చని ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ విభాగం తెలిపింది. సేవలు పొందేందుకు ముందుగా 8096958096 నంబర్‌ను మొబైల్‌లో పేరుతో సేవ్ చేసుకోవాలి. అనంతరం వాట్సాప్‌లో ఆ నంబర్‌కు సందేశం పంపాలి. అవసరమైన సేవ పేరు టైప్ చేసి, మెనూలో కనిపించే ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. ఫారంలో అడిగిన వివరాలు, చెల్లింపు పూర్తిచేస్తే దరఖాస్తు వెంటనే వాట్సాప్ ద్వారా నమోదవుతుంది. వాట్సాప్ ఆధారిత మీసేవ వేదికకు ప్రారంభం నుంచి ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని ప్రభుత్వం వెల్లడించింది. జనన ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, పోలీస్ చలాన్, విద్యుత్ బిల్లు, బీఐఈ ఫలితాల సేవలను ప్రజలు ఎక్కువగా వినియోగిస్తున్నట్లు తెలిపింది. రోజువారీ పరిపాలన సేవలకు వాట్సాప్‌పై ప్రజల ఆధారపడటం పెరుగుతోందని పేర్కొంది. డిజిటల్ సేవలను నిరంతరం విస్తరించడం, ప్రభుత్వ వ్యవస్థల విశ్వసనీయతను బలోపేతం చేయడం, పౌరులకు సులభమైన అనుభవం కల్పించడం తమ లక్ష్యమని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది.

# డిజిటలైజేషన్‌తో జర్నలిజంలో మార్పులు

- ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి
- మీడియా అకాడమీ చర్చలో సీనియర్ జర్నలిస్టుల వెల్లడి



**హైదరాబాద్, మే19 (జనంసాక్షి) :** నేటి డిజిటల్ యుగంలో జర్నలిజం రంగం వేగంగా మారుతున్న నేపథ్యంలో మీడియా వృత్తిదారులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ముందుకు సాగాలని పలువురు సీనియర్ జర్నలిస్టులు అభిప్రాయపడ్డారు. తెలంగాణ, మీడియా అకాడమీ, చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన నాంపల్లిలోని మీడియా అకాడమీ భవనంలో మంగళవారం నిర్వహించిన జర్నలిస్టుల చర్చా కార్యక్రమంలో పలువురు సీనియర్ జర్నలిస్టులు, అకాడమీకి అనుబంధ సభ్యులు పాల్గొని మీడియా రంగ భవిష్యత్ దిశ, డిజిటలైజేషన్, మీడియా చట్టాలు, శిక్షణ కార్యక్రమాలు, జర్నలిస్టుల సంక్షేమ అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా సమాచార,పౌర సంబంధాల శాఖ ప్రత్యేక ప్రధాన కమిషనర్ జి. ముకుంద్ రెడ్డి, కార్యక్రమంలో పాల్గొని జర్నలిస్టులను అభినందించారు. జర్నలిజం డిగ్రీ చదివే రోజుల్లో పత్రికల ఎడిటోరియల్స్ చదవడం ద్వారా సివిల్ సర్వీసులపై ఆసక్తి పెరిగిందని, అదే తన విజయానికి పునాది అయిందని తెలిపారు. నేడు మీ అందరి ముందుకు రావడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. సమావేశంలో ఐ. వెంకట్ రావు మాట్లాడుతూ మీడియా అకాడమీ చేపడుతున్న కార్యక్రమాలను అభినందిస్తూ మరిన్ని పుస్తకాలను అకాడమీకి అందజేస్తానని తెలిపారు.మాజీ ఎమ్మెల్సీ అమిర్ అలీ ఖాన్ మాట్లాడుతూ జర్నలిజం తనకు ధైర్యం, గుర్తింపు ఇచ్చిందని పేర్కొంటూ అకాడమీకి కృతజ్ఞతలు తెలిపారు. ఉడుముల సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఆధునిక జర్నలిజానికి అనుగుణంగా అకాడమీ డిజిటల్ క్లాసులు, ఇంక్యుబేటర్ ఏర్పాటు చేయాలని, గ్యాగ్ ఆర్డర్ వంటి అంశాలపై చర్చలు నిర్వహించాలని సూచించారు. దేవులపల్లి అమర్ మాట్లాడుతూ 16 మంది వెటరన్ జర్నలిస్టుల వీడియోలను పుస్తకాల రూపంలో తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న పలువురు సభ్యులు మీడియా రంగంలో కృత్రిమ మేధస్సు ప్రభావం పెరుగుతోందని, జర్నలిస్టులు నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మీడియా అకాడమీ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు ఆధునిక శిక్షణా కార్యక్రమాలు, ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాములు, డెస్క్ జర్నలిస్టులకు ప్రత్యేక శిక్షణలు నిర్వహించాల్సిన అవసరం ఉందని సూచించారు. అకాడమీ భవనంలోని డిజిటల్ సదుపాయాలు, ఆధునిక ఆడిటోరియం, బోర్డు రూమ్, లైబ్రరీ, కంప్యూటర్ రూమ్ వంటి వసతులను మరింత సమర్థవంతంగా వినియోగించి జర్నలిస్టులకు ప్రయోజనం కలిగించాలని అభిప్రాయపడ్డారు. పాత పత్రికలు, అరుదైన పుస్తకాలు, నిజాం కాలం నాటి ప్రచురణలు, తెలుగు గ్రంథాలు తదితరాలను డిజిటలైజ్ చేసి భవిష్యత్ తరాలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. పలువురు సీనియర్ జర్నలిస్టులు తమ వద్దనున్న విలువైన పుస్తకాలను మీడియా అకాడమీ లైబ్రరీకి విరాళంగా అందిస్తామని తెలిపారు. సీనియర్ జర్నలిస్టులు మాట్లాడుతూ మీడియా చట్టాలలో కాలానుగుణ మార్పులు అవసరమని, సోషల్ మీడియాకు ప్రత్యేక ప్రవర్తనా నియమావళి తీసుకురావాలని పేర్కొన్నారు. మహిళా జర్నలిస్టులు మరియు గ్రామీణ ప్రాంత జర్నలిస్టుల కోసం ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. జర్నలిజం అనేది సమాజానికి అద్దం పట్టే వృత్తి అని, భయపడకుండా నిజాయితీతో వార్తలను ప్రజలకు అందించాల్సిన బాధ్యత జర్నలిస్టులపై ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. మీడియా అకాడమీ 1996 నుండి జర్నలిస్టుల అభివృద్ధికి విశేష సేవలు అందిస్తోందని, పుస్తక ప్రచురణలు, మోనోగ్రాఫ్‌లు, శిక్షణా కార్యక్రమాలు మీడియా రంగానికి ఎంతో ఉపయోగపడుతున్నాయని అభినందించారు. చర్చా కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు కె. రాంచందర్ మూర్తి, కేశవరావు దాసు, ఎస్. నాగేష్ కుమార్, డి. అమర్, బండారు శ్రీనివాస్ రావు, రవీందర్ ఎం.పీ., దిలీప్ రెడ్డి, మాడభూషి శ్రీధర్, ఎం. సుబ్బారావు, జగన్, ఆర్.వి. రామారావు, ఎస్. వినయ్ కుమార్, వై. నరేందర్ రెడ్డి, విరాహత్ అలీ తదితరులు పాల్గొని మీడియా రంగంలో వస్తున్న మార్పులు, డిజిటలైజేషన్, జర్నలిస్టుల శిక్షణ, మీడియా చట్టాలు, సోషల్ మీడియా ప్రభావం, పుస్తక ప్రచురణలు, అకాడమీ భవిష్యత్ కార్యాచరణపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మీడియా అకాడమీ చేపడుతున్న కార్యక్రమాలను పలువురు ప్రశంసించారు. జర్నలిస్టుల సంక్షేమం, శిక్షణ, డిజిటలైజేషన్, మీడియా ఆధునీకరణ దిశగా అకాడమీ మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన ప్రముఖులందరిని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వర రావు శాలువాలతో సీనియర్ జర్నలిస్టులను సత్కరించారు.

## భవసార్ విజన్ ఇండియా సమావేశం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** హైదరాబాద్‌లోని ఆబిడ్స్ ఆర్యవైశ్య హాల్‌లో భవసార్ విజన్ ఇండియా హైదరాబాద్ ప్రాంతం – 104 ఆధ్వర్యంలో స్పీకర్ మీటింగ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా సమాజ భూషణ్ కిషన్ రావ్ గడాలే, మోహన్ దేవతరాజ్, ప్రవీణ్ పతంగె, అశ్విని పతంగె (అధ్యక్షురాలు), ధనశ్యామ్ పతంగె (మంత్రి), జవహర్ భరడే (కోశాధ్యక్షులు) సమాజంలోని ఇతర పదాధికారులు, సభ్యులు హాజరయ్యారు. కార్యక్రమ ప్రారంభంలో సంస్కృతి ముధోల్కర్ విద్యార్థులు అందమైన కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. వారి అద్భుతమైన ప్రదర్శన అందరి మనసులను ఆకట్టుకుని కార్యక్రమానికి సాంస్కృతిక శోభను తీసుకొచ్చింది.

కార్యక్రమంలోని ముఖ్య ఆకర్షణగా సందీప్ ముధోల్కర్ 'సైబర్ క్రైమ్, దాని నివారణ' అనే అంశంపై ఎంతో జ్ఞానవర్థకమైన, ప్రేరణాత్మక ఉపన్యాసాన్ని అందించారు. ఆయన వివిధ రకాల సైబర్ నేరాలు, డిజిటల్ యుగంలో ఎదురయ్యే సవాళ్లు, అలాగే ఆన్‌లైన్ భద్రత కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి విపులంగా వివరించారు. ఆయన చెప్పిన ప్రాయోగిక ఉదాహరణలు, మార్గదర్శకాలు సభ్యులందరిలో అవగాహన పెంపొందించాయి. డిజిటల్ వేదికలను జాగ్రత్తగా, బాధ్యతాయుతంగా వినియోగించేందుకు ప్రేరణనిచ్చాయి. ఈ సమావేశం ఎంతో పరస్పర చర్చాత్మకంగా, జ్ఞానవర్థకంగా సాగి, హాజరైన ప్రతి సభ్యునికీ ప్రయోజనకరంగా నిలిచింది. సమాజానికి ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న బీవీఐ హైదరాబాద్ కృషిని సభ్యులు ప్రశంసించారు. కార్యక్రమ నిర్వహణను ప్రేరణాత్మకంగా చేపట్టిన నిర్వాహక బృందానికి అందరూ అభినందనలు తెలిపారు. దయానంద్ పతంగె, ధనశ్యామ్ పతంగె సభ్యులందరికీ వర్షాకాలంలో ఉపయోగపడే గొడుగులను బహుమతిగా అందించారు. నందిత భావోద్వేగభరిత గానం అందరి హృదయాలను హత్తుకోగా, శ్రీధర్ గడాలే మధుర స్వరం శ్రోతలను మంత్రముగ్ధులను చేసింది. తమ అమూల్యమైన జ్ఞానాన్ని పంచుకున్న అతిథులకు, కార్యక్రమంలో పాల్గొని సహకరించిన ప్రతి సభ్యునికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

## భార్యను చంపిన భర్త అరెస్ట్

- భర్తతోపాటు ఐదుగురు రిమాండ్‌కు పంపిన పోలీసులు




**చెన్నూర్ మే 19 (జనం సాక్షి) :** చెన్నూర్ మండలంలోని ఎల్లక్కపేట గ్రామంలో చల్ల శారద (24)ను అతి కిరాతకంగా హతమార్చిన హత్య కేసు పోలీసులు చేదించారు. తేది 18-05-2026 న మధ్యాహ్నం 1 గంటల సమయంలో చల్ల శారద, భర్త రమేష్, వయసు 27 సం, కులం బూడిగ జంగం, వృత్తి గృహిణి, నివాసం ఎల్లక్కపేట, చెన్నూర్ మండలం అను మహిళను తన భర్త చల్ల రమేష్ అతని స్నేహితుడు గంధం సారయ్య సహాయంతో శారద అత్త మామ ఆడపడుచు అయిన చల్ల వెంకమ్మ, చల్ల అబ్బయ్య పుష్పలత ప్రొధ్బలంతో అదనపు కట్నం కొరకు వేదించడమే గాక ఎలాగైనా తనను అడ్డు తొలిగించుకోవాలని ఎల్లక్కపేట లోని తన ఇంటి నందు సుత్తి తో ఆమె తలపై బాది హత్య చేసాడని శారద తండ్రి పురాణం ఎల్లయ్య, నివాసం అడ్డగుంటపల్లి, గోదావరిఖనిలో పిర్యాదు మేరకు సోమవారం జరిగిన హత్య ఘటన చెన్నూర్ పట్టణ పోలీసులు క్రైమ్ నెంబర్ 134/26 సెక్షన్ 80 (2), 103 (1) ర్ /వర్క్ 3 (5) బీఎన్ఎస్ 3 అండ్ 4 డీపీ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి జైపూర్ ఏసీపీ ఆరే వెంకటేశ్వర్ సారథ్యంలో దర్యాప్తు ప్రారంభించి చెన్నూర్ పట్టణ సీఐ ఎస్ ఐ లు పోలీస్ సిబ్బంది తో కలసి విచారణ చేపట్టిన ఈరోజు శారద ను హత్య చేసిన చల్ల రమేష్(30), అతనికి సహకరించిన గంధం సారయ్య లను ఈరోజు ఉదయం 11 గంటల సమయంలో ఎల్లక్కపేట సింగరేణి క్వార్టర్స్ ఏరియాలో పట్టుకొని విచారించగా రమేష్ కు అతని భార్యకు మధ్య గత సంవత్సర కాలంగా గొడవలు జరుగుతున్నాయని అందువలన భార్యాభర్తల మధ్య చాలాసార్లు పంచాయతీలు జరిగినాయి అయినను రమేష్ తన తల్లి దండ్రుల ఆడపడుచు ప్రొధ్బలంతో అదనపు కట్నం కొరకు వేదించడమే రమేష్ భార్య శారద తరచు తన పుట్టింటికి వెళ్ళిపోవడం వల్ల రమేష్ తన భార్యకు మరొకరితో సంబంధం ఉందన్న ఆలోచనతో తనను ఎలాగైనా అడ్డు తొలిగించుకోవాలని నిర్ణయించుకొని సోమవారం మధ్యాహ్నం 1 గంటల సమయంలో తన స్నేహితుడు గంధం సారయ్య కు ఫోన్ చేసి తన ఇంటికి పిలిపించుకొని అతని సహాయంతో శారద ను సుత్తి తో తలపై పలుమార్లు గట్టిగా కొట్టడంతో ఆమె చనిపోయింది అని నిర్ధారించుకొన్న తర్వాత సారయ్య అక్కడి నుండి పారిపోయినాడు రమేష్ శారదను చెన్నూర్ ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించి అతను అక్కడినుండి తప్పించుకుని సారయ్య వద్దకు వచ్చి ఇరువురు కలసి ఎల్లక్కపేట లోని మూతబడిన సింగరేణి క్వార్టర్స్ నందు దాక్కొని ఉండగా ఈరోజు చెన్నూర్ పోలీస్ లకు వచ్చిన సమాచారం మేరకు వారిని పట్టుకొని వారివద్దనుండి శారదను హత్యకు ఉపయోగించిన సుత్తి ని రక్తపు మరకలు అంటిన వారిద్దరి దుస్తులను, మొబైల్ ఫోన్స్ లను స్వాధీన పరుచుకున్న అనంతరం వీరిద్దరినీ రమేష్ తల్లిదండ్రులు అయిన వెంకమ్మ, అబ్బయ్య చెల్లెలు పుష్పలత సహా ఐదుగురిని పోలీస్ స్టేషన్ కు తీసుకువచ్చి అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం మంచిర్యాల న్యాయస్థానం ముందు ప్రవేశపెట్టినట్లు జైపూర్ ఏసీపీ తెలిపినారు. ఈ సమావేశంలో చెన్నూర్ పట్టణ సీఐ బన్సీలాల్, ఎస్ ఐ లు శ్యామ్ పటేల్, రాజశేఖర్ చెన్నూర్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## బస్తర్‌కు చారిత్రాత్మక ఆరోగ్య సంరక్షణ ముందడుగు

**జగదల్‌పూర్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి ఎన్ఎమ్‌డిసి రూ. 25 కోట్ల పెట్టుబడి**




**హైదరాబాద్, మే 19 (జనంసాక్షి) :** బస్తర్ వ్యాప్తంగా ఆరోగ్య సంరక్షణ అందుబాటును మార్చే దిశగా ఒక చారిత్రాత్మక అడుగు వేస్తూ, ఛత్తీస్‌గఢ్ గౌరవ ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి సమక్షంలో గౌరవ కేంద్ర హోం మంత్రి అమిత్ షా సోమవారం జగదల్‌పూర్‌లోని ఒక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని వర్చువల్‌గా ప్రారంభించారు. ఛత్తీస్‌గఢ్‌లో పారిశ్రామిక, సామాజిక అభివృద్ధికి కీలక చోదక శక్తిగా ఉన్న ఎన్ఎమ్‌డిసి, ఈ ఆసుపత్రి ప్రారంభోత్సవంలో ఒక సహాయక శక్తిగా నిలిచింది. ఆసుపత్రి కార్యకలాపాల కోసం రూ. 25 కోట్లు పెట్టుబడి పెట్టిన ఈ సంస్థ, రాబోయే ఐదేళ్లపాటు ఇదే స్థాయిలో నిరంతర ఆర్థిక సహాయం అందించడానికి కట్టుబడి ఉంది. తద్వారా ఈ ఆసుపత్రి ఒక స్వయం సమృద్ధిగల ఆరోగ్య సంరక్షణ వ్యవస్థగా అభివృద్ధి చెందడానికి సహాయపడుతుంది. ప్రధాన మంత్రి స్వస్థ్య సురక్ష యోజన ఆధ్వర్యంలో ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం అభివృద్ధి చేసిన ఈ ఆసుపత్రి, చారిత్రాత్మకంగా ప్రత్యేక చికిత్స కోసం సుదూర ప్రాంతాలకు ప్రయాణించవలసి వచ్చిన బస్తర్‌లోని గిరిజన వర్గాల యొక్క కీలకమైన ప్రాంతీయ ఆరోగ్య సంరక్షణ అవసరాన్ని తీరుస్తుంది. ఈ ప్రాంతంలో అందుబాటులో ఉండే తృతీయ స్థాయి ఆరోగ్య సంరక్షణ యొక్క తీవ్రమైన అవసరానికి ప్రతిస్పందనగా ఎన్ఎండీసీ ఒక ప్రసిద్ధ ప్రైవేట్ ఆరోగ్య సంరక్షణ భాగస్వామిని చేర్చుకుని, ఆర్థిక సహాయం అందించడం ద్వారా ఈ సదుపాయం కార్యాచరణ సంసిద్ధతను నిర్ధారించింది. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కార్యకలాపాల నిర్వహణ బాధ్యతను ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రికి, ప్రారంభ కార్యాచరణ వ్యయానికి నిధులు సమకూర్చే బాధ్యతను ఎన్ఎండీసీకి అప్పగించింది. జగదల్‌పూర్‌లోని దిమ్రాపాల్‌లో ఉన్న ఈ ఆసుపత్రి, కీలకమైన ఆరోగ్య సంరక్షణ అవసరాల కోసం మహానగర కేంద్రాలపై ఆధారపడటాన్ని తగ్గించి, దక్షిణ ఛత్తీస్‌గఢ్‌లోని వేలాది కుటుంబాలకు నాణ్యమైన వైద్య చికిత్సను సకాలంలో అందించేలా చేస్తుందని భావిస్తున్నారు. దశాబ్దాలుగా ఎన్ఎండీసీ బస్తర్‌లో, ముఖ్యంగా ఆరోగ్య సంరక్షణ మరియు విద్యారంగంలో సామాజిక మౌలిక సదుపాయాల నిర్మాణంలో పెట్టుబడులు పెడుతోంది. స్థానిక గిరిజనులకు ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకుంటూ, చీవీణజ మద్దతుతో నిర్మించిన ఈ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, ఈ ప్రాంత అభివృద్ధి ప్రస్థానంలో ఒక కీలక ఘట్టంగా నిలుస్తుంది. బస్తర్ ప్రజలకు ఆరోగ్య సంరక్షణ అందుబాటును మెరుగుపరచడంలో ఇది ఒక ప్రధాన ముందడుగు. ఈ ఆసుపత్రి, తగినంత వైద్య సేవలు అందని వర్గాలకు ఉచిత చికిత్సను అందిస్తుంది.

## ఎప్‌సెట్ ఫలితాల్లో మైనారిటీ గురుకుల విద్యార్థులు టాప్

- హర్షం ప్రకటించిన రాష్ట్ర మైనారిటీ సంఘం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఇంజనీరింగ్, అగ్రి కల్చర్, ఫార్మసీ కోర్సులలో ప్రవేశానికి నిర్వహించిన ఈఏపీసెట్ పరీక్షలో మైనారిటీ గురుకుల కళాశాలల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చడం పట్ల రాష్ట్ర మైనారిటీ సంఘం అధ్యక్షులు ఎండీ యాకూబ్ పాషా మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కార్పొరేట్ కళాశాలలకు ఏమాత్రం తీసిపోకుండా ఈ ఏడాది మైనారిటీ గురుకుల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని పేర్కొన్నారు. హైదరాబాద్ గోషామహల్ మైనారిటీ కళాశాలకు చెందిన బైపీసీ విద్యార్థి ముఖ్రం అహ్మద్ అగ్రికల్చర్ ఫార్మసీ విభాగంలో రాష్ట్ర స్థాయిలో తొలి ర్యాంకు సాధించడం గర్వకారణమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మైనారిటీ గురుకులాల్లో 2273 మంది విద్యార్థులు ఈఏపీసెట్ పరీక్షకు హాజరుకాగా, అందులో 1715 మంది అర్హత సాధించినట్లు తెలిపారు. ఇంజనీరింగ్ విభాగంలో 720 మంది, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో 988 మంది అర్హత సాధించి రాష్ట్ర స్థాయి ర్యాంకులు పొందారని వెల్లడించారు. విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దిన అధ్యాపక బృందానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## కవాడీగూడాలో దారుణ ఘటన

- స్పా సెంటర్‌లో భార్యను హత్య చేసిన భర్త

**హైదరాబాద్, మే19 (జనంసాక్షి) :** గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కవాడిగూడలో కట్టుకున్న భార్యను భర్త అతి కిరాతకంగా చంపేశాడు. గొడవ పడి స్పా సెంటర్‌కు వచ్చిన భార్యపై భర్త కత్తితో దాడి చేసి హత్య చేశాడు. అనంతరం నిందితుడు పోలీసుల ఎదుట లొంగిపోయాడు. బంగి దేబోరా అనే మహిళ తన భర్తతో కలిసి బహదూర్‌పూర్ కిషన్‌బాగ్‌లో నివసిస్తోంది. కవాడిగూడలోని స్పా సెంటర్‌లో మృతురాలు బ్యూటీషియన్‌గా పనిచేస్తోంది. కొంతకా లంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి.మంగళవారం ఉదయం కూడా భర్తతో గొడవపడిన దేబోరా.. విధుల కోసం స్పా సెంటర్‌కు వెళ్లింది. భార్య గొడవపడటంతో ఆగ్రహానికి గురైన భర్త.. కవాడిగూడ రత్నదీప్ బిల్డింగ్‌లోని నాలుగో అంతస్తులో ఉన్న స్పా సెంటర్‌కు వెళ్లాడు. తన వెంట తెచ్చుకున్న కత్తితో భార్యపై విచక్షణారహితంగా దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన మహిళ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. హత్య అనంతరం నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. ఆపై అత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. హత్యపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఘటనా స్థలికి చేరుకుని బంగి దేబోరా మృతుదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

## 8వ కేంద్ర వేతన సవరణ సంఘంతో సీసీజీజీఓఓ, టాప్రా, ఎన్సీసీపీఏ చర్చలు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** కేంద్ర ప్రభుత్వం నియమించిన 8వ కేంద్ర వేతన సవరణ సంఘం వివిధ సంఘాల ప్రతినిధులతో హైదరాబాద్ లో నిర్వహించిన చర్చల్లో సీసీజీజీఓఓ, తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్, ఎన్సీసీపీఏ నాయకులు పాల్గొన్నారు.

కనీస వేతనం రు. 69,000లు చెల్లించాలని, వేతన సవరణ ఫిట్మెంట్ 3.833 గా ఉండాలని, బిఎస్ఎన్ఎల్ లో విలీనమైన డిఓటి పెన్షనర్లకు 37ఏ నిబంధన ప్రకారం పెన్షన్ సవరణ చేపట్టాలని, ఉద్యోగులతో సమానంగా అందరు పెన్షనర్లకు 1.1.2026 కు ముందు మరియు తరువాత రిటైర్ అయిన వారికి పెన్షన్ రివిజన్ చేయాలని, మిలటరీలో వలే సీఏపీఎఫ్, సివిల్ పెన్షనర్లకూ వన్ ర్యాంక్ వన్ పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని పేర్కొన్నారు. ఎన్పీఎస్/యూపీఎస్ పెన్షన్ విధానాలను రద్దు చేసి పాత డిఫైండ్ పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, కోవిడ్ కాలంలో రద్దు చేసిన సీనియర్ సిటిజన్ల రైల్వే ప్రయాణ రాయితీని పునరుద్దరించాలని, దేశ వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలలో సిజిహెచ్ఎస్ వెల్నెస్ సెంటర్లు ఏర్పాటు చేయాలని, 80 సంవత్సరాల సూపర్ సీనియర్ సిటిజన్లకు కేర్ టేకర్ అలవెన్స్ ని మంజూరు చేయాలని, సర్వీసు పెన్షనర్ కాని కుటుంబ పెన్షనర్ కాని మరణించినపుడు రు. 50,000 లు లేదా ఒక నెల పెన్షన్ అంత్యక్రియల ఖర్చులుగా చెల్లించాలని సీసీజీజీఓఓ, టాప్రా, ఎన్సీసీపీఏ రైల్వే, డిఫెన్స్ బృందాలు 8వ కేంద్ర వేతన సవరణ సంఘాన్ని కలిసి పై డిమాండ్లపై చర్చించారు. సీసీజీజీఓఓ జాతీయ చైర్మన్ వి. కృష్ణ మోహన్, సీ.హెచ్. శ్రీనివాస్ రావు (డి.ఆర్.డి.ఓ), టాప్రా నాయకులు రామచంద్రుడు, పి.ప్రభాకర్,జి. అశోక్, యం.అర్జున్, భార్గవాచారి ఎన్సీసీపీఏ నాయకులు ఎన్. సోమయ్య, వై.రాజశేఖర రెడ్డి రైల్వే నాయకులు శ్రీధర్, కె.శివకు మార్, కాన్ఫెడరేషన్ నాగేశ్వరరావు, అజీజ్, డిఫెన్స్ అజయ్, శ్రీకాంత్ గౌడ్, రషీద్ అలీ తదితరులు చర్చల్లో పాల్గొన్నారు.

## శారీరక సాక్షరత ప్రాముఖ్యం పెరగాలి

- పుల్లెల గోపీచంద్

**హైదరాబాద్, మే19 (జనంసాక్షి) :** గచ్చిబౌలి స్టేడియం వేదికగా నిర్వహించిన యూత్ అండ్ స్పోర్ట్స్ వీక్-2026' కార్యక్రమంలో పద్మభూషణ్ పురస్కార గ్రహీత పుల్లెల గోపీచంద్ 'ఫిజికల్ లిటరసీ' అంశంపై ప్రత్యేక ఉపన్యాసం ఇచ్చారు. తెలంగాణ క్రీడాశాఖ ఆధ్వర్యంలో 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మే 18 నుంచి 23 వరకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. యువత సాధికారత, ఫిట్‌నెస్ ప్రోత్సాహం ప్రధాన లక్ష్యాలుగా ఈ వేడుకలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా గోపీచంద్ మాట్లాడుతూ, శారీరక సాక్షరత ప్రాధాన్యత కేవలం క్రీడాకారులకు మాత్రమే కాకుండా సమాజంలోని ప్రతి వర్గానికీ తెలియాల్సిన అవసరం ఉందన్నారు. యువతలో ఆరోగ్యకర జీవనశైలి, క్రమశిక్షణ, మానసిక దృఢత్వం, క్రీడాస్ఫూర్తి పెంపొందించడంలో ఫిజికల్ లిటరసీ కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. క్రీడారంగం దేశానికి కీర్తి ప్రతిష్ఠలు తీసుకువచ్చే ముఖ్యమైన రంగాల్లో ముందుంటుందని, ఆరోగ్యవంతమైన సమాజం అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధికి దోహదం చేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో డా. ఎ. సోనిబాలా దేవి మాట్లాడుతూ, రాష్ట్రంలో క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధి, గ్రామీణ స్థాయిలో క్రీడల ప్రోత్సాహంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. యూత్ అండ్ స్పోర్ట్స్ వీక్-2026' ద్వారా శారీరక ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం, క్రీడల్లో సామాజిక భాగస్వామ్యాన్ని విస్తరించడం, రాష్ట్రంలోని ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించడం లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్లు సుజాత, రవితేజ, గచ్చిబౌలి స్టేడియం అడ్మినిస్ట్రేటర్ కన్నం మధు, కోచ్‌లు మరియు యువ క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సంపాదకీయం

# ప్రజల గుండెల్లో రగిలిన నిప్పు

*ఎన్నికలు అయిదు రాష్ట్రాల్లో ముగిశాయి. ఓటు మల్లన్న బోడి మల్లన్నయ్యాడు. హామీల మల్లన్న నిరాశల మల్లన్నగా మారాడు. ప్రజాస్వామ్యపు పండుగ ముగియగానే అధికార యంత్రాంగం తన నిజస్వరూపాన్ని బయటపెట్టింది. పెట్రోలు, డీజెల్ ధరల పెంపు అనే వాత వేయడంతో సామాన్యుని జీవితం మరోసారి మంటల్లో పడింది.*

ఎన్నికల సమయంలో "ధరలు పెరగవు, సోషల్ మీడియా దుష్ప్రచారాన్ని నమ్మవద్దు" అని స్వయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హెచ్చరించారు. కానీ ఆ మాటలు నోట్లో ఉండగానే చేతిలో ఎన్నికల ఫలితాలు వచ్చిపడ్డాయి. వారం రోజులు తిరక్కముందే చమురు కంపెనీలు ధరలకు రెక్కలు తొడిగాయి. ఇది ప్రజలను మభ్యపెట్టే వ్యూహమా, లేదా పాలకుల నైతిక దివాళా తీతమా అని ప్రశ్నించుకోవాల్సిన సమయం వచ్చింది.

చమురు నిల్వలు ఆరు నెలలకు సరిపోతాయని చెప్పిన అదే నోరు, ఎన్నికలు ముగియగానే ధరల పెంపుకు మద్దతు పలికింది. "కాన్వాయ్ తగ్గించుకుంటాం, విదేశీ పర్యటనలు చేయొద్దు, బంగారం కొనొద్దు" అని ప్రజలకు నీతులు చెప్పిన పాలకులు, తమ బాధ్యతను మాత్రం విస్మరించారు. ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడంలో, విదేశీ మారకద్రవ్యాన్ని నిలబెట్టడంలో కేంద్ర సర్కారు తీవ్రమైన వైఫల్యానికి అద్దం పట్టింది.

పెట్రోలు, డీజెల్ ధరలు పెరిగాయంటే అది కేవలం పంపు వద్ద చెల్లించే అదనపు రూపాయలు మాత్రమే కాదు. ట్రక్కు అద్దె పెరుగుతుంది, కూరగాయలు మండుతాయి, పాలు, నిత్యవసర సరకులు అందనంత ఎత్తుకు దూసుకుపోతాయి. ఇప్పుడు అదే జరుగుతోంది. నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. పైగా త్వరలో ఎల్పీజీ సిలిండర్ ధర కూడా పెరగనున్నదని వస్తున్న సంకేతాలు సామాన్య గృహిణి గుండెను కలచివేస్తున్నాయి.

ఒక్కసారి ఆలోచించండి.. ఉదయం నాలుగు గంటలకు లేచి కూలి పనికి వెళ్ళే కూలీ, పొలాన్ని నమ్ముకున్న రైతు, ఆటో నడిపే చిన్న వ్యాపారి వీరికి ధరల పెంపు అంటే ఏ మాత్రం నీడ ఉండదు. నేతాగణం ప్రసంగాలతో పొట్ట నిండదు, ప్రకటనలతో పిల్లలకు చదువు రాదు. ప్రభుత్వాలు ఎన్నికలకు ముందు ఇచ్చే హామీలను, ఎన్నికల తర్వాత చేసే నిర్ణయాలను ప్రజలు బేరీజు వేసుకోవాలి. ఓటు వేసే హక్కు ఎంత శక్తివంతమైనదో, ప్రశ్నించే హక్కు అంతకంటే శక్తివంతమైనది. ప్రజాస్వామ్యం ఓటు పెట్టి ముగిసేది కాదు, జవాబుదారీతనాన్ని డిమాండ్ చేయడంతో మరింత బలపడుతుంది. పాలకులు ఒక్కటి మాత్రం గుర్తుంచుకోవాలి. ప్రజల నోళ్లు మూయించవచ్చు. ఆకలి పేగుల ఆర్తనాదాలు.. దిక్కు, మొక్కు లేని జనం ఒక్కొక్కరు అగ్ని కణాలై మంటలా ఎగిసిపడతారు.

# డబ్బు ముందు ధర్మం ఓడిపోతుందా?



ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థలో "న్యాయం అందరికీ సమానం" అనే నినాదం ఎంత గొప్పగా వినిపించినా, వాస్తవంలో ఆ న్యాయం డబ్బు, అధికారంతో ఎలా వంగిపోతుందో చూపించే ఉదాహరణల లో అదానీ వ్యవహారం ఇప్పుడు ప్రధాన చర్చగా మారింది. అమెరికా ట్రెజరీ విభాగం ప్రకారం, ఇరాన్‌పై అమెరికా విధించిన ఆంక్షలను ఉల్లంఘిస్తూ ఇరాన్ మూలాల నుంచి వచ్చిన ఎల్పీజీని దుబాయ్ ఆధారిత వ్యాపారుల ద్వారా కొనుగోలు చేసినందుకు అదానీ ఎంటర్‌ప్రైజెస్‌పై 32 ఉల్లంఘనల ఆరోపణలు నమోదయ్యాయి. దీనికి సంబంధించి రూ. 2,200 కోట్లకు పైగా సమానమైన 275 మిలియన్ డాలర్ల సెటిల్‌మెంట్‌కు అంగీకారం కుదిరిందన్న వార్త అంతర్జాతీయంగా పెద్ద చర్చకు దారి తీసింది.

ఇక్కడ అసలు ప్రశ్న "అదానీ తప్పు చేశాడా లేదా?" అన్నది మాత్రమే కాదు. "డబ్బు, రాజకీయ ప్రభావం, అంతర్జాతీయ పెట్టుబడులు న్యాయవ్యవస్థల వైఖరిని ప్రభావితం చేస్తున్నాయా?" అన్నదే పెద్ద ప్రశ్న. మొన్నటి వరకు అమెరికా సంస్థలు అదానీపై తీవ్రమైన ఆరోపణలు చేశాయి. అమెరికా కోర్టుల పరిధిలో ఆయనపై విచారణలు జరిగాయి. అమెరికాలోని కొన్ని దర్యాప్తు సంస్థలు మోసం, ఆంక్షల ఉల్లంఘన, ఆర్థిక అక్రమాలపై దర్యాప్తులు ప్రారంభించాయి. హిండెన్‌బర్గ్ నివేదిక వచ్చిన తర్వాత అదానీ గ్రూప్ మార్కెట్ విలువ ఒక దశలో 150 బిలియన్ డాలర్లకు పైగా పడిపోయింది. ప్రపంచ మీడియా ఆయన వ్యాపార సామ్రాజ్యంపై ప్రశ్నలు లేవనెత్తింది. అమెరికా న్యాయ వ్యవస్థ కూడా కఠిన వైఖరి తీసుకుంటుందనే భావన ఏర్పడింది.

కానీ ఇప్పుడు అదే అమెరికా వ్యవస్థ సెటిల్‌మెంట్‌లతో ముందుకు రావడం అనేక అనుమానాలకు కారణమవుతోంది. ముఖ్యంగా "అమెరికా ఆర్థిక వ్యవస్థలో 10 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెడతాం" అన్న హామీ తర్వాత అమెరికా వైఖరిలో వచ్చిన మార్పు మరింత చర్చకు దారి తీసింది. పెట్టుబడి, వ్యాపార ప్రయోజనాలు, జియోపాలిటికల్ సంబంధాలు కలిసొచ్చినప్పుడు న్యాయం కూడా వ్యాపార ఒప్పందాల భాగమవుతుందా అనే సందేహం ప్రపంచ వ్యాప్తంగా వ్యక్తమవుతోంది.

ఇది కేవలం అదానీ వ్యవహారం మాత్రమే కాదు. ప్రపంచ పెట్టుబడి దారీ వ్యవస్థలో "టూ బిగ్ టు జైయిల్" అనే భావన చాలా కాలంగా ఉంది. 2008 ప్రపంచ ఆర్థిక సంక్షోభానికి కారణమైన అనేక అమెరికన్ బ్యాంకులు భారీ మోసాలు చేశాయని ఆరోపణలు ఎదుర్కొన్నాయి. కానీ వాటిలో చాలా సంస్థలు కోట్ల డాలర్ల జరిమానాలు చెల్లించి బయటపడ్డాయి. జేపీ మోర్గాన్, గోల్డ్‌మన్ సాక్స్, బ్యాంక్ ఆఫ్ అమెరికా వంటి సంస్థలు బిలియన్ డాలర్ల సెటిల్‌మెంట్లు చెల్లించాయి కానీ అత్యున్నత స్థాయి అధికారుల్లో చాలామంది జైలుకు పోలేదు. సాధారణ పౌరుడు చిన్న నేరానికి జైలుకు వెళ్లే వ్యవస్థలో, బిలియనీర్లు మాత్రం డబ్బుతో కేసులు సెటిల్ చేసుకోవడం న్యాయవ్యవస్థలపై ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తోంది.

భారత్‌లో కూడా ఇదే ప్రశ్న మరింత తీవ్రంగా వినిపిస్తోంది. మోదీ ప్రభుత్వంతో అదానీకి ఉన్న సన్నిహిత సంబంధాలపై ప్రతిపక్షాలు ఎన్నోసార్లు విమర్శలు చేశాయి. విమానాశ్రయాల ప్రైవేటీకరణ నుంచి పోర్టులు, గనులు, విద్యుత్, రక్షణ రంగాల వరకు అదానీ గ్రూప్‌కు పెద్దఎత్తున ప్రాజెక్టులు దక్కడం వివాదాలకు దారి తీసింది. హిండెన్‌బర్గ్ నివేదిక తర్వాత పార్లమెంట్‌లో సంయుక్త పార్లమెంటరీ కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ వచ్చినా కేంద్ర ప్రభుత్వం దాన్ని అంగీకరించలేదు. సెబీ దర్యాప్తు కూడా నెమ్మదిగా సాగుతోందన్న విమర్శలు వచ్చాయి. ప్రతిపక్షాలు "ప్రభుత్వం అదానీని రక్షిస్తోంది" అని ఆరోపించాయి.

అమెరికా వ్యవస్థ కూడా ఇప్పుడు అదే దిశలో నడుస్తోందా అన్న అనుమానం వస్తోంది. ఎందుకంటే అంతర్జాతీయ రాజకీయాల్లో అమెరికాకు భారత్ వ్యూహాత్మక భాగస్వామి. చైనా ప్రభావాన్ని ఎదుర్కోవడంలో భారత్‌తో సంబంధాలు అమెరికాకు కీలకం. అలాంటి సమయంలో భారత కార్పొరేట్ దిగ్గజాలపై కఠిన చర్యలు తీసుకోవడంలో అమెరికా రాజకీయంగా వెనుకడుగు వేస్తుందా అనే ప్రశ్న సహజంగానే వస్తోంది. ముఖ్యంగా భారీ పెట్టుబడులు, ఉద్యోగాల హామీలు ఉన్నప్పుడు కార్పొరేట్ శక్తులు ప్రభుత్వాలపై ఎంత ప్రభావం చూపగలవో ఈ వ్యవహారం సూచిస్తోంది.

అయితే ఇక్కడ ఒక ముఖ్యమైన విషయాన్ని గుర్తించాలి. సెటిల్‌మెంట్ అంటే పూర్తిగా నిర్దోషి అని కాదు; అలాగే ఆరోపణలే వచ్చాయంటే పూర్తిగా దోషి అని కూడా కాదు. కానీ సాధారణ ప్రజల దృష్టిలో ఏర్పడే భావన మాత్రం వేరుగా ఉంటుంది. "డబ్బు ఉన్నవారికి ఒక న్యాయం, సాధారణ ప్రజలకు మరో న్యాయం" అనే భావన మరింత బలపడుతుంది. ప్రపంచంలోని అనేక దేశాల్లో ప్రజాస్వామ్య వ్యవస్థలపై విశ్వాసం తగ్గడానికి ఇదొక ప్రధాన కారణంగా మారుతోంది.

ఇంకా ప్రమాదకరమైన విషయం ఏమిటంటే, పెద్ద కార్పొరేట్ సంస్థలు ప్రభుత్వాలకు, న్యాయవ్యవస్థలకు, మీడియాకు మించి ప్రభావం చూపగలవనే భావన పెరగడం. ఇది ప్రజాస్వామ్యానికి దీర్ఘకాలంలో తీవ్రమైన ముప్పు. ఎందుకంటే ప్రజాస్వామ్యం నిలబడే ది రాజ్యాంగం, న్యాయం, పారదర్శకత, సమానత్వం మీద. కానీ డ బ్బు ఆధారంగా న్యాయవ్యవస్థలపై ప్రభావం చూపగలరనే నమ్మకం బలపడితే సామాన్య ప్రజల్లో నిస్పృహ పెరుగుతుంది. "ధర్మం కొనుగోలు చేయవచ్చు" అనే భావన సమాజానికి ప్రమాదకరం.

అదానీ వ్యవహారం ప్రపంచానికి ఒక అసౌకర్యకరమైన ప్రశ్నను విసురుతోంది: ప్రపంచీకరణ యుగంలో బహుళజాతి కార్పొరేట్ శక్తులు దేశాల రాజకీయాలకే కాదు, న్యాయవ్యవస్థల నిర్ణయాలపై కూడా ప్రభావం చూపుతున్నాయా? అమెరికా, భారత్ వంటి దేశాలు నిజంగా చట్ట పరిపాలనను కాపాడుతున్నాయా, లేక పెట్టుబడుల కోసం న్యాయాన్ని సర్దుబాటు చేస్తున్నాయా? ఈ ప్రశ్నలకు సమాధానం రాబోయే కాలంలో ప్రజాస్వామ్య వ్యవస్థల విశ్వసనీయతను నిర్ణయిస్తుంది. చివరికి "చట్టం ముందు అందరూ సమానమే" అన్న నమ్మకం కూలిపోతే, అది ఒక్క దేశానికే కాదు మొత్తం ప్రపంచ ప్రజాస్వామ్య వ్యవస్థకే ప్రమాద సంకేతం.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

## ప్రేమ చలనం

మరణం లేని చలం
మండుతున్న ఇనగోళం
శశిరేఖ క్రాంతి రేఖలు
దైవమిచ్చిన భాగస్వామి
అనుబంధాలు
అందమైన మైదానం
వెన్నెల పరుచుకున్న మైదానం
కోరికలు గుర్రాలై
పరుగులు తీసే మైదానం
అదొక స్వేచ్ఛ
అదొక భావ స్వేచ్ఛ
ఓ పువ్వు కొత్త లోకపు
ఆత్మీయత లోకి...
చూపు చూపులో
తన్మయత్వం
వివిధ కోణాలు
అవి కొందరికి
మన్మథ బాణాలు
మరికొందరికి
సాంప్రదాయ శరాలు...
ప్రేమ లేని విశ్వం లేదు
మిథునం లేని ప్రకృతి లేదు
చలం లేకుండ
తెలుగు సాహిత్యం లేదు
చలం అంటే అనల చలనం
చలం అంటే ప్రేమ పవనం

రేడియమ్
9291527757



## బడి సరికొత్త ఒరవడి

అది అక్షరాల పొదరిల్లు
సరస్వతి దేవి కొలువైన కోవెల
చిట్టీ చేతులు అక్షరాలు దిద్దుతున్న అమ్మ ఒడి..
ఆకలి అయినప్పుడు తల్లిలా
కడుపు నింపుతుంది
శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో
విద్యను బోధిస్తుంది
సువిశాల మైదానంలో రకరకాల
ఆటలతో ఉల్లాసపరుస్తుంది
రెండు జతల ఏకరూపు దుస్తులు
రాసుకోడానికి, చదువుకోవడానికి
ఉచిత పుస్తకాలు, బ్యాగులు
కాళ్లకు మేజోళ్ళు
పౌష్టికాహారమే ప్రాధాన్యతగా భోజనము,
విద్యార్థినిలకు ప్రత్యేక రోజులలో
అందించే సానిటరీ...
అక్కడ అన్ని ఉచితమే
సకల సౌకర్యల ప్రశాంతమైన నెలవు
సరికొత్త రూపురేఖల బడి
అదే మనందరి ప్రభుత్వ పాఠశాల
దేశ ప్రగతికి ప్రాణవాయువు
లాంటి విద్య
ఫలితాల పండుగొచ్చి
పల్లె మట్టిలో మాణిక్యాలను
వెలికితీసింది
ప్రభుత్వ బడి ఒడిలో
సామాన్య విద్యార్థుల చదువు
సాధించిన ఘనవిజయం
సగౌరవంగా నిలబడి..
మనందరి బడి
విజయ ఢంకా మోగించింది
ప్రభుత్వ బడుల పట్ల
అపోహలన్నీ పటాపంచలై
ఆనందం వెల్లువైన వేళ
విద్యార్థులు,ఉపాధ్యాయులు, ప్రభుత్వ పథకాలు
వెరసి,సమిష్టి కృషి
గణాంకాల సాక్ష్యం
ఫలితాలు పండుగలా మారినవేళ!!
ప్రభుత్వం సగౌరవంగా
విద్యార్థుల చిరునవ్వుల చిత్రాలతో,
అంకెల వివరాలతో
ప్రకటన ఇచ్చి ప్రచారం చేసింది
ప్రభుత్వ బడి పిల్లల విజయం
తమ విజయంగా భావించి
కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీకీ
అడ్డుకట్టవేసింది
పట్టలేని సంతోషం !!
ఇప్పుడు అందరి సొత్తయ్యింది
సరియైన వనరులు, ప్రోత్సాహం
పర్యవేక్షణలతో అద్భుత ఫలితాలు!!
తల్లిదండ్రులకు విద్యార్థులకు కలిగిన సంతోషం
అంతకుమించిన ఆత్మవిశ్వాసం వెలకట్టలేనిది
ఈ ఒక్క భావన వందలాది
పిల్లల భవిష్యత్తును మార్చగలదు!!
రండి..ఇప్పుడు ఏ ఊరి ప్రజలు
ఆ ఊరి బడిలోనే
పిల్లలను చేర్పిద్దాం!!
అద్భుత ఫలితాలు మన సొంతమని చాటి
చెప్పుదాం!!
విద్యార్థుల భవిష్యత్తుకు
బంగారు బాటలు వేయిద్దాం
ఉచిత సదుపాయాల సౌకర్యాలని
అందరం అందుకుందాం
విద్యా శాఖలో సంస్కరణలు
బడి పిల్లల భవిష్యత్తుకి
పునాదిగా మారిన వేళ!!
మరిన్ని విజయాలు మీ ఖాతాలో వేసుకోవాలని
జయహో!!జయ జయహో!!
సరస్వతీ నమస్తుభ్యం
వరదే కామరూపిణి

అనిత కృష్ణ.గండమళ్ళ
9490876621



## స్త్రీ మానానికి కొలమానం!!

నేల తల్లి సహనానికి సాటిగా
కొలిచే ఆడదాని మానానికి
మగ అహంకార హేళన
ఎక్కడుంది స్వేచ్ఛ
ఆడదాని ఆత్మ అభిమానానికి
వేసుకునే బట్టల నుంచి
నడిచే నడక వరకు
నగ్నంగా ఊహించే కామాంధుల
కళ్ళ నుంచి తప్పించే నాధుడేక్కడ..?
స్త్రీ సంస్కృతి
మృగాల వేటలో
ముసుగుదొంగల ఆటలో
హతమవుతున్న వేళ...
హక్కులకై నినదించే యువ సమాజమా
ఇది న్యాయమా...!!
సంస్కృతి సాంప్రదాయాలకు
అద్దం పట్టే స్త్రీ జాతి సంస్కారానికి
విలువ లేదా..
ఒంటరి మహిళకు స్వేచ్ఛ లేదా..?
నాటి కాలంలో బానిసత్వం పేరుతో
ఆడదాని ఆత్మ అభిమానం
పై దెబ్బతీసింద్రు..
నేడు యువకులు ర్యాగింగ్ల పేరుతో
నీచపు ఆలోచనలతో ఆడదాని
మానం పై దెబ్బ కొడుతుంద్రు...
ఎంతవరకు న్యాయం...
మాటలతో ఆడదాని
అమ్మతనాన్ని మెచ్చుకుంటూ
అభినవ స్త్రీగా అత్యుత్తమ
బిరుదులను ఇస్తూనే..
కుసంస్కార క్రూరత్వాన్ని చూపిస్తుంద్రు..
అర్ధరాత్రి ఒంటరిగా తిరిగే
ఆడదాని ఉసురు పోసుకుంటుద్రు
గంజాయి మత్తులో కల్తీ కామాంధులు..
మాటల హద్దులు దాటి
మనుషుల మానవత్వాన్ని మరిచి
వికృతాకారాలను చూపి
విషపు కోరలు చాచి
విలువలు లేక దిగజారిన
అక్రమార్కుల ఆగడాలు..
ఆడదాన్ని వేధించడాన్నే
మగతనంగా భావించే
మగ ఆధిపత్య అహంకారులారా...
వేసుకునే బట్టల్లో అమ్మాయి
వ్యక్తిత్వం కనబడదు
మీరు చూసే నిష్కల్మషమైన
మనసులో ఉంటుంది వ్యక్తిత్వం...
ఆకతాయిల్లా ఆగడాలకు తెగబడుతున్న
మీ మోహాలను చూసి...
కన్న తల్లే సిగ్గుతో మీ చితికి
నిప్పు పెట్టేలోపు మనిషిగా మారండి..

జుర్రు లావణ్య, 83094 95388

*"అండ పిండ బ్రహ్మండంలో ఆంబోతు రంకెవేస్తే..అక్కడబెదురు ఇక్కడబెదురు... ఎక్కడైనా బెదురు ఇరాన్ మాత్రంబెదరదు"*

# చలం ఆత్మకథ –"విశేషాలు"




పురుషాధిక్య వ్యవస్థలో"స్త్రీకి కూడా శరీరం ఉంది. దానికి వ్యాయామం ఇవ్వాలి. ఆమెకు మెదడు ఉంది. దానికి జ్ఞానం ఇవ్వాలి. ఆమెకు హృదయం ఉంది. దానికి అనుభవం ఇవ్వాలి" అంటూ తన అభ్యుదయ భావాలతో సమాజంలో సంచలనం సృష్టించిన రచయిత చలం.

తేదీ 19.5.1894 న జన్మించిన చలం ఉపాధ్యాయుడుగా ట్యూటర్ గా ఉద్యోగంలో చేరి 1948లో పదవీ విరమణ చేశారు. 1921లో "శశిరేఖ"తో నవలతో మొదలైన ఆయన రచన వ్యాసంగం దైవం ఇచ్చిన భార్య, అమీనా, మైదానం, వివాహం, బ్రాహ్మణీకం, అరుణ, స్త్రీ వంటి నవలలు సావిత్రి, చిత్రాంగి, పురూరవ, విడాకులు మొదలైన నాటకాలు, ఓ పువ్వు పూసింది లాంటి కథలు, గీతాంజలి అనువాదం, మ్యూజింగ్స్, ప్రేమలేఖలు, మొదలైన రచనలు తెలుగు సాహిత్యంలో అజరామరంగా నిలిచాయి. అన్నింటికి మించి ఆయన రాసిన లేఖలు సాహిత్యంలో ప్రత్యేకతను సంతరించుకున్నాయి. తెలుగు నవలను ఆధునికం చేయడమే కాకుండా ఆచార్య ఎస్వీ జోగారావు గారు అన్నట్లు "నవల అంటే అదొక పుస్తకం అందులో జీవితం ఉంటుంది అన్నట్లు కాక అదొక జీవితం అది నవల లో ఉన్నది అన్నంత సన్నిహితం చేశారన్న మాటలు అక్షర సత్యాలు. స్త్రీ స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, స్త్రీ వాదం మొదలైన మాటలు ప్రచారంలోకి రాక మునుపే సమాజంలో అర్థ భాగమైన వారి కష్టాలను కన్నీళ్లను అర్థం చేసుకొని వారికొక నూతన దర్శనాన్ని అందజేసిన అరుదైన రచయిత చలం. ఆయన ప్రతిపాదనలను విచ్చలవిడితనం పేరుతో కొట్టివేయవచ్చు గాని కాని వారి పంటికింది బాధ లాంటి వేదనను త్రోసివేయలేము. విస్తృత అధ్యయనం, పరిశీలనం తద్వారా కలిగిన చైతన్యంతో వైవిధ్యమైన రచనలు చేసిన చలం తన ఆత్మకథ ద్వారా ఎన్నో విషయాలను వెల్లడించారు.

చలం రచనలు ఎన్నో ఉన్నా ఆయన జీవితం, నేపథ్యం దాని ప్రభావాన్ని అర్థం చేసుకోవాలంటే ఆయన "ఆత్మ కథ"ను తప్పక చదవాలి. చలం జీవితాన్ని, దాని వేగాన్ని అందలి విషయాలను ఏర్పడిన పరిస్థితులను, సన్నివేశాలను అన్నింటికీ మించి సాహిత్యంలో మంచి వచన శైలిని గుర్తించాలంటే పాఠకులకు అదొక దీప స్తంభంగా నిలుస్తుంది. 1973లో తొలిసారిగా వెలువడిన ఆయన ఆత్మకథ ఇటీవల 2025లో పునర్ముద్రణ పొందింది. ప్రగతిశీల రచయితలకు, పాఠకులకు, చలం అభిమానులకు ఇదొక కానుకగా భావించవచ్చు. సాహిత్య చరిత్రలో ఎంతో వివాదాస్పదమైన చలం ఆత్మకథల గురించి రాస్తూ"ఆత్మకథలంటే నాకసహ్యం. నా ఆత్మకథ రాయమంటే తను లోకానికి ముఖ్యమైన మనిషి అయినట్లు, తానేదో ప్రజలకు తీరని ఉపకారం చేసినట్లు, తన సంగతి చెప్పుకోకపోతే లోకానికి తన గొప్పతనం తెలియనట్లు, తెలియకపోతే లోకానికి ఏదో నష్టమైనట్లు అనుకుంటున్నాడన్నమాట రాసిన వాడు" అంటూనే చలం 279 పుటలలో తన అనుభవాలను ఆలోచనలను అనుభూతులను రాశి పోశారు. ఇవి ఆయన వ్యక్తిత్వాన్ని, ఆయన సాహిత్య తత్వాన్ని అర్థం చేసుకోవడానికి ఉపయోగపడతాయి. తండ్రి తనను చిన్నప్పుడు విపరీతంగా కొట్టేవాడని అందువల్ల "ఇద్దరికీ జన్మవిరోధం"ఏర్పడిందన్నారు. బహుశా తండ్రి యొక్క దురుసుతనం వల్ల తను పడిన బాధ మరొకరికి ఎదురు కావద్దని ఉద్దేశంతోనే చలం "బిడ్డల శిక్షణ" పేరుతో పుస్తకం రాశాడు. పిల్లలను దయతో ప్రేమగా ముద్దుగా చూడాలని కోరాడు. చిన్నప్పుడు దాని ప్రభావంతో పెళ్లి చేసుకోకూడదని, పిల్లల్ని కనకూడదని ఈ రెండు తన చేతుల్లో లేకపోయినా వాళ్లను ఏడిపించకూడదని అస్సలు కొట్టకూడదని ప్రతిజ్ఞలు చేసేవాడు. సంప్రదాయ కుటుంబంలో జన్మించిన చలానికి చిన్నప్పుడు దైవభక్తి ఎక్కువ. సంధ్యావందనం, గాయత్రీ మంత్రం, విష్ణుభక్తి, జాతకాల పట్ల విశ్వాసం విపరీతంగా ఉండేది. ఇంత సంప్రదాయాన్ని అనుసరించే చలంలో మరో కోణం కూడా ఉండేది.

అదే వరుసకు తన పెదనాన్న కూతురైన రమణతో తన పెళ్లికి మినహాయింపు ఇవ్వాలని శృంగేరి పీఠానికి ఆయన ఉత్తరం రాయటం విచిత్రం. తన సోదరి అమ్మన్ని పెండ్లి విషయంలో కుటుంబ సభ్యులను ఎదిరించడం మొదలైనవి చలం అభ్యుదయం వెనుక కందుకూరి వీరేశలింగం, రఘుపతి వెంకటరత్నం నాయుడు, పిఠాపురం మహారాజులు ఉన్నారని వాళ్లు భయపడ్డారు. చలం తన భార్య రంగనాయకమ్మను (౬) , ఉన్నత చదువులకై ప్రోత్సహించడం స్త్రీలు ఎదగాల నే ఆయన సంకల్పానికి నిదర్శనంగా చెప్పవచ్చు. బ్రహ్మ సమాజంలో చేరిన చలం నాయుడు గారి గురించి రాస్తూ"ఆయనంటే నాకు భక్తి, ప్రేమ,గౌరవం. ఆయన వల్ల నా జీవితం నైతికంగా ఆధ్యాత్మికంగా ప్రభావిత మైందన్నారు.

స్త్రీ స్వేచ్ఛను గురించి చెప్పడమే కాకుండా భార్య భర్తలైన తామిద్దరూ తోటలోకి వెళ్లి విహరించడం గురించి రాస్తూ"అలా ప్రారంభమైంది నా స్త్రీ స్వేచ్ఛ యజ్ఞం" అన్నారు. శృంగార వాంఛను గురించి రాస్తూ తన బుద్ధి చంచలం అన్నాడు. ఈ పుస్తకంలో తన స్వభావాన్ని గురించి లైంగిక వాంఛను గురించి పలుసార్లు ప్రస్తావించాడు. తన బలహీనతను గురించి కూడా చెప్పాడు. వసంత్, రవి, సౌరీ ష్ లు ఆయన సంతానం. చలం వ్యక్తిగత జీవితంలో ఆయన మగ పిల్లలు ఇద్దరు అర్థాంతరంగా కాలం చేశారు. అవి తనను బాగా కుంగ తీశాయి.

చలం ఆత్మకథలో ఒక చోట తన రచన వ్యాసంగాన్ని గురించి రాస్తూ"చలానికి రచనలు చేయాలని ఆసక్తి లేదు. అధికారం చేతిలో ఉంది కదా అని అబలల్ని హింసించుకొని తినే వాళ్ళ మీద నా దాడి. నా ఉద్యమానికి సాయపడ్డది నా కళ నైపుణ్యం"అని చెప్పుకున్నారు."నా శైలి గొప్పదని ప్రతివారు దానిని అనుసరించాలని చూశారు. కానీ ఈనాటికి అది ఎవరికీ సాధ్యంకాలేదన్నారు". చలం సంఘాన్ని కొట్టే దెబ్బలకి యువత సంతోషించే వారని అందుకే తను రాసిన దానికి ఎదురు చెప్పటం ఎవరికీ చేతకాక ఆగ్రహంతో తిట్టేవాళ్ళు"అన్నారు. తన రచనల ప్రభావంతో చైతన్యవంతులైన మహిళలు ఇంట్లో పురుషాధిక్యతను ప్రతిఘటిస్తూ"మీరు మమ్మల్ని హింసించారంటే, మా స్వేచ్ఛకి అడ్డు తగిలారంటే మేము చలం దగ్గరికి వెళ్తాము"అని బెదిరించే వారట."స్త్రీ"ని కేంద్రంగా చేసుకొని చలం రాసిన నవలల్ని చదవడానికి సహజంగా ఆనాటి సంప్రదాయ సమాజం దాన్నొక తిరుగుబాటుగా భావించడం వల్ల చాలామంది పాఠకులు, ముఖ్యంగా మహిళలు తమ తమ ఇండ్లలో దిండు కింద దాచుకొని నిషేధిత సాహిత్యంగా చదివేవారట. దీనిని బట్టి చలం రచనలకు రహస్య పాఠకులు చాలామంది ఉండేవారు అని తెలుస్తుంది. చలం దృక్పథాన్ని వ్యతిరేకించే వారు కూడా ఆయన తీసుకున్న వస్తువు, వచన శైలిని కాదనలేకపోయేవారు. అలాగే ఆయన ప్రకృతి వర్ణన కూడా ప్రత్యేకమైనదానిగానే చెప్పుకోవాలి."నాకు ఈశ్వరుడిలో నమ్మకం లేకపోయినా లోకంలో, మనిషిలో నమ్మకం ఉంది" అంటూ చివరకు చింతా దీక్షితులతో కలసి అరుణాచలం వెళ్ళిన చలానికి ఆశ్చర్యకరంగా రమణ మహర్షి "లోకాతీతులుగా" అనిపించి అహం పోతే సత్యం గోచరిస్తుంది అని ఆయన చెప్పిన మాటలు తాత్వికంగా ప్రభావితం చేశాయి. చలం ఒకచోట చదువును గురించి రాస్తూ చదువుకునే ఆసక్తి ఉండాలి. చదువును ఎంజాయ్ చేయాలి. రాత అట్లానే. చదువు అట్లానే. పాఠశాలలకు పిల్లలు సహజంగా వెళ్లే వాతావరణాన్ని కల్పించాలన్నారు. స్నేహం, వికాసం, దయ, ఐకమత్యం మొదలైన భావాలన్నీ తల్లిదండ్రుల ద్వారా పిల్లలకు అబ్బాలని అదే సంస్కారం అని ఆయన నిర్వచించారు. చలం ఆత్మకథలో ఎన్నోవైరుధ్య అంశాలు కూడా ఉన్నాయి. చిన్నప్పుడు సంప్రదాయ ప్రభావం, ఆ తర్వాత యోగ, చాంచల్యం, కుమార్తె సౌరీస్ లో ఈశ్వరుని దర్శించాననడం, తలనొప్పులు తొలగాయని చెప్పటం ఇవన్నీ ఆయన స్వభావానికి సంకేతంగా చెప్పవచ్చు. ముఖ్యంగా ఆత్మకథలో అక్కడక్కడ ఆయన ఆయా సందర్భాలను అనుసరించి రాసిన వాక్యాలు చాలా విలువైనవి. అందులో"నేను చేసిన పనులు నేను రాసిన రాతలు అన్ని ప్రజా సంస్కరణ కోసం కాదు, నన్ను నేను సంస్కరించుకోవడానికి అని ఒకచోట, ఏమీ లేకపోవటమే ఆనందం, నా జీవితంలో నాకు నేను చేసుకోవాలనుకున్న వాటిలో, ఇతరులకి చేయాలనుకున్న వాటిలో చాలావరకు నెరవేరలేదు, నేను తెలుసుకున్నదల్లా తెలుసు నన్న వాడికి తెలియదని, అలాగే"నా చేతిలో పుస్తకం ఉన్నదా? లోకాన్నే మరిచిపోగలను అన్నది ఆయన అధ్యయనశీలానికి"ఒకళ్ళ మీద నేరం మోపి ఇంకొకరితో చెప్పటం నా స్వభావంలో లేదు""ఎవరు కాస్త బాధపడ్డా భరించలేని వాడిని" మొదలైన వాక్యాలు చలం ఆత్మకథలో ఆణిముత్యాలు అని చెప్పవచ్చు. ఆత్మకథ చివరలో"ఇంతకీ నేను తెలుసుకున్నాను అనుకున్నది పూర్తిగా నాకే తెలియదు. నేను తెలుసుకున్నాను అనుకున్నది రాశాను" అని తాత్వికంగా చెప్పుకున్న చలం తేదీ 4.5.1979 న అస్తమించారు. బాల బంధు బి.వి. నరసింహారావు అన్నట్లు ఈ పుస్తకంలో అన్ని ఆయన డెబిట్లే కానీ క్రెడిట్లు చెప్పుకో లేదనీ వ్యాఖ్యానించారు.

కాగా చలం సాహిత్యం పై వివిధ విశ్వవిద్యాలయాలలో పలు పరిశోధనలు జరిగాయి. అందులో "చలం గారి కథానికా సాహిత్యము–అనుశీలనము" అనే అంశంపై పరిశోధన చేసిన వావిలాల సుబ్బారావు గారు ముఖ్యులు.

జీవజలం చలం పేరుతో ఆయన జయంతి సందర్భంగా ఈరోజు "చలం పౌరాణిక సాహిత్యం–వస్తురూపాలపై"సదస్సు నిర్వహిస్తున్న ట్లు చలం భావన కన్వీనర్ డాక్టర్ నాలేశ్వరం శంకరం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్. వేణుగోపాల్, కుప్పిలి పద్మ లు ప్రసంగిస్తారు. ఈ సందర్భంగా ఆయనకు అక్షర నివాళులు అర్పిస్తున్నాను. (నేడు చలం జయంతి)

డాక్టర్ శంకరమంచి శ్యాంప్రసాద్
9989148305.



డాక్టర్ శంకరమంచి శ్యాంప్రసాద్
99 891 48 305

# అనుమతులు గోరంత... తవ్వేది "కొండ"ంత..!

- గుట్టలను మింగేస్తున్న క్రషర్ కంపెనీలు
- అక్రమ క్రషర్ మిషన్లకు కేరాఫ్‌గా కందుకూరు...?
- నిద్రమత్తులో మైనింగ్ శాఖ అధికారులు...?
- రాచులూరులో 1000 అడుగుల లోతు తవ్వకాలు
- కటికపల్లి వైపు చూడండాన్ని కలెక్టర్‌ను వేడుకుంటున్న కటికపల్లి గ్రామస్థులు
- క్రషర్ మిషన్ల వల్ల అవస్థలు పడుతున్నాము కటికపల్లి గ్రామస్థులు



**మహేశ్వరం, మే 19 (జనంసాక్షి) :** మహేశ్వరం నియోజకవర్గంలో ప్రకృతి సహజ సిద్ధంగా ఉన్న సహజ వనరులైన కొండలు, గుట్టలు, చెరువులు, కుంటలు,వాగులు రాత్రికి రాత్రే మాయమైపోతున్నాయి. కందుకూరు మండలంలోని రాచులూరు, అన్నోజిగూడ,మీర్కాన్ పేట్, గూడూరు గ్రామాల పరిధిలో ఉన్న క్రషర్ కంపెనీల వల్ల స్థానిక ప్రజలు,రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. క్రషర్ కంపెనీల నిర్వాహకులు గోరంత అనుమతి తీసుకొని...కొండతా గుట్టను మింగేస్తున్నారు.రాచులూరు,కటికపల్లి గ్రామాల మధ్యలో ఉన్న క్రషర్ మిషన్ నిర్వాహకులు గుట్టను సుమారు 1000 అడుగుల లోతు తోవ్వారు.రాచులూరు గ్రామ రెవిన్యూ పరిధిలోని సర్వే నంబర్ 525 లో ఉన్న ర్యాంక్స్ సిలికాన్, స్టార్ కే రాక్ స్టాండ్ క్రషర్ కంపెనీల వల్ల స్థానిక రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. విచ్చలవిడిగా బ్లాస్టింగ్ చేయడం వల్ల కటికపల్లి గ్రామంలోని ఇండ్లలలో గోడలు,ఇంట్లో ఉండే వంట సామాను నేలమట్టం అవుతున్నాయని ఆరోపిస్తున్నారు.క్రషర్ మిషన్ల నుంచి దుమ్ము వల్ల కటికపల్లి గ్రామస్థులు శ్వాసకోస వ్యాధితో బాధపడుతూ అనారోగ్యానికి గురవుతున్నామంటున్నారు. క్రషర్ మిషన్ల నుంచి భారీ శబ్దానికి పంట పొలాలలో ఉన్న బోరు మోటార్లు పూర్తిగా దెబ్బతింటున్నాయి.దుమ్ము వల్ల పంటలు పండటం లేదు.పంటల మీద దుమ్ము పడి పంట పూర్తిగా నష్ట పోతుందాన్ని,బ్లాస్టింగ్ చేసే సమయంలో రాళ్లు వచ్చి తమ పొలాలలో పడుతున్నాయని,తాము పొలంలో పని చేసే సమయంలో తమ మీద రాళ్లు పడే పరిస్థితులు వస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మరో పక్క పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారులు సైతం పట్టించు కోవడం లేదు.రాచులూరు గ్రామ రెవిన్యూ పరిధిలో ఉన్న ర్యాంక్స్ సిలికాన్ కంపెనీ,స్టార్ కే రాక్ స్టాండ్ కంపెనీల అక్రమ క్రషర్ మిషన్ల వైపు జిల్లా మైనింగ్ శాఖ అధికారులు,జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి ప్రత్యేక చొరవ చూపి అక్రమ క్రషర్ మిషన్ల నడుపుతున్న నిర్వాహకులపై వెంటనే చర్యలు తీసుకోవాలని కటికపల్లి గ్రామస్థులు కోరుతున్నారు.

కనుమరుగు అవుతున్న ప్రకృతి...చనిపోతున్న పక్షులు

కందుకూరు మండలం రాచులూరు కటికపల్లి గ్రామాల మధ్యలో ఉన్న క్రషర్ కంపెనీల నిర్వాహకులు తమ ఇష్టానుసారంగా గుట్టలను పగలకొట్టడానికి విషపూరితమైన బ్లాస్టింగ్ చేయడం వల్ల పచ్చని చెట్లు ఎండీ పోతున్నాయి.పక్షులు,పశువులు చనిపోతున్నాయి.దుమ్ము పంట పొలాలపై పడి పంట పొలాలు ఎండిపోతున్నాయి.మరో పక్క గుట్టలపైన ఉండే జాతీయ పక్షి నెమలులు,ఇతర పక్షులు సైతం పక్షులు చనిపోతున్నాయి.చుట్టూ ప్రక్కల రైతుల ఆవులు,గేదెలు,మేకలు,గొర్రెలు సైతం అనారోగ్యానికి గురవుతున్నాయి.

### నిద్రమత్తులో అధికారులు

కందుకూరు మండలంలోని రాచూలూరు,మీర్కాన్ పేట్, అన్నోజిగూడ,గూడూరు,బేగంపేట్ గ్రామాలలో అక్రమ క్రషర్ మిషన్ల దందా మూడు పువ్వులు ఆరు కాయలు అన్నచందంగా నడుస్తున్నాయి.అక్రమ క్రషర్ కంపెనీలు నడిపే నిర్వాహకులపై మైనింగ్ శాఖ అధికారులు,పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారులు,రెవిన్యూ అధికారులు ఆటు వైపు కన్నెత్తి చూడడం లేదు.రాచులూరు గ్రామ రెవిన్యూ పరిధిలోని ర్యాంక్స్ సిలికాన్ క్రషర్ కంపెనీ,స్టార్ కే స్టాండ్ కంపెనీ సుమారు 1000 అడుగుల లోతు గుట్టలను పగల గొట్టారు.నిబంధనలకు విరుద్ధంగా క్రషర్ కంపెనీలు నడుస్తున్న జిల్లా మైనింగ్ శాఖ,రెవిన్యూ శాఖ,పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ శాఖ అధికారులుకు ఆయా కంపెనీల నుంచి నెలనెల మామూళ్లు ముడుతున్నాయని కటికపల్లి గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.మైనింగ్ శాఖ అధికారులు,రెవెన్యూ శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి అనుమతులు లేకుండా,ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తున్న క్రషర్ కంపెనీలపై చర్యలు తీసుకోవాలని కటికపల్లి గ్రామస్థులు కోరుతున్నారు.

### శ్వాసకోస వ్యాధితో ఇబ్బందులు పడుతున్నాం

రాచులూరు గ్రామ రెవిన్యూ పరిధిలో ఉన్న ర్యాంక్స్ సిలికాన్ క్రషర్ కంపెనీ, స్టార్ కే స్టాండ్ క్రషర్ కంపెనీ వల్ల కటికపల్లి గ్రామంలోని ఇండ్లలలో గోడలు కూలిపోతున్నాయి.పచ్చని చెట్లు,పంట పొలాలు ఎండి పోతున్నాయి. క్రషర్ కంపెనీల నుంచి భారీ శబ్దం వల్ల వ్యవసాయ బోరు మోటార్లు పూర్తిగా దెబ్బతింటున్నాయి.క్రషర్ కంపెనీ నుంచి వెచ్చే దుమ్ము వల్ల కటికపల్లి గ్రామంలో శ్వాసకోస వ్యాధితో ప్రజలు బాధపడుతున్నారు.ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న అక్రమ క్రషర్ కంపెనీలపై అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.

**శ్రీకాంత్, కటికపల్లి గ్రామస్థుడు**

## ప్రభుత్వ భూముల సంరక్షణపై అడిషనల్ కలెక్టర్ సమావేశం



**ఇబ్రహీంపట్నం, మే 19 (జనం సాక్షి) :** రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి ఇబ్రహీంపట్నం ఆర్డిఓ కార్యాలయంలో డివిజన్లోని రెవెన్యూ అధికారులు ఇబ్రహీంపట్నం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ల్యాండ్ ప్రొటెక్షన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ల్యాండ్ అక్విజేషన్ డివిజన్లోని మండల తాసిల్దారులతో కోర్టు కేసులపై సమీక్ష సమావేశం నిర్వహించారు ఇందులో డివిజన్లోని ప్రభుత్వ భూములకు సంబంధించిన భూసేకరణ సంబంధించిన అంశాలపై కోర్టుల వారీగా సుప్రీంకోర్టు హైకోర్టు జిల్లా కోర్టు మరియు ఇతర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఇందులో తాసిల్దారులకు ప్రభుత్వ భూములకు సంబంధించిన సంరక్షణ గూర్చి వివిధ కోర్టులో నమోదైన కేసుల వివరాలు సేకరించి కౌంటర్ దాఖలు చేసి ప్రభుత్వ భూములు సంరక్షించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సమీక్ష సమావేశంలో ఇబ్రహీంపట్నం ఆర్డిఓ అనంతరెడ్డి, ఎస్డిసి శ్రీనివాస్ రెడ్డి,ఎస్డి సి ల్యాండ్ అక్విజేషన్ ఎస్ వి రాజు, డివిజన్లోని తాసిల్దారులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా పారదర్శకతకు పార్టీలు సహకరించాలి



**కొందుర్గు, మే 19 (జనంసాక్షి) :** అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా, తప్పుల్లేని ఓటర్ల జాబితా రూపకల్పనకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కొందుర్గు మండల తహశీల్దార్ అజాం అలీ కోరారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఎలక్టోరల్ రోల్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్) ప్రక్రియపై అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సర్వపక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ.. బూత్ లెవల్ ఆఫీసర్ల (బీఎల్ఓ) పరిధిలో పెండింగ్‌లో ఉన్న మ్యాపింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. బూత్‌ల వారీగా ఓటర్ల వివరాల్లో ఏవైనా మార్పులు, చేర్పులు ఉంటే రాజకీయ పార్టీల నేతలు అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.ఈ సమీక్షా సమావేశంలో ఉప తహశీల్దార్ నివేదిత, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాంబాబు, కార్యాలయ సిబ్బందితో పాటు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ముఖ్య నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ఆపరేషన్

- జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు



**గద్వాల నడిగడ్డ, మే 19 (జనం సాక్షి) :** డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు జిల్లా వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు తెలిపారు.యువత భవిష్యత్తును చీకటిలోకి నెట్టే డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలను పూర్తిగా అరికట్టేందుకు జిల్లా పోలీసు శాఖ కఠిన చర్యలు చేపట్టింది.ఈ మేరకు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసు అధికారులు నార్కోటిక్ జాగిలం "జిమ్మీ" సహాయంతో జిల్లా వ్యాప్తంగా విస్తృత స్థాయిలో ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే గద్వాల టౌన్, గద్వాల్ రూరల్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని భీమ్‌నగర్, చింతలపేట, గంజిపేట, దౌదర్‌పల్లి, సంగాల, జమ్మిచేడు, గుర్రంగడ్డ, జనగాంపల్లి, అనంతపురం, బసల్ చెరువు తదితర గ్రామాలు, ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. నార్కోటిక్ జాగిలం "జిమ్మీ" సహాయంతో వాహనాలు, బ్యాగులు, పాన్ షాప్స్, కిరాణం షాప్స్ మరియు అనుమానాస్పద వస్తువులను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. యువత ఎక్కువగా సంచరించే ప్రాంతాలతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఆకస్మిక చెకింగ్‌లు కొనసాగనున్నాయి. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ డ్రగ్స్ మహమ్మారి సమాజానికి తీవ్రమైన ముప్పుగా మారుతోంది. ముఖ్యంగా యువతను లక్ష్యంగా చేసుకుని మత్తు పదార్థాల వ్యాపారం నిర్వహిస్తున్న వారిపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని, అక్రమ రవాణా, నిల్వలు, విక్రయాల్లో పాల్గొనే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటాం అని, తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై అప్రమత్తంగా ఉండాలని, విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. జిల్లాలో ఎక్కడైనా డ్రగ్స్ లేదా గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా పోలీసు అధికారులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.

# సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చూడాలి




**నర్సాపూర్, మే 19 (జనం సాక్షి) :** నర్సాపూర్ పోలీస్ స్టేషన్‌ను మంగళవారం మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించి, పలు అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను పరిశీలించిన ఎస్పీ, వాటి దర్యాప్తు పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ కేసు విచారణ వేగవంతంగా పూర్తి చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అదేవిధంగా రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు చేపడుతున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదాల నివారణలో భాగంగా ట్రాఫిక్ నియంత్రణ, వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం నిర్వహించాలని ఆదేశించారు.స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును కూడా పరిశీలించి, ప్రమాదకర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్టేషన్ పరిధిలో నిఘా వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని అధికారులకు ఆదేశించారు ప్రతి శుక్రవారం పోలీసు సిబ్బందికి సంబంధించిన సమస్యలను నేరుగా తనను కలిసి వివరించవచ్చని సూచించారు. విధి నిర్వహణలో క్రమశిక్షణతో పాటు ప్రజల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని తెలిపారు.పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజల ఫిర్యాదులను సత్వరమే స్వీకరించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని, స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని పోలీసు సిబ్బందికి ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సీఐ జాన్ రెడ్డి, సందీప్ రెడ్డి, ఎసై రంజిత్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## మరో నాలుగు మిల్లులు బ్లాక్ లిస్ట్

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**మెదక్ జిల్లా బ్యూరో చీఫ్, మే 19 (జనం సాక్షి) :** ధాన్యం సేకరణ మరియు కస్టమ్ మిల్లింగ్ లో అలసత్వం వహించినందుకు మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మరో నాలుగు రైస్ మిల్లులను బ్లాక్‌లిస్ట్‌లో చేర్చారు. ప్రభుత్వానికి కేటాయించిన ధాన్యాన్ని సకాలంలో దిగుమతి చేసుకోని మిల్లులపై ఈ కఠిన చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్కెటింగ్ సీజన్ 2025-26 (యాసంగి) సందర్భంగా జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా నిర్వహించేందుకు అన్ని రైస్ మిల్లర్లు పీపీసీల నుండి ధాన్యాన్ని దిగుమతి చేసుకొని కస్టమ్ మిల్లింగ్ ఆపరేషన్స్‌లో తప్పనిసరిగా పాల్గొనాలని పలు మార్లు ఆదేశాలు జారీ చేయబడ్డాయని మిల్లింగ్ ఆపరేషన్లో తప్పనిసరిగా పాల్గొనాలని పలుమార్లు వెల్లడించిన మిల్లర్లు ఆ మాటలు పెడచెవిని పెట్టి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీని దృష్టిలో పెట్టుకుని కుల్చారం మండలం మెదక్ జిల్లా. లక్ష్మీ వెంకటేశ్వర ఆగ్రో ఇండస్ట్రీస్ కోనాపూర్,వేణుగోపాల స్వామి బిన్నీ మోడరన్ రైస్ మిల్ శివపల్లి, ఎంఎస్ శ్రీ శ్రీనివాస మోడరన్ బిన్నీ రైస్ మిల్, గోమరమ్ గోమారం, శ్రీ మాతా ట్రేడింగ్ కో, దొంతి. శివార్వారు పీపీసీల నుండి కేటాయించిన ధాన్యాన్ని దిగుమతి చేసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు ప్రభుత్వ ఆదేశాలను పాటించకపోవడం గమనించబడినది. దీనివల్ల రైతులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి మరియు ధాన్యం కొనుగోలు ప్రక్రియకు ఆటంకం ఏర్పడుతుందన్నారు.ఈ నేపథ్యంలో, సంబంధిత జి.ఓ నిబంధనల ప్రకారం పై రైస్ మిల్లులను పాడి ప్రొక్యూర్‌మెంట్ మరియు కస్టమ్ మిల్లింగ్ ఆపరేషన్స్ నుండి తక్షణ ప్రభావంతో బ్లాక్ / బ్లాక్‌లిస్ట్ చేయడం జరిగినది. తదుపరి ఆదేశాలు వెలువడే వరకు ఆయా రైస్ మిల్లులకు ఎటువంటి ధాన్యం కేటాయింపు చేయబడవని వెల్లడించారు.

## గౌతమ్‌నగర్ కష్టాలకు మోక్షం

- త్వరలో ఆర్‌యూబీ పనులు ప్రారంభం
- 42 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం
- ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



**మల్కాజిగిరి, మే 19 (జనంసాక్షి) :** గౌతమ్ నగర్ లెవెల్ క్రాసింగ్ వద్ద దశాబ్ద కాలంగా ప్రయాణికులు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ కష్టాలకు త్వరలోనే మోక్షం లభించనుంది. 42 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించతలపెట్టిన రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధమైనట్లు మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి వెల్లడించారు. మంగళవారం ఆయన రైల్వే, జీహెచ్ఎంసీ, జలమండలి ఉన్నతాధికారులతో కలిసి నిర్మాణ స్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. గౌతమ్ నగర్ గేటు వద్ద నిత్యం వేల సంఖ్యలో వాహనాలు నిలిచిపోయి ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని, ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకే ఆర్‌యూబీ నిర్మాణాన్ని చేపడుతున్నట్లు తెలిపారు.నిర్మాణ పనుల్లో భాగంగా అడ్డంగా ఉన్న డ్రింకింగ్ వాటర్, సివరేజ్ పైపులైన్ల మళ్లింపుపై జలమండలి అధికారులతో చర్చించారు. రైల్వే, జీహెచ్ఎంసీ అధికారులు పరస్పర సమన్వయంతో పనులు త్వరగా ప్రారంభించాలని కోరారు. పనుల సమయంలో స్థానిక నివాసితులకు, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో రైల్వే సీనియర్ డీఈఎన్ రాజేంద్రప్రసాద్, సెక్షన్ ఇంజనీర్ రవి ప్రకాష్, జీహెచ్ఎంసీ ప్రాజెక్ట్ ఏఈ సుజిత్, జలమండలి జీఎం సునీల్ కుమార్, డీజీఎం రమణారెడ్డి, ఏఈ నవీన్, మాజీ కార్పొరేటర్ మేకల సునీత, బీఆర్ఎస్ నాయకులు జేఏసీ వెంకన్న, సిద్ధిరాములు, మేకల రామ్ యాదవ్, కృష్ణ గౌడ్, అనిల్ కుమార్, కాటంరాజు, రామచెర్ల నర్సింగ్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మేడ్చల్ నియోజకవర్గంలోని చెరువులన్నింటిని సుందరీకరణకు సహకరించాలి



**బోడుప్పల్, మే 19 (జనంసాక్షి) :** మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలోని అన్ని చెరువులను సుందరీకరించి, వాటి పరిరక్షణ కోసం సహకరించాలని కోరుతూ మంగళవారం హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను మేడ్చల్ మల్కాజిగిరి డీసీసీ అధ్యక్షులు, మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ తోటకూర వజ్రేశ్ యాదవ్ కోరారు. ఈ సందర్భంగా వజ్రేశ్యాదవ్ మాట్లాడుతూ.. బోడుప్పల్లోని రాచెరువు, పీర్జాదీగూడ లోని పెద్ద చెరువులను పూర్తి స్థాయిలో బండ్గా తీర్చదిద్దాలని కోరారు. అదే విధంగా చెంగిచర్ల చింతల చెరువును సుందరీకరించి కలుషిత జలాలు చెరువులో కలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. హైడ్రా కమిషనర్ను కలిసిన వారిలో బోడుప్పల్ మాజీ మేయర్ తోటకుర అజయ్ యాదవ్, మేడ్చల్ నియోజకవర్గం బీ బ్లాక్ ప్రదాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్. సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాయిపేట శ్రీనివాస్ యాదవ్, తుంగతుర్తి రవి, మాజీ కార్పొరేటర్ బొమ్మకు కళ్యాణ్, ఆర్టీఏ మెంబర్ జైపాల్ డ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి మున్సిపాలిటీకి 15 కోట్ల నిధుల విడుదల

- పటాన్చెరు నియోజకవర్గంలో మంత్రి వివేక్ వెంకటస్వామి పర్యటన



**పటాన్‌చెరు, మే 19 (జనం సాక్షి) :** పటాన్‌చెరు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి మంగళవారం నాడు నియోజకవర్గంలో పర్యటించారు. పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు, స్థానిక ప్రజలు వేలాదిగా తరలివచ్చి మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఇస్నాపూర్, ఇంద్రేశం, జిన్నారం, గుమ్మడిదల, గడ్డపోతారం మున్సిపాలిటీలకు రూ.15 కోట్ల చొప్పున పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. మొత్తంగా నియోజకవర్గవ్యాప్తంగా సుమారు రూ.84 కోట్లకు పైగా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.భానూర్‌లో రూ.8.30 కోట్ల వ్యయంతో విశాఖ పీడబ్ల్యూడీ రోడ్డు నుండి శంకరపల్లి - పటాన్‌చెరు రోడ్డు వరకు కంచర్లగూడెం మీదుగా నిర్మించనున్న బీటీ రోడ్డుకు, శంకుస్థాపన చేశారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఉస్మాన్‌నగర్ కేజీబీవీలో రూ.60.94 లక్షలు, జిన్నారం కేజీబీవీలో రూ.70.95 లక్షల వ్యయంతో నిర్మించనున్న అదనపు తరగతి గదుల పనులకు శంకుస్థాపన చేసి, సోలక్‌పల్లిలో ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ 1985లో ఇందిరాగాంధీ ఈ ప్రాంతానికి బీడీఎల్, ఓడీఎఫ్ వంటి ప్రతిష్టాత్మక రక్షణ రంగ పరిశ్రమలను తీసుకువచ్చారని గుర్తుచేశారు. ఆమె సేవలను స్మరించుకుంటూ ఈ ప్రాంతంలో ఇందిరమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం సముచితమన్నారు. భానూర్ కార్మికుల హౌసింగ్ సొసైటీకి స్థల కేటాయింపు చేపడతామని, పటాన్‌చెరు నుండి శంకర్‌పల్లి వరకు 100 ఫీట్ల రహదారి నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గత పదేళ్లలో లేని విధంగా ప్రజా ప్రభుత్వంలో అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు అందజేస్తామని, జూన్ 2వ తేదీ నుండి కొత్త పింఛన్ల పంపిణీ ప్రారంభిస్తామని తెలిపారు. పటాన్‌చెరు కాంగ్రెస్ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పటాన్‌చెరు అభివృద్ధికి, ముఖ్యంగా విద్యా మరియు మౌలిక వసతుల రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఒకేరోజు రూ.84 కోట్లకు పైగా అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం ఇందుకు నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో టిజిఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
20 మే 2026

# ధన్వాడ ఎస్సీ బాలుర వసతి గృహాన్ని వెంటనే మార్చండి

- కలెక్టర్ ప్రియాంక

**నారాయణపేట జిల్లా బ్యూరో, మే 19 (జనం సాక్షి) :** ధన్వాడ మండల కేంద్రంలోని ఎస్సీ వసతి గృహం పూర్తిగా శిథిలావస్థ కు చేరిందని, వసతి గృహాన్ని అక్కడి నుంచి వెంటనే మార్చి వేరే అనువైన భవనంలోకి మార్చాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఆదేశించారు. మంగళ వారం ఆమె ధన్వాడ ఎస్సీ బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహం లోపల పై కప్పు పెచ్చులూడి ఉండటం, వంటగది పై కప్పు కూడా శిథిలావస్థకు చేరటం, వసతి గృహ మరుగు దొడ్లు, స్నానపు గదుల కు తలుపు లు లేకపోవడాన్ని చూసిన కలెక్టర్ మరమ్మతులు చేయించినా లాభం లేదని, భవనం పూర్తిగా కూలిపోయే పరిస్థితి ఉందని, ఇక వచ్చే నెల పాఠశాలలు పునః



ప్రారంభం వరకు ధన్వాడ ఎస్సీ బాలుర వసతి గృహాన్ని వేరే చోటికి, మరికల్, లేదా నారాయణ పేట జిల్లా కేంద్రంలో విద్యార్థులకు అన్ని వసతి,సౌకర్యాలతో కూడిన ప్రభుత్వ,లేదా ప్రైవేటు భవనంలోకి మార్చాలని కలెక్టర్ సాంఘిక సంక్షేమ అధికారి అబ్దుల్ ఖలీల్ కు సూచించారు. అలాగే ప్రస్తుతం శిథిలావస్థకు చేరిన భవనాన్ని కూల్చి వేసి అక్కడే నూతన భవనాన్ని నిర్మించేం దుకు ప్రతిపాదించాలని చెప్పడంతో ఇప్పటికే నూతన భవన నిర్మాణానికి రూ.3 కోట్ల 22 లక్షలతో ప్రతిపా దనలు పంపించడ జరిగింది అని సాంఘిక సంక్షేమ అధి కారి కలెక్టర్ కు తెలిపారు. అలాగైతే ప్రస్తుతానికి ధన్వాడ ఎస్సీ బాలుర వసతి గృహం కోసం ఏదైనా అద్దె భవనాన్ని చూసి, మార్చేందు కు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ధన్వాడ తహ శీల్దార్ సింధూజ, ఎంపీవో, తదితరులు పాల్గొన్నారు.

## యువతకు పుచ్చలపల్లి సుందరయ్య ఆదర్శం

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఏ. మహేందర్ రెడ్డి



**శివ్వంపేట మే 19 (జనంసాక్షి) :** భారత కమ్యూనిస్టు ఉద్యమ మహానేత, ప్రజా నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రమైన శివ్వంపేట తో పాటు దొంతి గ్రామాల్లో ఆయన చిత్రపటానికి మంగళవారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఏ. మహేందర్ రెడ్డి మాట్లాడుతూ సుందరయ్య జీవితాంతం పేదలు, కార్మికులు, రైతుల హక్కుల కోసం నిరంతరం పోరాడిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. సామాజిక సమానత్వం, శ్రమజీవుల సంక్షేమం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఆయన చేసిన సేవలు నేటి తరాలకు ఆదర్శప్రాయమని, నేటి పరిస్థితుల్లో ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం మరింత ఉందని అన్నారు. సుందరయ్య జీవితాంతం పేద ప్రజల హక్కుల కోసం, సమాన సమాజ నిర్మాణం కోసం ఆయన ఆశయాలు, సిద్ధాంతాలు నేటి తరానికి మార్గదర్శకమని తెలిపారు. కార్మికులు, రైతులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. యువత సుందరయ్య త్యాగస్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం నర్సింలు, పద్మ, కుమార్ ,వసంత, వెంకటలక్ష్మి, లక్ష్మి, అనూష తదితరులు పాల్గొన్నారు.

## పెంచిన వయోపరిమితి అమలు చేయాలి



**నారాయణపేట, మే 19 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవడం కోసం గరిష్ట వయస్సు 34 సంవత్సరాల నుండి 44 సంవత్స రాలకు పెంచిన జీవో 86 ను సవరించి ఒక సంవత్సరం పాటు కాకుండా కనీసం 5 సంవత్సరాలు అమలు చేయాలని నిరుద్యోగులు హెచ్. నర్సింహా, రాధ కిషన్, శివ అమర్, సురేష్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పదేండ్ల వయోపరిమితి పెంచిన ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ప్రభుత్వం దృష్టికి గరిష్ట వయోపరిమితి పెంచమని తీసుకొని పోయిన అందరికీ ధన్యవాదములు తెలిపారు. పెంచిన వయోపరిమితి ఒక సంవత్సరం పాటు మాత్రనే వర్తిసుందని ఈ జీవో లో పేర్కొనడం వలన నిరుద్యోగులకు లాభం లేదు అని తెలిపారు.నోటిఫికేషన్స్ వచ్చే లోపు 44 సంవత్సరాలకు పెంచిన పదేండ్ల గరిష్ట వయోపరిమితిని పూర్తి అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు .నిరుద్యోగులకు మేలు జరుగాలంటే కనీసం పెంచిన వయోపరిమితి 5 సంవత్సరాలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

# మొక్కజొన్న కొనుగోలును సజావుగా నిర్వహించాలి

- ఇప్పటికే మొక్కజొన్న కొనుగోలు 70 శాతం పూర్తి

**గద్వాల నడిగడ్డ, మే 19 (జనం సాక్షి) :** మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు వేచి ఉండే పరిస్థితి ఉండకుండా కొనుగోలు ప్రక్రియను త్వరితగతిన నిర్వహించాలని, ఇప్పటికే జిల్లాలో 70 శాతం కొనుగోలు పూర్తయిందని, మిగిలిన మక్కలను వచ్చే మూడు రోజులలో కొనుగోలు ప్రక్రియ పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గద్వాల వ్యవసాయ మార్కెట్ యార్డులో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. కొనుగోలు కేంద్రానికి మొక్కజొన్న భారీగా రావడంతో మార్కెట్ యార్డ్ పరిసరాల్లో ఉంచిన ధాన్యాన్ని కలెక్టర్ తిరిగి పరిశీలించారు. అకాల వర్షాలతో ధాన్యం తడిసిపోకుండా షెడ్లలో కాకుండా షెడ్లు సరిపోక బహిరంగ ప్రదేశంలో ఉంచిన మొక్కజొన్నను ముందుగా తూకం చేయాలని ఆదేశించారు. లారీల కొరతను పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ గోదాములు సరిపోనందున ప్రైవేటు గోదాముల్లోనూ మొక్కజొన్నను నిలువ ఉంచాలని సూచించారు. ప్రస్తుతం హమాలీల కొరత పరిష్కారమైనందున ఇబ్బంది లేదన్నారు.



అనంతరం జిల్లా కలెక్టర్ పంట కొనుగోలుకు సంబంధించి రైతుల ధ్రువీకరణ పత్రాలను, వివిధ రిజిస్టర్లను పరిశీలించారు. పలువురు రైతులతో మాట్లాడారు. అనంతరం జిల్లాలోని ఎనిమిది మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల వద్ద కొనుగోలు ప్రక్రియపై జిల్లా కలెక్టర్ తన ఛాంబర్ లో సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ నర్సింగరావు, మార్కెటింగ్ అధికారి పుష్పమ్మ, మార్క్ఫెడ్ డిఎం చంద్రమౌళి, డీఏవో వీరప్ప, డిపిఓ శ్రీకాంత్, పౌరసరఫరాల శాఖ మేనేజర్ విమల, గద్వాల మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ శ్రీకాంత్, గద్వాల మండల వ్యవసాయాధికారి ప్రతాప్ కుమార్, తహసిల్దార్ హరికృష్ణ, పిఎసిఎస్ ఇన్చార్జి సీఈవో రాజు, తదితరులున్నారు.

# బాలికల విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత

- మంత్రి గడ్డం వివేక్

**రామచంద్రపురం, మే 19 (జనం సాక్షి) :** విద్య, వైద్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల్లో బాలికల విద్యాభివృద్ధికి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు ఎంతో కీలక పాత్ర పోషిస్తున్నాయని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు.రామచంద్రాపురం మండలం తెల్లాపూర్ డివిజన్ ఉస్మాన్ నగర్ పరిధిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో రూ.60 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న అదనపు తరగతి గది భవన నిర్మాణ పనులకు మంగళవారం మంత్రి వివేక్ వెంకటస్వామి, స్థానిక ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆర్థిక, సామాజిక కారణాలతో చదువుకు దూరమవుతున్న బాలికలకు ఉచిత విద్య, వసతి, భోజనం వంటి సౌకర్యాలు కల్పిస్తూ కేజీబీవీలు విద్యావకాశాలను చేరువ చేస్తున్నాయని తెలిపారు. ముఖ్యంగా పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల విద్యార్థినులకు ఉన్నత విద్య దిశగా ముందుకు సాగే అవకాశాన్ని కల్పిస్తున్నాయని కార్మిక సమస్యలను



తగ్గించడంలో కూడా కేజీబీవీలు కీలకంగా పేర్కొన్నారు. బాల్య వివాహాలు, బాల పది మారాయని, గ్రామీణ ప్రాంతాల్లో బాలికల చదువుకు అండగా నిలుస్తూ వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తున్నాయని మంత్రి తెలిపారు. గత సంవత్సరాలుగా ఉస్మాన్ నగర్ కస్తూర్బా గాంధీ విద్యాలయ విద్యార్థులు పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభకనబరుస్తూ విద్యా రంగంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవడం అభినందనీయమన్నారు.కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, మాజీ ప్రజాప్రతినిధులు,సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బక్రీద్ నేపథ్యంలో నర్సాపూర్ చెక్‌పోస్టు తనిఖీ





**నర్సాపూర్, మే 19 (జనం సాక్షి) :** బక్రీద్ పండుగ నేపథ్యంలో జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం నర్సాపూర్ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక చెక్‌పోస్టును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ విధానం, రికార్డుల నిర్వహణను ఎస్పీ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అక్రమ పశువుల రవాణాకు పాల్పడే వారిపై ఎలాంటి రాజీ లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.పశువులను తరలించే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, సంబంధిత అనుమతి పత్రాలు, రవాణా ధృవపత్రాలు తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. తనిఖీ చేసిన ప్రతి వాహనం వివరాలను రిజిస్టర్లలో నమోదు చేసి పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రాత్రి సమయంలో విధులు నిర్వహించే సిబ్బంది ట్రాఫిక్ బ్యాటన్స్, రిఫ్లెక్టివ్ జాకెట్లు వినియోగించాలని సూచించారు. అక్రమ రవాణా లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను ఎస్పీ కోరారు. జిల్లాలో అక్రమ కార్యకలాపాల నియంత్రణకు పోలీస్ శాఖ కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీఐ లు జాన్ రెడ్డి, సందీప్ రెడ్డి, రంజిత్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## పెబ్బేరు ఆసుపత్రి నిర్మాణంలో నాణ్యత పాటించాలి

- మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్



**పెబ్బేరు, మే 19 (జనం సాక్షి) :** పెబ్బేరు పట్టణ ప్రజలకు మెరుగైన, కార్పొరేట్ స్థాయి ఉచిత వైద్య సేవలను అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణ పనులను స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘరెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం నిర్మాణ పనులు పరిశీలించారు. భవన నిర్మాణంలో జరుగుతున్న పనుల పురోగతిని, గదుల నిర్మాణ శైలిని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పేద ప్రజలకు అధునాతన వైద్య సేవలు మరింత చేరువ చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ఈ 30 పడకల ఆసుపత్రిని మంజూరు చేసిందని తెలిపారు. పనుల్లో ఎక్కడా రాజీ పడకుండా, పూర్తి నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. నిర్ణీత కాలవ్యవధిలోగా పనులన్నీ పూర్తి చేసి, భవనాన్ని ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మార్కెట్ డైరెక్టర్ రామన్ గౌడు, మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్, బుర్రమోని రాములు యాదవ్, రణధీర్ రెడ్డి, విష్ణువర్ధన్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## వెల్దుర్తి నర్సాపూర్ ప్రధాన రహదారిపై రైతుల ధర్నా



**వెల్దుర్తి, మే 19 (జనం సాక్షి) :** ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయడం లేదని వెల్దుర్తి మండలం మన్నె వారి జలాల్పూర్ రైతులు మంగళవారం ఆందోళనకు దిగారు తమ గ్రామంలోని కొనుగోలు కేంద్రాల వద్ద సుమారు 40 లారీల ధాన్యాన్ని గత నెల రోజుల నుండి ఉంచగా ఇప్పటివరకు కేవలం రెండు లారీల ధాన్యాన్ని మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేసిందని రాత్రింబవళ్లు ఎండనక వాననక పడిగపులు కాస్తున్న ప్రభుత్వం కొనుగోలును వేగవంతం చేయడం లేదు ఆగ్రహించిన రైతులు మంగళవారం వెల్దుర్తి నరసాపూర్ ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నాకు దిగారు దీంతో ఎక్కడి వాహనాలు అక్కడే ఆగిపోగా అటు వాహనదారులు ఇటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు సమాచారం తెలుసుకున్న స్థానిక ఎస్సై రాజు తాసిల్దార్ శ్రీనివాస్ అక్కడికి చేరుకొని ప్రజలకు నచ్చజెప్పి లారీలను పంపించి ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు ఆందోళన నిర్మించారు.

## జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

- బ్లాక్‌స్పాట్‌గా కూచారం చౌరస్తా
- ప్రత్యామ్నాయంగా సర్వీస్ రోడ్డులో ఏర్పాటు చేసేందుకు ఎస్ఐ కృషి



**తూప్రాన్, మే 19 (జనం సాక్షి) :** మెదక్ జిల్లా మనోహరాబాద్ మండల పరిధిలోని ముప్పిరెడ్డిపల్లి కొండాపూర్ పారిశ్రామిక వాడలోనికి వెళ్లడానికి కూచారం వద్ద ఉన్న మలుపు తీసుకొని దాదాపు 200 మీటర్లు రాంగ్ రూట్లో వెళ్లడంతో చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారు ,అలాగే పరిశ్రమ వాడ చెందిన ఉద్యోగులు ఎంతోమంది చలాన్లతో ఇబ్బంది పడుతున్నారని ఈ విషయమై ముప్పిరెడ్డిపల్లి గ్రామస్తులు ఎస్సై సుభాష్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వీస్ రోడ్ రిపేర్ చేయించి వాహనదారులకు సులభంగా వెళ్లడానికి ప్రమాదాల నుంచి నివారణ కల్పించడానికి జిఎంఆర్ సంస్థతో అలాగే ఫారెస్ట్ అధికారులతో మాట్లాడారు. త్వరలోనే సర్వీస్ రోడ్ సమస్య ప్రమాదాలు జరగకుండా చూస్తామని కృషి చేస్తున్నామని ఎస్ఐ హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో. సర్పంచ్ రాజనర్సింహ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## వార్డు సమస్యలను పరిష్కరించుకుందాం



**సంగారెడ్డి, మే 19 (జనం సాక్షి) :** వార్డు సమస్యలను కలిసికట్టుగా చర్చించుకుని పరిష్కరించుకుందామని అధ్యక్షులు రామకృష్ణారెడ్డి సూచించారు. మంగళవారం అశోక్ నగర్ భవానీపురం కాలనీ లోని శ్రీ భ్రమరాంబ ఎంక్లేవ్ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కమిటీ సభ్యులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో అధ్యక్షుడు రామకృష్ణ రెడ్డి తో పాటు ఉపాధ్యక్షుడు సుధాకర్ రావు,కార్యదర్శి ప్రహ్లాద్ రెడ్డి,కోశాధికారి శ్రీనివాస్, సభ్యులు అర్జున్,సాంబశివరావు, శ్రీనివాస్,బాపురెడ్డి, కృష్ణా రెడ్డి, జయంత్ పాల్గొన్నారు. కాలని సమస్యలపై సుదీర్ఘంగా చర్చలు జరిపిన అనంతరం పలు తీర్మానాలు చేశారు. వార్షిక ఆదాయం, ఖర్చు లెక్కలను చూసుకొని, అవసర మైతే నిధులు సమీకరించి వార్డు లో సమస్యలను పరిష్కరించు కోవాలని కమిటీ సభ్యులు స్పష్టం చేశారు. గతంలో పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పనుల నిమిత్తం కొంత అర్థిక సహాయం చేయడం జరిగింది అన్నారు. మరో సారి ఎమ్మెల్యేను కలసి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. వార్డులో మంచినీటి ఎద్దడి నివారణకు సత్వర చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. కొన్ని చోట్ల రోడ్లపై మట్టి వేయించాలని నిర్ణయించారు. పలువురు సభ్యులు తమసలహాలు,సూచనలు అందిస్తూ అవసర మైతే సంబంధిత శాఖల అధికారులను కలసి సమస్యలపై వినతి పత్రాలు అందించాలని సూచించారు.

# జర్నలిస్ట్ జోగు రాములు మరణం తీరని లోటు

- ఐజేయు రాష్ట్ర కార్యదర్శి మధు గౌడ్

**శ్రీరంగాపూర్, మే 19 (జనం సాక్షి) :** వనపర్తి జిల్లాలోని గోపాల్ పేట మండలంలో వెలుగు దినపత్రిక జర్నలిస్టుగా ప్రజా సమస్యల కోసం నిరంతరం పరితపిస్తూ పనిచేస్తున్న జోగు రాములు అకాల మరణం జర్నలిస్ట్ లోకానికి తీరని లోటని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ టియుడబ్ల్యూజే ,(ఐజేయు) రాష్ట్ర కార్యదర్శి గుండ్రాతి మధు గౌడ్ తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. వెలుగు దినపత్రిక జర్నలిస్ట్ మరణం తెలిసిన వెంటనే రాష్ట్ర కార్యదర్శి వెంట తెలంగాణ టియుడబ్ల్యూజే (ఐజేయు) నాయకులు వనపర్తి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మాధవరావు, రాజు, రాష్ట్ర హౌసింగ్ సైట్స్ మెంబర్ శ్రీనివాసరావు ఈశ్వర్, తదితరులు మరణించిన జర్నలిస్టు జోగు రాములు కుటుంబాన్ని పరామర్శించి జర్నలిస్టు సంఘం తరఫున రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్‌తో చర్చించి తగిన న్యాయం చేసి



ఆర్థికంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఇప్పటికే తెలంగాణ రాష్ట్రంలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని వనపర్తి, నాగర్ కర్నూల్, గద్వాల, నారాయణపేట, మహబూబ్ నగర్ జిల్లాలో జర్నలిస్టులు వృత్తిపరంగా అనేక ఒత్తిళ్లకు గురవుతూ ఉండే పోటు మరణాలు, డయాబెటిస్, రోడ్డు ప్రమాదాలతో మరణిస్తున్న సంఘటనలు జీర్ణించుకోలేక పోతున్నామని వెంటనే వృత్తిలో కొనసాగుతూ కారణాలతో మరణిస్తున్న జర్నలిస్టులను తెలంగాణలో అతిపెద్ద జర్నలి (ఐజేయు) జర్నలిస్టు సంఘం ఆదుకుంటుందని రాష్ట్ర కార్యదర్శి గుండ్రాతి మధు గౌడ్ తెలిపారు. ఇప్పటికే అనేక జర్నలిస్టు కుటుంబాలను తెలంగాణ టియుడబ్ల్యూజే (ఐజేయు) యూనియన్ తరపున అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తూ ఆదుకున్న సంగతి గుర్తు చేశారు. జర్నలిస్టులు ఆత్మ ధైర్యం కోల్పోకుండా వృత్తి ధర్మాన్ని ఆత్మస్థైర్యంతో ముందుకు నడపాలని ఎవరు కూడా భయపడవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. అనేక సమస్యలు ఉన్నప్పటికీ ఆరోగ్యపరంగా విద్యాపరంగా వైద్య పరంగా అన్ని రంగాల్లో (ఐజేయు) జర్నలిస్టు సంఘం ఆదుకుంటుందని ఆ విషయం ప్రతి ఒక్క జర్నలిస్టు గుర్తు పెట్టుకోవాలని సూచించారు. మృతి చెందిన జోగు రాములు కుటుంబాన్ని పరామర్శించారు.

# భక్తులకు సమగ్ర వైద్య సేవలు అందించాలి

- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ డాక్టర్ రవీందర్ నాయక్



**కాళేశ్వరం, మే 20 (జనంసాక్షి) :** భూపాలపల్లి జిల్లా లోని కాళేశ్వరంలో ఈ నెల 21 నుండి జూన్ 1వ తేదీ వరకు నిర్వహించ నున్న సరస్వతి మాత అంత్య పుష్కరాల సందర్భంగా భక్తులకు అందించనున్న వైద్య సేవల ఏర్పాట్లను పర్యవేక్షించడానికి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ డాక్టర్ రవీందర్ నాయక్ మంగళవారం కాళేశ్వరం ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కాళేశ్వరం పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 10 వైద్య శిబిరాలు, 20 పడకల సామర్థ్యంతో ఏర్పాటు చేసిన రెండు ఆసుపత్రులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి జిల్లా వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్, ములుగు జిల్లా వైద్యాధికారి డాక్టర్ గోపాలరావు, హనుమకొండ జిల్లా వైద్యాధికారి డాక్టర్ అప్పయ్య, ప్రోగ్రాం అధికారులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రవీందర్ నాయక్ మాట్లాడుతూ, సరస్వతి అంత్య పుష్కరాలకు భారీగా వచ్చే భక్తులకు వైద్య ఆరోగ్యశాఖ తరఫున ఎలాంటి లోటు లేకుండా సమగ్ర వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. వైద్య శిబిరాలలో అవసరమైన మందులు, సిబ్బంది, అత్యవసర సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భక్తుల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యతనిస్తూ అన్ని ఏర్పాట్లు సమర్థవంతంగా నిర్వహించాలని ఆయన తెలిపారు.

# ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలు జరిగితే కఠిన చర్యలు

- రైస్ మిల్లులను సీజ్ చేసేందుకు వెనుకాడబోం.. పోలీస్ కేసులు తప్పవు
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఫైర్
- గణపురం, చిట్యాల మండలాల్లో ఆకస్మిక తనిఖీలు





**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలకు పాల్పడి రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తప్పవని, అవసరమైతే రైస్ మిల్లులను సీజ్ చేయడంతో పాటు పోలీస్ కేసులు నమోదు చేస్తామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హెచ్చరించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు గణపురంలోని జానకిరామ్ రైస్ మిల్, చిట్యాల మండలం కైలాపూర్‌లోని లక్ష్మీనరసింహ ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం దిగుమతి అవుతున్నా, రైతులకు ట్రక్ షీట్‌లు ఇవ్వకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంటా పూర్తవగానే ట్రక్ షీట్‌లు ఇవ్వాలని, ట్రక్ షీట్‌లు లేకుండా ధాన్యాన్ని మిల్లులకు తరలించడం సరికాదని అధికారులపై మండిపడ్డారు. ధాన్యం కొనుగోళ్లలో రైతులను ఎట్టి పరిస్థితుల్లోనూ మోసం చేయొద్దని, ఇలాంటి చర్యల వల్ల జిల్లాకు చెడ్డ పేరు వస్తుందని ఆయన ఫైర్ అయ్యారు. గత ఎనిమిదేళ్లుగా జరుగుతున్న దోపిడీ పద్ధతులు ఇకపై కొనసాగవద్దని, తక్షణమే సరిచేసుకోవాలని సూచించారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ట్రక్ షీట్‌లు ఇవ్వడం తప్పనిసరి చేయాలని, దీనిపై జిల్లా యంత్రాంగం పర్యవేక్షణ పెంచాలని ఆదేశించారు. వర్షాలు వస్తే రైతులు ఇబ్బంది పడతారని కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో 90 శాతం మక్కల కొనుగోలు పూర్తయిందని, చిట్యాల మండలం తిరుమలాపూర్‌లో మక్కల రవాణాకు వెంటనే వాహనాలు ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ.. కాంటా పూర్తవగానే రైతులకు ట్రక్ షీట్‌లు ఇవ్వాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చినా అమలు కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మళ్లీ ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని, రైస్ మిల్లుల్లో ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగవంతంగా జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి కిరణ్ కుమార్, డీఎం రాములు, సహకార అధికారి వాలియా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోల్, డీజిల్ ధరలు మళ్లీ పెంచడం దారుణం

- సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు



**హనుమకొండ ప్రతినిధి మే 19 (జనం సాక్షి) :** పెట్రోల్, డీజిల్ ధరలను ఒకవైపు తగ్గించాలని ప్రజలు ఆందోళన చేస్తుండగా మళ్లీ ధరలను పెంచడం దారుణమని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు తెలిపారు. పెట్రోల్, డీజిల్ చార్జీలను మూడు రోజుల క్రితమే మూడు రూపాయలు పెంచిన బిజెపి ప్రభుత్వం, మళ్లీ మంగళవారం పెట్రోల్, డీజిల్ పై 90 పైసలు పెంచడం దారుణమని శ్రీనివాసరావు అన్నారు. ఇప్పటికే పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో ఇబ్బంది పడుతున్న సామాన్యులు తాజాగా పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలతో పేద, మధ్య తరగతి ప్రజలపై మరింత భారం పెరిగిందని అన్నారు. పెట్రో ధరల పెంపుతో రవాణా, నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పది రోజుల క్రితం వాణిజ్య, గృహ వినియోగ సిలిండర్ ధరలను భారీగా పెంచి కనికరం లేకుండా సామాన్య ప్రజలపై బిజెపి ప్రభుత్వం భారం మోపిందని అన్నారు. కార్పొరేట్ వర్గాలకు కేంద్రంలోని నరేంద్ర మోడీ సర్కార్ ఊడిగం చేస్తూ పేదల సంక్షేమాన్ని విస్మరిస్తున్నదని అన్నారు. గడిచిన 12 ఏళ్లుగా ఆదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ శక్తుల కనుసన్నల్లో పాలకులు ముందుకు సాగుతున్నారని విమర్శించారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించి కార్పొరేట్ శక్తులకు దాసోహం అయ్యారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక చర్యలను ప్రతి ఒక్కరూ నిరసించాలని పిలుపునిచ్చారు. పెంచిన పెట్రోల్, డిజీల్ ధరలను వెంటనే తగ్గించని ఎడల బిజెపి ప్రజా గ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. తక్షణమే పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించి ప్రజలకు ఉపశమనం కలిగించాలని, లేని పక్షంలో బిజెపి పతనం ఖాయమని అన్నారు.

# రెండు పంటలకు సాగునీరు అందించడమే లక్ష్యం

- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



స్టేషన్ ఘన్‌పూర్ , మే 19 ( జనం సాక్షి) : నియోజకవర్గంలోని ప్రతీ ఎకరానికి రెండు పంటలకు సాగునీరు అందించడమే లక్ష్యాంగా నిరంతరం పని చేస్తున్నానని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. చిల్పూర్ మండలం లింగంపల్లి గ్రామ శివారులోని గండిరామారం ఎత్తిపోతల పథకంలోని లిఫ్ట్-1పంపు హౌస్ నిర్మాణపనులను ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధికారులు, కాంట్రాక్టర్, ప్రజా ప్రతినిధులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు జరుగుతున్న తీరుపై అధికారులు,కాంట్రాక్టర్ పై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ కడియం శ్రీహరి మాట్లాడుతూ సబ్ స్టేషన్ లేకుండా పంపు హౌస్ ఎలా పని చేస్తుందని నీటిని ఎలా లిఫ్ట్ చేస్తారని, పంపు హౌస్ తో పాటు సబ్ స్టేషన్ నిర్మాణం చేయాలని తెలియదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మొన్న మంత్రి సిమీక్షా సమావేశంలో జూన్ 30 వరకు పూర్తి చేస్తామని ఎలా చెప్పారని, సాధ్యం కానీ పనులు ఎందుకు చెప్తారని మండిపడ్డారు. సమ స్యలుచెప్పకపోతే ఎలాపరిష్కారం అవుతాయాని ప్రశ్నించారు. పంపు హౌస్ సివిల్ వర్క్ ఎప్పటి వరకు పూర్తి చేస్తారని, సబ్ స్టేషన్ వర్క్ ఎప్పుడు స్టార్ట్ చేస్తారని, అప్రోచ్ ఛానల్ వర్క్ ఎప్పుడు పూర్తి చేస్తారు అని ప్రశ్నల వర్షం కురిపించారు. తను నీటి పారుదల శాఖ మంత్రిగా పని చేశానని సాంకేతికంగా నీటి పారుదలశాఖ పూర్తి అవగాహన ఉందని అన్నారు. లిఫ్ట్ -1ద్వారా చెరువు లు, కుంటలు నింపేందుకు అదనపు పైప్ లైన్ అనుమతులు, పంపు హౌస్ వరకు అప్రోచ్ రోడ్ నిర్మాణం, పంపు హౌస్ వద్ద రెండు రూముల ఆఫీస్ కార్యాలయం నిర్మాణానికి వెంటనే ప్రతిపా దనలు సిద్ధం చేసి రెండు రోజులలో అనుమతులు తీసుకోవాలని ఆదేశించారు. లిఫ్ట్ -1 కు సంబంధించి ప్రతీ కాంపోనెంట్ పై పూర్తి స్థాయి సమీక్షా నిర్వ హించాలని అధికారు లను ఆదేశించారు. సివిల్ వర్క్, ఎలక్ట్రికల్, అప్రోచ్ ఛానల్, పంపింగ్ మోటా ర్స్, పైప్ లైన్ వంటి పనులను ఖచ్చితమైన తేదీ లోగా పూర్తి చేసేందుకు షెడ్యూల్ రూపొందించాలని సూచించారు. ఎట్టిపరిస్థితుల్లో జులై 31 నాటి కి లిఫ్ట్ -1పనులు పూర్తి చేయాలని, ఈ వర్షాకాలం లోనే లిఫ్ట్-1 ద్వారా సాగు నీరు అందించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదల శాఖ ఎస్ఈ సీతారాం, ఈఈ ప్రవీణ్, కాంట్రాక్టర్ వెంకటేశ్వర్ రెడ్డి, చిల్పూర్ ఆలయ కమిటీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, చిల్పూర్, వేలేరు మండలాల సర్పంచులు, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# గూడెప్పాడ్ గ్రామ రామాలయంలో చోరీ

**ఆత్మకూర్, మే 19 (జనం సాక్షి):** హనుమకొండ జిల్లా ఆత్మకూర్ మండలంలో గూడెప్పా డ్ గ్రామంలో ఉన్న జాతీయ రహదారి 163 పక్కన ఉన్న రామాలయంలో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి విలువైన వెండి వస్తువు ఎత్తుకెళ్లారు. దాని విలువ రూ 2,37,600 ఉంటుందని గుడి చైర్మన్ కందికొండ రఘుపతి ఆత్మకూరు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. మంగళవారం తెల్లవారుజామున గ్రామ పంచాయతీ సిబ్బంది అటు వైపు వెళుచుండగా గుడిలోని లైట్లు ఆఫ్ చేసి ఉండడంతో అటు వెళ్లి చూడగా దేవాలయ గర్భగుడి తాళాలు పగలగొట్టి ఉండడంతో పక్కనే ఉన్న గుడి చైర్మన్ కు విషయం తెలియజేశారు. వెంటనే గుడి చైర్మన్ వెళ్లి చూడగా దేవాలయ గర్భగుడి తాళాలు పగలగొట్టి ఉన్నాయని అందులో ఉన్న విలువైన వెండి వస్తువులు 2 షట గోపాలు,2 వెండి ప్లేట్స్, 1 వెండి గద,వెండి చెంచా వాటిని విలువ 1.08 కేజీలు వెండి దీని విలువ 2, 37,600 రూపాయలు ఉంటుందని వీటిని ఎవరో గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లారని దీనిపై ఆత్మకూరు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆత్మకూరు సిఐ సంతోష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# బీహార్ కార్మికుడి ఆత్మహత్య!



**చెన్నారావుపేట, మే 19 ( జనంసాక్షి) :** ఉరివేసుకొని బీహార్ కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన చెన్నారావుపేట మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం...బీహార్ రాష్ట్రానికి చెందిన ప్రవీణ్ కుమార్ (22) మధ్యప్రదేశ్ కు చెందిన నేతి బబ్లీ అనే మహిళతో చెన్నారావుపేట గ్రామంలో ఏప్రిల్ 8వ తేదీ నుండి అద్దె ఇంటిని తీసుకొని సహజీవనం చేస్తున్నాడు. ఇద్దరు కలిసి ప్రతిరోజు చెన్నారావుపేట గ్రామంలో స్థానిక భవన నిర్మాణ కార్మికులతో కలిసి భవన నిర్మాణ పనులకు వెళ్తున్నారు. రోజువారి మాదిరిగానే నేతి బబ్లి అనే మహిళ మంగళవారం భవన నిర్మాణ పనులకు వెళ్ళింది. ప్రవీణ్ కుమార్ పనికి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉన్నాడు. అతిగా మద్యం తాగి అద్దె ఇంట్లో ఉంటున్న ఫ్యాన్ కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మధ్యాహ్నం వేళలో నేతి బబ్లీ అనే మహిళ ప్రవీణ్ కుమార్ కు ఫోన్ చేయగా ఫోన్ ఎత్తడం లేదు. పని ప్రదేశం నుండి వచ్చి చూసేసరికి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుని కనిపించాడు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కు తరలించారు. నేతి బబ్లీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# నేటి యువతకు చరిత్ర, సంస్కృతిపై అవగాహన కలిగి ఉండాలి

- పురావస్తు శాఖ మ్యూజియం పరిశీలన
- కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి



**వరంగల్ ప్రతినిధి, మే19 (జనంసాక్షి) :** నేటి యువత మన సంస్కృతి, చరిత్ర, సంపదను పరిరక్షించుకుంటూ వాటిపైన అవగాహన పెంపొందించుకోవాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. మంగళవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో లో యూత్ అండ్ స్పోర్ట్స్ వారోత్సవాల్లో రెండవ రోజు కార్యక్రమాలలో భాగంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద వరంగల్‌లోని పురావస్తు శాఖ మ్యూజియాన్ని సందర్శించి ప్రత్యేక పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి. సంధ్యారాణి, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) వైవీ గణేష్, జడ్పీ సీఈవో రాంరెడ్డి, పశుసంవర్ధక శాఖ జేడీ బాలకృష్ణ, పురావస్తు శాఖ ఏడీ బుజ్జి, యూత్ అండ్ స్పోర్ట్స్ అధికారి అనిల్ తదితర సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యువతలో చరిత్ర, సంస్కృతి పట్ల అవగాహన పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మన వారసత్వ సంపదను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలను ప్రజలకు చేరువ చేయడంలో యువత భాగస్వామ్యం ఎంతో కీలకమని, యువత సామాజిక చైతన్యంతో ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బందెల దొడ్డిలో 3 తప్పిపోయిన గేదెలు

**చెన్నారావుపేట, మే 19 ( జనం సాక్షి):** మండలంలోని కాల్ నాయక్ తండ గ్రామపంచాయతీ బందెల దొడ్డిలో 3 తప్పిపోయిన గేదెలు తమ ఆధీనంలో ఉన్నాయని గ్రామ సర్పంచ్ లావుడ్య తిరుపతి నాయక్, పంచాయతీ కార్యదర్శి గొడిశాల వికాస్ గౌడ్ లు మంగళవారం తెలిపారు. గత మూడు రోజుల క్రితం మూడు గేదెలు తప్పిపోయి కాల్ నాయక్ తండ గ్రామానికి వచ్చాయని వాటిని బందెల దొడ్డిలో భద్రంగా ఉంచినట్లు తెలిపారు.గేదెల యజమానులు తమ యాజమాన్య వివరాలను సమర్పించి గ్రామపంచాయతీ బందెల దొడ్డి నిర్వహణ ఫీజు చెల్లించి తీసుకెళ్లాలని కోరారు. లేకుంటే గేదెలను వేలం వేయడం జరుగుతుందని వారు తెలిపారు.

# రూ.1.60 లక్షల సొత్తు ఎత్తుకెళ్లిన వ్యక్తి అరెస్ట్

- పట్టపగలే చోరీ

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భూపాలపల్లి పట్టణంలో పగటిపూట ఇంటి తాళం పగులగొట్టి రూ. 1.60 లక్షల విలువైన బంగారం, వెండి, నగదు చోరీ చేసిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. చోరీ సొత్తును స్వాధీనం చేసుకొని నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. భూపాలపల్లి పట్టణంలోని మహబూబ్‌పల్లి ప్రాంతానికి చెందిన మర్రి ఓదెలు ఈ నెల 11న ఉదయం 5:30 గంటలకు పనికి వెళ్లి మధ్యాహ్నం ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉండటాన్ని గుర్తించాడు. గుర్తు తెలియని దుండగులు ఇంట్లో ఉన్న 1 తులం బంగారు గొలుసు, 30 తులాల వెండి పట్టీలు, 15 తులాల వెండి కాళ్ల గొలుసులు, రూ. 50,000 నగదు మొత్తం సుమారు రూ. 1,60,000 విలువైన సొత్తును ఎత్తుకెళ్లినట్లు గుర్తించి భూపాలపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అన్ని ఆధారాలు సేకరించి నిందితుడిని భూపాలపల్లి మండలం కొంపెల్లి లచ్చిరాం తండాకు చెందిన బైరవేని లక్ష్మణ్ కుమార్‌గా గుర్తించారు. నిందితుడిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి చోరీకి గురైన బంగారు, వెండి ఆభరణాలు, నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. ఇళ్ల భద్రతపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని భూపాలపల్లి సీఐ నరేష్ కుమార్ తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని తెలిపారు.

# కెమెరా పట్టిన కలెక్టర్



**ఆదిలాబాద్ ప్రతినిధి, (జనంసాక్షి) :** పక్షి ఆవశ్యకత గురించి పరిచయం చేస్తూ సాక్షాత్తు జిల్లా కలెక్టర్‌తో ఆ పక్షి అందాలను కెమెరాలో వీక్షింపజేశాడు జిల్లాకు చెందిన ప్రముఖ వైల్డ్ లైఫ్ ఫోటోగ్రాఫర్ లింగంపల్లి కృష్ణ. ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక పర్యాటక వారోత్సవాల్లో భాగంగా వినూత్నంగా ఇన్ఫ్లుయన్స్ ర్ రీల్స్ కాంపిటిషన్ లో భాగంగాకలెక్టర్ రాజర్షి షా మంగళవారం మావాల మండలంలో ఉన్న హరిత వనంలో విలేకరుల సమావేశం నిర్వహించి కొద్దిసేపు సఫారీ చేసి అనంతరం అక్కడే ఉన్న చెరువు వద్దకు వెళ్లారు. అక్కడే పక్షి ఫోటోలను తీస్తున్న కృష్ణ కలెక్టర్ వద్దకు వెళ్ళి ఆప్రాంతంలో ఉన్న పక్షుల ఆవశ్యకత, అక్కడ ఏ ఏ పక్షులు ఉన్నాయో వాటి గురించి వివరించి తన కెమెరాను కలెక్టర్‌కు ఇచ్చి స్వయంగా విస్లింగ్ డక్ అనే పక్షి ఫోటోను తీయించాడు కృష్ణ. పక్షి ఫోటోను చూసి కలెక్టర్ ఎంతో ఆనందం వ్యక్తం చేశారు.


# అధికారులు సమన్వయంతో పని చేయాలి

- కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత




**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, మే 19(జనంసాక్షి):** జిల్లా అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ తో కలిసి ప్రభుత్వ శాఖల ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 12వ తేదీన విద్యా సంవత్సరం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలలు, ఆశ్రమ, గురుకుల పాఠశాలలలో మౌలిక వసతుల కల్పన పూర్తి చేయాలని తెలిపారు. త్రాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, బాలికలకు ప్రత్యేక మూత్రశాలల నిర్మాణ పనులు పూర్తిచేయాలని, పాఠశాలలు ప్రారంభం రోజునే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వర్షాలు ప్రారంభం అయ్యేలోపు ఇంజనీరింగ్ శాఖల పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, భవనాల నిర్మాణాలు, వంతెనల పనులు, ఇతర మరమ్మత్తులు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. ప్రతి మారుమూల గ్రామాలకు త్రాగునీరు అందించాలని, పైప్ లైన్ల మరమ్మత్తులు పూర్తిచేసి ప్రతిరోజు నీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ పనులు, సమస్యలపై వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించి దరఖాస్తుదారులకు భరోసా కల్పించాలని తెలిపారు. ప్రస్తుతం యాసంగి వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ కొనసాగుతుందని, అధికారులు ప్రతిరోజూ తమ పరిధిలోని కొనుగోలు కేంద్రాలను సందర్శించి ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా పర్యవేక్షించాలని తెలిపారు. శాఖల వారీగా అభివృద్ధి పనుల పురోగతి, ఇతర కార్యక్రమాల వివరాల నివేదికను అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# టీజీఆర్‌జేసీలో రాజోలు విద్యార్థుల ప్రతిభ



**మహబూబాబాద్, మే 19(జనం సాక్షి) :** గత నెల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన టీజీఆర్జేసీ జూనియర్ కళాశాలలో అడ్మిషన్ ల కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్షలో దాదాపు 60 వేల మంది దరఖాస్తు చేసి పరీక్ష రాయగా జడ్పీహెచ్ఎస్ రాజోలు విద్యార్థులు చక్కని ప్రతిభ కనబరచడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఒక ప్రకటనలో తెలిపారు. నిన్న విడుదలైన ఫలితాల లో రాజోలు గ్రామానికి చెందిన అక్కా, తమ్ముడు రాజోలు హైస్కూల్ కు విద్యార్థులు అయిన యేలగం విష్ణు ప్రియ రాష్ట్రస్థాయిలో 213 వ ర్యాంక్, మరియు యేలగం ఉదయ్ కిరణ్ 912 ర్యాంక్ సాధించడం జరిగింది. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు దామోదర్, మోహన్, బీకు, సురేష్, రవికుమార్, రాజేశ్వరి, కిషన్, కాశీనాథ్ సతీష్, కిరణ్, భవానిఅమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్, గ్రామస్తులు అభినందించారు.

# నిరవధిక సమ్మెలోకి వెలుగు వీవోఏలు

- డిమాండ్లు పరిష్కరించకుంటే ఎన్ని రోజులైనా సమ్మెను కొనసాగిస్తాం
- వీవో జేఏసీ కమిటీ



**భీమిని మే 19 (జనంసాక్షి) :** గ్రామీణ స్థాయిలో స్వయం సహాయక సంఘాల బలుపేతానికి కృషి చేస్తున్న వివో ఏ లను నిర్లక్ష్యం చేయడం పట్ల పిఓఏల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నేటి నుండి నిరవధిక సమ్మెకు దిగారు. గత ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో ఓపికతో పని చేస్తూ స్వయం సహాయక సంఘాల బలుపేతానికి కృషి చేస్తూనే పోరాటాలు చేశామని. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నెరవేర్చలేదని ప్రభుత్వం వివో ఏ లను సెల్ఫ్ ఉద్యోగులుగా గుర్తించడంతోపాటు కనీస వేతనం 20000 చెల్లించాలని ప్రతి వివోఏకు సాధారణ ఆరోగ్య భీమా కింద 20 లక్షలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని. అర్హులైన వివో లను సీసీలుగా ప్రమోషన్ కల్పించాలని ట్యాబ్ మరియు నెట్ సౌకర్యం కల్పించడంతోపాటు 58 జీవోను సవరించి వివోఏలకు న్యాయం చేయాలని డిమాండ్లతో నిరవధిక సమ్మెకు జరిగా దిగడం జరిగిందని. ప్రభుత్వం సానుకూలంగా డిమాండ్లను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఈ సమ్మె ప్రభుత్వం దిగివచ్చే వరకు వివో ఎలా జేఏసీ తరఫున నెరవేక సమ్మె కొనసాగుతుందని తెలిపారు. వివో ఏలు సూరం మల్లేష్ సిరికొండ భీమేష్ కామెర మల్లేష్ జంగిపల్లి భాస్కర్ జాడి ధర్మయ్య పద్మ ముక్తేశ్వర్ వివోఏలు పాల్గొన్నారు

# వారంలోగా ధాన్యం కొనుగోళ్ల లక్ష్యాన్ని పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్
- దిగుమతులు వేగవంతం చేయడానికి మరిన్ని అన్‌లోడింగ్ పాయింట్ల గుర్తింపు
- రైస్ మిల్లులు, కొనుగోలు కేంద్రాల్లో జిల్లా కలెక్టర్ సుడిగాలి పర్యటన



**సూర్యాపేట ప్రతినిధి, మే 19 (జనంసాక్షి) :** జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేసి, రానున్న వారం రోజుల్లో నిర్దేశిత కొనుగోలు లక్ష్యాన్ని పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ స్పష్టం చేశారు. మంగళవారం ఆయన ఆత్మకూరు (ఎస్) మండల కేంద్రంలోని రైస్ మిల్లుతో పాటు, పాతర్లపాడు గ్రామంలోని అరోహి రైస్ మిల్లును సందర్శించి ధాన్యం నిల్వలు, మిల్లింగ్ ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు.నూతనకల్ మండలంలోని ఎర్రపహాడ్ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. మద్దిరాల మండల కేంద్రం, గుమ్మడివల్లి గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. తుంగతుర్తి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలోని కొనుగోలు కేంద్రంతో పాటు, వెంపటి గ్రామం, రావులపల్లి ఎక్స్ రోడ్ వద్ద ఏర్పాటు చేసిన కేంద్రాలను తనిఖీ చేశారు.తిరుమలగిరి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు.నాగారం మండలం ఈటూరు గ్రామంలోని సోమేశ్వర రైస్ మిల్లును సందర్శించి అన్‌లోడింగ్ సామర్థ్యాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో అన్ని శాఖల అధికారుల సమన్వయంతో కొనుగోలు చేసిన ధాన్యాన్ని వేగంగా అన్‌లోడింగ్ చేస్తున్నట్లు తెలిపారు. ధాన్యం దిగుమతి ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం జరగకుండా ఉండేందుకు వీలుగా, పెద్ద ఎత్తున అన్‌లోడింగ్ పాయింట్లను గుర్తించినట్లు వెల్లడించారు. రైతులు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. రానున్న వారం రోజులు అత్యంత కీలకమని కాబట్టి అధికారులు, మిల్లుల యజమానులు సమన్వయంతో పనిచేసి లారీలను వేగంగా అన్‌లోడ్ చేయించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారులు హమీన్ సింగ్, శ్రీనివాసరావు, తబిత, దయానంద్, వ్యవసాయ శాఖ ఎఓ రుహి,ఎంపీడీఓ శేషు కుమార్, ఏడి రమేష్ బాబు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలపై పోలీసుల ఉక్కుపాదం

- మండల కేంద్రంలో పోలీస్ జాగిలాలతో ముమ్మర తనిఖీలు
- మెడికల్, పాన్ షాపులు, హైవే డాబాలలో సోదాలు
- యువతను బలితీసుకుంటే పీడీ యాక్ట్ తప్పదు
- ఎస్సై కృష్ణయ్య హెచ్చరిక



**మాడుగులపల్లి, మే 19 (జనం సాక్షి) :** మండల కేంద్రంలో మత్తు పదార్థాల విక్రయాలు, రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపారు మాడుగులపల్లి సబ్ ఇన్స్పెక్టర్ (ఎస్ఐ) కృష్ణయ్య ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంతో పాటు జాతీయ రహదారి పరిసర ప్రాంతాల్లో పోలీస్ బృందాలు విస్తృత తనిఖీలు నిర్వహించాయి యువత భవిష్యత్తును నిర్వీర్యం చేస్తున్న గంజాయి, ఇతర మత్తు పదార్థాల నియంత్రణే ధ్యేయంగా ఈ సోదాలు జరిగాయి ఇందులో భాగంగా ప్రత్యేకంగా శిక్షణ పొందిన పోలీస్ జాగిలాలను (డాగ్ స్క్వాడ్) రంగంలోకి దించి క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టడం స్థానికంగా కలకలం రేపింది మండల కేంద్రంలోని పలు కీలక ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని పోలీసులు ఈ తనిఖీలు నిర్వహించారు ముఖ్యంగా యువత ఎక్కువగా వచ్చే మెడికల్ షాపులు, పాన్ షాపులు, బేకరీలను తనిఖీ చేశారు కొన్ని మెడికల్ షాపుల్లో డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు నిచ్చే మాత్రలు, సిరప్‌లు విక్రయిస్తున్నారా అనే కోణంలో రికార్డులను పరిశీలించారు పాన్ షాపులు, బేకరీలలో నిషేధిత గుట్కా, నకిలీ పొగాకు ఉత్పత్తుల నిల్వలపై నిఘా పెట్టారు అదేవిధంగా జాతీయ రహదారి (హైవే) వెంబడి ఉన్న డాబా హోటళ్లలో మత్తు పదార్థాల రవాణా, విక్రయాలు జరుగుతున్నాయనే అనుమానంతో జాగిలాల సహాయంతో అణువణువూ జల్లెడ పట్టారు ఈ సందర్భంగా ఎస్సై కృష్ణయ్య మాట్లాడుతూ మండల పరిధిలో మత్తు సంస్కృతిని పూర్తిగా అణచివేస్తామని స్పష్టం చేశారు ఎవరైనా చట్టవిరుద్ధంగా గంజాయి, మత్తు బిళ్లలు లేదా ఇతర నిషేధిత పదార్థాలను విక్రయించినా, నిల్వ చేసినా, రవాణా చేసినా వారిపై కఠినమైన పీడీ యాక్ట్ నమోదు చేయడానికి కూడా వెనుకాడబోమని హెచ్చరించారు ముఖ్యంగా యువత, విద్యార్థులు ఇలాంటి వ్యసనాలకు దూరంగా ఉండి, ఉజ్వల భవిష్యత్తును పాడుచేసుకోవద్దని హితవు పలికారు మండలంలో ఎక్కడైనా మత్తు పదార్థాల విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు అత్యంత రహస్యంగా ఉంచుతామని ఆయన కోరారు ఈ తనిఖీల్లో ఎస్సై కృష్ణయ్యతో పాటు పోలీస్ సిబ్బంది శ్రీనివాస్, సైదిరెడ్డి, డాగ్ స్క్వాడ్ బృందం పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న 6 ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



**మిర్యాలగూడ, మే 19 (జనంసాక్షి) :** అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న 6 ఇసుక ట్రాక్టర్ల ను పట్టుబడి చేసి కేసు నమోదు చేసినట్టు మిర్యాలగూడ రూరల్ ఎస్సై ఎమ్. లక్ష్మయ్య తెలిపారు.మంగళవారం ఉదయం మండల పరిధి లోని గ్రామాలలో అక్రమ ఇసుక, మట్టి రవాణా జరుగుతుందన్న సమాచారం మేరకు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా మండల పరిధిలోని తడకమల్ల – కామేపల్లి బ్రిడ్జి వద్ద ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక అక్రమం గా తరలిస్తున్న శ్రీరాముల రాము, నారబోయిన మహేష్, బుచ్చాల సతీష్, కళ్లెం యల్లయ్య, పూసపాటి సతీష్, శ్రీరాముల శ్రీను ల ట్రాక్టర్ లను పట్టుకొని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## వైద్యుల నిర్లక్ష్యంతో 8 నెలల పసికందు మృతి

- ఆసుపత్రి ముందు కుటుంబీకుల ఆందోళన

**నర్సాపూర్, మే 19 (జనం సాక్షి) :** వైద్యం వికటించి ఓ పసికందు మృతి చెందిన సంఘటన నర్సాపూర్ పట్టణంలోని మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు కుటుంబీకుల కథనం ప్రకారం ఇలా ఉన్నాయి. నర్సాపూర్ మండల పరిధిలోని జక్కపల్లి గ్రామానికి చెందిన మంజుల ఆంజనేయులు దంపతుల 8 నెలల పసికందు మణిదీప్ కు సోమవారం మూడు గంటల సమయంలో జ్వరం వచ్చిందని నర్సాపూర్ లోని అమ్మ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకువచ్చారు. అనంతరం బాలుడికి పరీక్షలు నిర్వహించిన ఆసుపత్రిలో అడ్మిట్ చేసుకొని చికిత్సలు జరిపారు. అయితే మంగళవారం ఉదయం వైద్యులు పసికందు చిన్నారి మణి దీప్ పరిస్థితి విషమంగా ఉందని సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లాలని వైద్యులు చెప్పారు. వెంటనే కుటుంబీకులు బాలుడిని అంబులెన్స్ లో సంగారెడ్డి ఆసుపత్రికి తీసుకు వెళ్లారు. సంగారెడ్డి ఆసుపత్రిలో అక్కడి వైద్యులు పరీక్షించగా అప్పటికే బాలుడు




చనిపోయినట్లు చెప్పారు. అమ్మ ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యంతోనే బాలుడు మృతి చెందాడని కావాలని పరిస్థితి విషమంగా ఉందని సంగారెడ్డి ఆస్పత్రికి తరలించే విధంగా చేశారని కుటుంబీకులు ఆరోపించారు. పసి కందు బాలుడు మణికంఠ మృతికి కారణమైన వైద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కుటుంబీకులు డిమాండ్ చేశారు. అమ్మ ఆసుపత్రిలో ఇటువంటి అల్లర్లు జరగకుండా ఎస్సై రంజిత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు చేశారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన చండూర్ ఆర్డీవో శ్రీదేవి



**మర్రిగూడ, మే 19 (జనం సాక్షి) :** చండూరు చండూర్ ఆర్డీవో శ్రీదేవి సోమవారం మర్రిగూడలోని ఐకెపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులతో మాట్లాడిన ఆర్డీఓ ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా టాబ్ ఎంట్రీలు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కొనుగోళ్లలో జాప్యం జరగకుండా చూడాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మర్రిగూడ తహసిల్దార్ జే శ్రీనివాస్, ఏపీఎం వెంకటేశ్వర్లు, సీసీ ఇందిరా, కమిటీ సభ్యులు పద్మ, అనుషతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం

- సీసీ రోడ్లు ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం



**బూర్గంపహాడ్, మే 19 (జనంసాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం పారిశ్రామిక వాడ సారపాకను అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సారపాక పంచాయతీలోని గాంధీనగర్, భాస్కర్ నగర్ లలో రూ. 85 లక్షలతో నూతనంగా నిర్మించిన 17 సీసీ రోడ్లను ఆయన స్థానిక సర్పంచ్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంతర్గత రహదారులను సీసీ రోడ్లుగా మార్చుతూ అభివృద్ధి చేస్తున్నామన్నారు. గ్రామాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. అనంతరం నూతనంగా నిర్మించిన భూక్యా అరుణ, తేజావత్ జానకి లబ్దిదారుల ఇందిరమ్మ ఇళ్లకు ఆయన గృహప్రవేశం చేశారు. అదేవిధంగా ఇటీవల అనారోగ్యానికి గురైన మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి నివాసానికి పాయం వెళ్లి పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జమలారెడ్డి, తహశీల్దార్ కేఆర్కే ప్రసాద్, పీఆర్ డీఈ పొదెం వెంకటేశ్వరరావు, ఏఈ చక్రధరా చారి, సర్పంచ్లు మందా నాగరాజు, కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ జిల్లా కన్వీనర్ భజన సతీష్ కుమార్, నాయకులు కైపు శ్రీనివాసరెడ్డి, భజన ప్రసాద్, మహిమూదఖాన్, మారం వెంకటేశ్వరరెడ్డి, వారాల వేణు, చంటి, బాలి శ్రీహరి, చల్లా వెంకటనారాయణ, పూలపెల్లి సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువత నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

- రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి




**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మే 19 (జనంసాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా,రాష్ట్రవ్యాప్తంగా 06.03.2026 నుండి 12.06.2026 వరకు పది (10) ముఖ్య అంశాలపై కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి. అందులో భాగంగా"యూత్ అండ్ స్పోర్ట్స్"థీమ్‌ను ఈ నెల 18 నుండి 23 వరకు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఈనెల 19న "కెరీర్ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్ డే,ఎంపవర్ స్కిల్స్, ఎంపవర్ ఫ్యూచర్"కార్యక్రమాన్ని రంగారెడ్డి జిల్లా కొంగరకలాన్‌లోని ఇంటిగ్రేటెడ్ డిస్ట్రిక్ట్ కార్యాలయంలో నిర్వహించారు.స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు,స్పోర్ట్స్ యూనివర్సిటీ మరియు స్కిల్ యూనివర్సిటీ కోర్సుల,పై జిల్లా స్థాయిలో వర్చువల్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు మరియు ఉన్నత విద్యా అవకాశాలపై అవగాహన కల్పిస్తూ పలు అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి,జిల్లా అధికారులు స్వర్ణలత,అధికారులు హాజరై మాట్లాడారు.యువత తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకొని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి మరియు ఉద్యోగ అవకాశాలను పొందాలని యువతకు సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా యువజన సేవలు మరియు క్రీడల అధికారి రంగారెడ్డి, కోచ్‌లు,సిబ్బంది,యువత పాల్గొన్నారు.

## ఏదులాపురం మున్సిపాలిటీ ఇంటిగ్రేటెడ్ భవన సముదాయాన్ని త్వరితగతిన పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ శ్రీజ



**ఖమ్మం రూరల్, మే 19 (జనం సాక్షి) :** ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని తరుణిహట్లో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ భవన సముదాయ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. ఏదులాపురం మున్సిపాలిటీ తరుణిహట్ వద్ద చేపట్టిన ఇంటిగ్రేటెడ్ భవన నిర్మాణ పనులు ఆమె మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనులను వేగవంతం చేయడం, నాణ్యత ప్రమాణాలు పాటించడం పై ఆమె ఇప్పటికే అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. భవన నిర్మాణ పనుల పురోగతిని, నిర్మాణ ప్రమాణాలను, అందుబాటులో ఉన్న వసతులను ఆమె క్షేత్రస్థాయిలో సమీక్షించారు.ఈ భవన నిర్మాణం సుమారు రూ. 22కోట్లతో నిర్మించబడుతుందని, దీన్ని సకాలంలో నిర్మించేలా సంబంధిత అధికారులు కృషి చేయాలన్నారు. ఈ సముదాయంలో మొత్తం 17 రకాల కార్యాలయాలు నిర్మించబడుతున్నాయన్నారు. ఇది పూర్తయితే ప్రజలకు అన్ని రకాల సేవలు ఒకేచోట లభ్యమవుతాయని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో ఈఎంసీ చైర్ పర్సన్ పీ. అనిత, ఆర్అండ్బీ డీఈ భగవాన్, కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ విజయేంద్ర రెడ్డి, ఎంపీడీవో రవికుమార్, ఎంఈవో మూడ్ శ్రీనివాస్, ఆర్ అండ్ బీ ఏఈ కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల ఆకస్మిక తనిఖీ

- ధాన్యం కొనుగోళ్లపై రెవెన్యూ,వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం
- ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి
- తేమశాతం పేరుతో ధాన్యం కోత విధిస్తే మిలర్ల పై చర్యలు
- జిల్లా కలెక్టర్ బడుగు చంద్ర శేఖర్



**పి.ఏ.పల్లి, మే 19 (జనం సాక్షి) :** నల్లగొండ జిల్లా పి.ఏ.పల్లి మండలం అంగడిపేట స్టేజీ వద్ద ఉన్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం నాడు జిల్లా కలెక్టర్ బడుగు చంద్రశేఖర్ రెవెన్యూ మరియు వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి స్థానిక నాయకులు,వ్యవసాయ మరియు రెవెన్యూ శాఖ అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ త్వరగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు.కాంటా వేసిన ధాన్యాన్ని లారీల ద్వారా మిల్లులకు త్వరగా తరలించాలని ఆయన అన్నారు.తేమశాతం పేరుతో రైతుల ధాన్యంపై కోత విధిస్తే మిల్లర్లపై చర్యలు తీసుకుంటామని ఆయన వారిని హెచ్చరించారు.లారీలు,హమాలీల కొరత లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తుండాలని ఆయన వారికి సూచించారు.కొనుగోలు కేంద్రాల యందు రైతులకు ఇబ్బందులు లేకుండా కనీస సౌకర్యాలు కల్పించాలని ఆయన అన్నారు.ఆయన వెంట అంగడిపేట సర్పంచ్ రమావత్ చిరంజీవి,తహసిల్దార్ జయశ్రీ, వ్యవసాయ శాఖ అధికారి రావుల పాండు, గుడిపల్లి ఎస్సై నరసింహులు గౌడ్,ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం సీఈవో మద్దిమడుగు ప్రభాకర్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరబోయిన ఎల్లయ్య యాదవ్,మాజీ ఎంపీపీ తేర సత్యనారాయణ రెడ్డి,పోతెం సహదేవుడు,కంభంపాటి మహేష్,రెవెన్యూ శాఖ సిబ్బంది,తదితరులు ఉన్నారు.

# ప్రజల వద్దకే పోలీసు సేవలు

- అక్రమ రవాణా పై పటిష్ట నిఘా పాత నేరస్తులు రౌడీషీటర్స్‌కు కౌన్సిలింగ్
- జిల్లా ఎస్పీ నరసింహ



**నూతనకల్, మే 19 (జనంసాక్షి) :** నూతనకల్ పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీ సందర్భంగా జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ సందర్శించారు జిల్లాలో పోలీస్ స్టేషన్ల వార్షిక తనిఖీలలో భాగంగా మంగళవారం జిల్లా ఎస్పీ నరసింహ ఐపిఎస్ నూతనకల్ పోలీస్ స్టేషన్ తనిఖీ చేశారు ముందుగా పోలీసు స్టేషన్ సిబ్బంది ఎస్పీకి గౌరవ వందనంతో స్వాగతం తెలిపినారు పోలీస్ స్టేషన్ ప్రాంగణం పరిసరాలు పరిశీలించి సిబ్బంది యూనిఫామ్ క్రమశిక్షణ పోలీస్ పరికరాలను పరిశీలించారు సమస్యలు అడిగి తెలుసుకున్నారు ఎలాంటి సమస్య ఉన్న అధికారుల ద్వారా పరిష్కరించుకావాలని సూచించారు సిబ్బంది సంక్షేమానికి ఎల్లప్పుడు కృషి చేస్తామని తెలిపారు స్టేషన్ అవరణంలో సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు.
పోలీస్ స్టేషన్ రిసెప్షన్ సెంటర్ నందు రికార్డుల నిర్వహణ ఆన్లైన్ ఫిర్యాదుల నిర్వహణను పరిశీలించారు ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తిస్తూ వారి సమస్యలు విని వారికి భరోసా కల్పించాలని ధైర్యం కల్పించాలని సూచించారు ప్రాథమిక విచారణ త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు ఫిర్యాదులపై వెంటనే కేసులు నమోదు చేసి ప్రజలకు నమ్మకం కలిగించాలని తెలిపారు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల వద్దకే వెళ్లి పోలీస్ సేవలను అందించాలని సూచించారు పోలీస్ స్టేషన్ నందు నిర్వహిస్తున్న రికార్డ్స్ ను తనిఖీ చేసినారు కేసులు పెండింగ్ ఉండకుండా ఎప్పటికప్పుడు దర్యాప్తు పూర్తి చేయాలని ఆదేశించారు మండల పరిధిలో తరచుగా నేరాలకు పాల్పడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై పటిష్టంగా ఉంచి బైండోవర్ చేయడం షీట్స్ నమోదు చేయడం లాంటి చర్యలు తీసుకోవాలని సూచించారు సీసీటీవీ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ను పరిశీలించి మండల పరిధిలో ఎక్కువ సీసీ కెమెరాలు పెట్టడానికి గ్రామస్తులను చైతన్య పరచాలని తెలిపారు సమస్యలపై ఫిర్యాదులు అందుకున్న వెంటనే బాధితుల ఇంటికి వెళ్లి అక్కడినుండే కేసులు నమోదు చేయాలని తెలిపారు.

### పాత నేరస్తులకు రౌడీషీటర్స్‌కు కౌన్సిలింగ్


మండల పరిధిలో నమోదైన రౌడీషీట్స్ పాత నేరస్తులకు పోలీస్ స్టేషన్ నందు కౌన్సిలింగ్ నిర్వహించారు సత్ప్రవర్తనతో మెలగకపోతే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని పిడి యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపుతామని బైండోవర్ చేస్తామని హెచ్చరించారు పాత నేరస్తులపై రౌడీ షీట్స్ సస్పెక్ట్ షీట్స్ పై ప్రత్యేకంగా ఉంచామని ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన భౌతిక దాడులకు పాల్పడిన అలాంటి వారిని ఉపేక్షించమని తెలిపారు ఈ కార్యక్రమంలో డిఎస్పి ప్రసన్నకుమార్, నాగారం సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగేశ్వరరావు, డిసిఆర్బి ఇన్స్పెక్టర్ మగ్దుం అలీ, ఎస్సై నాగరాజు, స్టోర్ ఆర్ఎస్ఐ అశోక్, డిసిఆర్బి సిబ్బంది అంజన్ రెడ్డి, శేఖర్ రెడ్డి, ఐటి కోర్ కానిస్టేబుల్ సుమన్, పోలీస్ స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

## రైతులు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం



**జమ్మికుంట, మే 19 (జనం సాక్షి) :** కాంగ్రెస్ అంటే రైతు ప్రభుత్వమని, రైతులకు ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు.మంగళవారం రోజున జమ్మికుంట పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ లో మక్కల కొనుగోలు కేంద్రాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలసి సందర్శించారు.రైతులను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు.అనంతరం మీడియాతో మాట్లాడుతూ రైతులు పండించిన చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని,5 మండలాలు కలిపి జమ్మికుంటలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని,రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నామని తెలిపారు.ఇప్పటివరకు మార్క్‌ఫెడ్ ద్వారా సుమారు 72,500ల బస్తాలు,36,250 క్వింటాళ్ల మక్కలు కొనుగోలు చేశామని,సోమవారం ఒక్కరోజే 10 వేల బస్తాల మక్కలు కొనుగోలు చేశామని తెలిపారు.రానున్న రెండు, మూడు రోజుల్లో ఇక్కడున్న ముక్కలు పూర్తిగా కొనుగోలు చేసి,గోడౌన్స్‌కి తరలించిన తరువాత మరల మార్కెట్ లో కొనుగోలు సజావుగా అయ్యేట్టు చూస్తామని తెలిపారు.



# ఏఐతో ఉద్యోగ సంక్షోభం..

### ఆంథ్రోపిక్ సీఈఓ వ్యాఖ్యలు

**వాషింగ్టన్:** అమెరికాకు చెందిన ఏఐ కంపెనీ ఆంథ్రోపిక్ సీఈవో డారియో అమోడెయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విస్తరణ వల్ల భవిష్యత్‌లో తీవ్ర ఉద్యోగ సంక్షోభం పొంచి ఉందని హెచ్చరించారు. ముఖ్యంగా అన్ని రంగాల్లో ఎంట్రీ లెవల్ వైట్‌కాలర్ ఉద్యోగాలను ఏఐ భర్తీ చేయబోతోందని పేర్కొన్నారు. ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈమేరకు ఆయన మాట్లాడారు. రెండేళ్ల క్రితం ఒక తెలివైన హైస్కూల్ పిల్లాడి స్థాయిలో ఉన్న ఏఐ సాంకేతికత.. ఇప్పుడు ఒక తెలివైన కాలేజీ స్టూడెంట్, అంతకుమించి వేగంగా దూసుకెళుతోందని డారియో అభిప్రాయపడ్డారు.



డాక్యుమెంట్లను సమరైజ్ చేయడం, కొత్త ఐడియాలతో ముందుకురావడం, ఫైనాన్షియల్ రిపోర్టులు తయారుచేయడం వంటి పనులను ఏఐ సులువుగా చేసేస్తోందని పేర్కొన్నారు. దీనివల్ల ముఖ్యంగా ఫైనాన్స్, కన్సల్టింగ్, టెక్నాలజీ వంటి రంగాల్లో ఎంట్రీ లెవల్ ఉద్యోగాలు తీవ్ర ప్రభావితం అవుతాయని తెలిపారు. రాబోయే ఒకటి నుంచి ఐదేళ్ల లోపే ఏఐ ప్రభావం మార్కెట్‌లో స్పష్టంగా కనిపించవచ్చని డారియో అంచనా వేశారు. దీనివల్ల తీవ్రమైన ఉద్యోగ సంక్షోభం చవిచూడబోతున్నామని ఆందోళన వ్యక్తంచేశారు. చాలామంది ఏఐ సంస్థల సీఈవోలు, ఇతర కంపెనీల అధినేతలు ఈ విషయంపై వ్యక్తిగతంగా ఆందోళన చెందుతున్నారని చెప్పారు. సాధారణ ప్రజలకు, ప్రభుత్వాలకు ఈ సమస్య తీవ్రత ఇంకా పూర్తిగా అర్థం కావడం లేదన్నారు. ఉద్యోగాలకు ముప్పు పొంచిఉందన్న ఆందోళనలు ఉన్నప్పుడు.. ఏఐ అభివృద్ధిని ఆపొచ్చన్న సందేహాలు చాలామందికి తలెత్తొచ్చు. దానిపైనా డారియో వివరణ ఇచ్చారు. అమెరికా, చైనా కంపెనీల మధ్య ప్రస్తుతం తీవ్రమైన పోటీ నెలకొందని, ఈ కారణంగానే ఏఐ అభివృద్ధిని ఇప్పుడు ఆపడం సాధ్యం కాదని డారియో స్పష్టంచేశారు. ఒకవేళ అమెరికన్ కంపెనీలు ఏఐ అభివృద్ధిని ఆపితే.. చైనా మమ్మల్ని అధిగమిస్తుందన్నారు. ఉద్యోగ ముప్పు నుంచి బయటపడాలంటే ఏఐ టూల్స్ ఉపయోగించడంలో నైపుణ్యాలను పెంచుకోవాలని ఉద్యోగులకు సూచించారు. ఆర్థిక అసమానతలను తగ్గించడానికి, కార్మికులను ఆదుకోవడానికి భవిష్యత్‌లో ఏఐ కంపెనీలపై ప్రభుత్వాలు ప్రత్యేక పన్నులు విధించినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని డారియో అభిప్రాయపడ్డారు.

# ఆరంభ లాభాలు ఆవిరి

### మరింత పతనమైన రూపాయి



**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. ఉదయం లాభాల్లో ట్రేడైన సూచీలు.. మధ్యాహ్నం తర్వాత అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. ముఖ్యంగా బ్యాంక్, ఫైనాన్షియల్, మెటల్ స్టాక్స్‌లో అమ్మకాలు సూచీలపై ఒత్తిడి పెంచాయి. మరోవైపు, రూపాయి విలువ పతనం కొనసాగుతోంది. ఇంట్రాడేలో 96.61 వద్ద ఆల్‌టైమ్ కనిష్ఠాన్ని తాకిన రూపాయి విలువ.. మార్కెట్ ముగిసే సమయానికి 96.52కు చేరింది. సెన్సెక్స్ ఉదయం 75,441.27 (క్రితం ముగింపు 75,315.04) వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 75,746.27 వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. మధ్యాహ్నం తర్వాత నష్టాల్లోకి జారుకుంది. చివరికి 114.19 పాయింట్ల నష్టంతో 75,200.85 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 31.95 పాయింట్ల నష్టంతో 23,618 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో కోటక్ మహీంద్రా బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, టైటాన్, భారతీ ఎయిర్‌టెల్, సన్‌ఫార్మా షేర్లు నష్టాల్లో ముగిశాయి. ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్రా, ఎటర్నల్, టీసీఎస్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 110 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4540 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## 10% ఉద్యోగులకు లేఆఫ్‌లు..

### 7వేల మందికి ఏఐ రోల్స్: మెటా

కృత్రిమ మేధపై దృష్టిపెడుతోన్న టెక్ దిగ్గజాలు ఈ ఏడాది కూడా ఉద్యోగుల తొలగింపులు కొనసాగిస్తున్నాయి. ఫేస్‌బుక్ మాతృ సంస్థ మెటా (ఓవబిజీ) కూడా భారీ లేఆఫ్‌లను ప్రకటించింది. ఆ ప్రణాళికలకు సంబంధించిన వివరాలను తాజాగా ఉద్యోగులకు వెల్లడించింది. కంపెనీలో 10శాతం మందిపై వేటు వేసింది. మే 20 నుంచి ఈ లేఆఫ్‌లు ప్రారంభం కానున్నట్లు తెలిపింది. అదే సమయంలో 7000 మంది ఉద్యోగులను ఏఐ విధుల్లోకి మార్చనున్నట్లు పేర్కొంది. ఈ మేరకు మెటా హెచ్‌ఆర్ చీఫ్ జానెల్లె గేల్ ఉద్యోగులకు ఇంటర్నల్ మెమో పంపారు. "ఏఐ విధివిధానాలకు అనుగుణంగా చాలా సంస్థలు పునర్‌వ్యవస్థీకరణ చర్యలు చేపట్టాయి. మనం కూడా ఆ మార్పులను అమలుచేయాల్సిన దశలో ఉన్నాం. ఇందులో భాగంగానే 10శాతం ఉద్యోగులకు లేఆఫ్‌లు విధించాలని నిర్ణయించాం. మేనేజర్ స్థాయి విధుల్లో ఉన్నవారిని పూర్తిగా పక్కనబెడతాం. ఇక, దాదాపు 7వేల మంది ఉద్యోగులను ఏఐ సంబంధిత కొత్త ప్రాజెక్టుల్లోకి మార్చనున్నాం. ఇప్పటికే కొంతమంది ట్రాన్స్‌ఫర్లు పూర్తయ్యాయి. మిగిలిన వారికి మే 20 నుంచి అప్‌డేట్లు వస్తాయి. ఇక, ఈ పునర్‌వ్యవస్థీకరణ ప్రణాళికల్లో భాగంగా 6వేల కొత్త రోల్స్‌ను తీసుకురానున్నాం" అని గేల్ తన మెమోలో వెల్లడించారు. మార్చి చివరికి ప్రపంచవ్యాప్తంగా మెటాకు దాదాపు 78 వేల మంది ఉద్యోగులున్నారు. ఇందులో 10శాతం అంటే.. దాదాపు 8 వేల మందిని కంపెనీ ఉద్యోగం నుంచి తొలగించనుంది. తాజా ప్రకటన ప్రకారం చూసుకుంటే.. ఈ లేఆఫ్‌లు, ట్రాన్స్‌ఫర్లు కలిపి సంస్థలోని మొత్తం 20శాతం సిబ్బందిపై ప్రభావం పడనుంది.

# ఎయిర్‌టెల్ 'ప్రయారిటీ పోస్ట్‌పెయిడ్'

### రూ.449 నుంచి మొదలు

**న్యూఢిల్లీ:** ప్రముఖ టెలికాం సర్వీస్ ప్రొవైడర్ ఎయిర్‌టెల్ పోస్ట్‌పె యిడ్ యూజర్ల కోసం కొత్త సర్వీసులను ప్రారంభిం చింది. 'ప్రయారిటీ పోస్ట్ పెయిడ్' పేరుతో కొత్త తరహా సేవలను అందుబాటులోకి తెచ్చింది. దీని కింద అంతరాయం లేని, నమ్మకమైన కనెక్టివిటీ లభిస్తుందని ఎయిర్‌టెల్ ఓ ప్రకటనలో పేర్కొంది. 5జీ నెట్‌వర్క్ స్లైసింగ్‌లో భాగంగా ఎయిర్‌టెల్ ఈ సేవలను లాంచ్ చేసింది. ఈ విధమైన సేవలను ప్రారంభించిన తొలి కంపెనీగా నిలిచింది. అన్ని పోస్ట్‌పెయిడ్ ప్లాన్లకు ఎయిర్‌టెల్ ప్రయారిటీ సేవలు లభిస్తాయని ఎయిర్‌టెల్ తెలిపింది. ఇప్పటికే పోస్ట్‌పెయిడ్ వినియోగిస్తున్న యూజర్లకు ఆటోమేటిక్‌గా ఈ సేవలు లభిస్తాయని పేర్కొంది. ప్రీపెయిడ్ కస్టమర్లు లేదా ఇతర నెట్‌వర్క్ కస్టమర్లు ఎయిర్‌టెల్ ప్రయారిటీ పోస్ట్‌పెయిడ్ సేవలు పొందాలంటే ఎయిర్‌టెల్ థ్యాంక్స్ యాప్ లేదా




ఎయిర్‌టెల్ స్టోర్‌లను సందర్శించాలని సూచించింది. అప్‌డేట్ చేసిన 5జీ స్మార్ట్‌ఫోన్ కస్టమర్లకు ఈ సేవలు లభిస్తాయని ఎయిర్‌టెల్ తెలిపింది. అప్‌గ్రేడ్స్ ఏవైనా పెండింగ్ ఉంటే ఎయిర్‌టెల్ థ్యాంక్స్ యాప్‌లో సెట్టింగ్స్ విభాగంలో చెక్ చేసుకోవచ్చని యూజర్లకు సూచించింది.

**రూ.449 నుంచి మొదలు**

రూ.449 ప్లాన్‌ల నుంచి మొదలయ్యే పోస్ట్‌పెయిడ్ ప్లాన్లకు ఈ ప్రయారిటీ పోస్ట్‌పెయిడ్ 5జీ సేవలు లభిస్తాయి. ఆయా ప్లాన్లలో అపరిమిత కాల్స్, డేటాతో పాటు 3000 ఎస్సెమ్మెస్‌లు, ఫ్రాడ్ డిటెక్షన్, స్పామ్ అలర్ట్‌లు లభిస్తాయి. దీంతో పాటు ఎయిర్‌టెల్ ఫాస్ట్‌లేన్ టెక్నాలజీ ద్వారా ప్రయారిటీ సేవలు అందుతాయి. అంటే 5ఉ నెట్‌వర్క్ స్లైసింగ్‌ను ఉపయోగించి నెట్‌వర్క్ ట్రాఫిక్‌ను నిర్దిష్ట లేన్‌లుగా విభజిస్తారు. దీనివల్ల పోస్ట్‌పెయిడ్ వినియోగదారులకు ప్రత్యేకమైన, ప్రాధాన్యం కలిగిన బ్యాండ్‌విడ్త్ లభిస్తుంది. దీంతో నెట్‌వర్క్ రద్దీగా ఉన్న సమయాల్లోనూ టెలికాం సేవలు స్థిరంగా కొనసాగుతాయి. రద్దీ ప్రాంతాల్లో అదే నెట్‌వర్క్ వాడుతున్నవారు అంతరాయాలు ఎదుర్కొంటే.. ప్రయారిటీ ప్లాన్ యూజర్లకు ఇలాంటి అవాంతరాలు ఎదురుకావన్నమాట.

## పిల్లలకూ యూపీఐ

హైదరాబాద్: డిజిటల్ చెల్లింపుల సంస్థ పేటీఎం, టీనేజర్లు, పిల్లల కోసం ప్రత్యేకంగా పాకెట్ మనీ సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. పిల్లలు తమకంటూ సొంత బ్యాంకు ఖాతా లేకుండానే, పేటీఎం యూపీఐ ద్వారా చెల్లింపులు జరిపేందుకు ఇది ఉపకరిస్తుంది. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) 'యూపీఐ సర్కిల్' ఆధారంగా తల్లిదండ్రులు లేదా కుటుంబ సభ్యులు తమ పిల్లలను ఇందులోకి ఆహ్వానించొచ్చు. ఈ ఫీచర్‌తో స్కూల్/కాలేజీ క్యాంటీన్లు, మెట్రో, క్యాబ్‌లు, మొబైల్ రీఛార్జ్, చిన్నపాటి కొనుగోళ్ల వంటి రోజువారీ అవసరాలకు పిల్లలు తమ సొంత ఫోన్ల ద్వారా చెల్లింపులు చేయగలరు. ఇందుకోసం ప్రతిసారీ తల్లిదండ్రుల ఫోన్ అడగాల్సిన పనిలేదు. ఓటీపీతో కూడా సంబంధం లేకుండా, సొంతంగా లావాదేవీ పూర్తి చేయొచ్చు. పేటీఎం యూపీఐ పిన్ ద్వారా పిల్లల ఖర్చుల పరిమితి మార్చొచ్చు.

## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.25 | ₹ 5.27 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**

హైదరాబాద్

| ₹ 1,48,800 | ₹ 1,62,330 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |


**వెండి ధరలు (కేజీ)**

హైదరాబాద్

₹ 3,15,000

# యుద్ధంలో సామాన్యుడు సైతం

### తమ దేశ పౌరులకు తుపాకుల వాడకంపై శిక్షణ ఇస్తున్న ఇరాన్



**టెహ్రాన్:** ఎటూ తేలని యుద్ధం... తేలినా ఏమౌతుందో తెలీని పరిస్థితుల్లో ఇరాన్ ఆత్మసంరక్షణకు సరికొత్త ప్రణాళికలు రచిస్తోంది. తనపై అమెరికా-ఇజ్రాయెల్ దాడులు మునుముందు మరింత ముమ్మరం కావొచ్చన్న అంచనాలతో వీధి పోరాటాలకూ సిద్ధమవుతోంది. తుపాకుల వాడకంపై పౌరులకు శిక్షణ ఇస్తోంది. ఇందు కోసం 'పబ్లిక్ గన్ కియోస్క్'లనూ ఏర్పాటు చేసింది. ఒకవేళ అమెరికా భూతల పోరుకు దిగితే.. అగ్రరాజ్య బలగాలతో వీధుల్లో ముఖాముఖి తలపడటానికి పౌరులనూ రంగంలోకి దించాలన్నది ఇరాన్ ఆలోచన! ఇరాన్ అధికారిక టీవీ ఛానల్‌లో వార్తా బులెటిన్ల ప్రసారంతో పాటు తుపాకుల నుంచి బులెట్లను ప్రయోగించే విధానాలపైనా శిక్షణ కార్యక్రమాలు సాగుతున్నాయి. ఒఫోగ్ ఛానల్‌కు సంబంధించిన ఓ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. అందులో హుస్సేన్ హుస్సేనీ అనే యాంకర్.. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జీసీ) సభ్యుడొకరి నుంచి శిక్షణ పొందిన అనంతరం స్టూడియో పైకప్పులోకి రైఫిల్‌ను పేల్చారు. మరో క్లిప్‌లో 'ఛానల్ 3' ప్రెజెంటర్.. తుపాకీ చేతబట్టి ప్రేక్షకులను ఉద్దేశించి మాట్లాడారు. "నాకు ఒక ఆయుధాన్ని పంపారు. ప్రజలందరిలా నేను కూడా దీన్ని ఉపయోగించే విధానాలను నేర్చుకుంటున్నా. నా దేశం కోసం ప్రాణత్యాగానికీ నేను సిద్ధం" అని చెప్పారు.

**వీధుల్లో శిక్షణ కేంద్రాలు**

ప్రధాన నగరాల్లో కూడళ్లలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో తేలికపాటి ఆయుధాలపై పౌరులకు ఇరాన్ ప్రభుత్వం ముమ్మరంగా శిక్షణ ఇస్తోంది. మసీదులు కూడా ఇందుకు వేదికవుతున్నాయి. తుపాకీని భాగాలుగా విడగొట్టడం, తిరిగి బిగించడం, ఆయుధాన్ని గురిపెట్టడం, లోడ్ చేయడం, శుభ్రం చేయడం వంటివి ప్రజలు నేర్చుకుంటున్నారు. ప్రధానంగా ఏకే-47, పులెయత్ కలష్నికోవా శ్రేణి తుపాకులపై శిక్షణ ఇస్తున్నారు. 'ఇరాన్ కోసం ప్రాణత్యాగం చేయండి' అనే ప్రచారాన్ని ఇరాన్ ప్రభుత్వం చేస్తోంది. లక్షల మంది వాలంటీర్లు ఇందుకోసం ముందుకొచ్చారని అధికారిక మీడియా చెబుతోంది.

**పింక్ సేన:**

శత్రువుపై పోరులో స్త్రీ-పురుష తారతమ్యాలు లేకుండా దేశమంతా ఏకతాటిపై ఉందని చాటేందుకు ఇరాన్ ప్రయత్నిస్తోంది. సైనిక శక్తిలోకి మహిళలను ఆకర్షించడానికి, తమకు నారీశక్తి మద్దతు ఉందని చెప్పేందుకు 'పింక్' ఉద్యమాన్ని చేపట్టింది. క్షిపణులు, డ్రోన్లు, ఆయుధాలకు గులాబీ రంగు వేస్తూ.. యువత, మహిళా భాగస్వామ్యాన్ని పెంచేందుకు ప్రయత్నిస్తోంది. ఇటీవల ఒక బాలిక కోరిక మేరకు ఇజ్రాయెల్‌పైకి పింక్ క్షిపణిని ఐఆర్‌జీసీ ప్రయోగించింది.

# తక్కువ ప్రీమియంతో రూ.2 లక్షల బీమా..

### ఈ ప్రభుత్వ పథకాల్లో చేరారా?



అనుకోని పరిస్థితుల్లో కుటుంబ సభ్యులకు ఆర్థికంగా అండగా నిలవడం బీమా ముఖ్య ఉద్దేశం. అలా అందరికీ అందుబాటు ధరలో బీమా సౌకర్యం కల్పించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం రెండు పథకాలను తీసుకొచ్చింది. అవే ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన ఇందులో మొదటిది జీవిత బీమా కాగా.. సురక్ష బీమా యోజన ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తుంది. ఇటీవలే ఈ రెండు పథకాలు 11 ఏళ్లు విజయవంతంగా పూర్తి చేసుకున్నాయి. ఇప్పటికే ఈ పథకా ల్లో చేరిన వారికి త్వరలో రెన్యువల్ కానున్నట్లు మొబైల్‌కు సందే శాలు వస్తున్నాయి. ఆటో డెబిట్ సమయంలో తగిన మొత్తం ఖాతాల్లో ఉంచాలి. లేదంటే బీమా ప్రయోజనం కోల్పోతారు. ఒకవేళ కొత్తగా చేరాలనుకుంటే ఎలా? ఈ పథకాల ప్రయో జనాలు ఏంటో చూద్దాం!

**ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన**

18 నుంచి 50 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తులు ఈ స్కీమ్‌లో చేరేందుకు అర్హులు. బ్యాంకు/ పోస్టాఫీసులో పొదుపు ఖాతా ఉన్న వారెవరైనా చేరవచ్చు. ఒకటి కంటే ఎక్కువ పొదుపు ఖాతాలు ఉన్నా.. ఒక పొదుపు ఖాతా ఉన్న బ్యాంకు నుంచి మాత్రమే పథకానికి నమోదు చేసుకోవాలి. పాలసీదారుకు 55 సంవత్సరాల వరకు జీవిత బీమా పొందేందుకు వీలుంటుంది. పథకం కాలపరిమితి ఏడాది. జూన్ 1 నుంచి మే 31 వరకు అమల్లో ఉంటుంది. ఒకసారి ఇందులో చేరిన వారికి మే 25-31 మధ్య ప్రీమియం మొత్తం ఆటో డెబిట్ ద్వారా రెన్యువల్ అవుతుంది. కొత్తగా ఈ పథకంలో చేరే వారికి జూన్ 1 నుంచి మే 31 వరకు కవరేజీ లభిస్తుంది. పాలసీదారుడు మరణిస్తే రూ.2 లక్షల హామీ మొత్తాన్ని నామినీకి అందజేస్తారు. మెచ్యూరిటీ ప్రయోజనాలు ఉండవు. ఒకవేళ డెబిట్ అయ్యే సమయంలో తగినంత బ్యాలెన్స్ ఖాతాలో లేనప్పుడు బీమా పాలసీ రద్దవుతుంది. ప్రీమియం ఎంత?: ఈ పథకాన్ని ప్రారంభించినప్పుడు కేవలం రూ.330తో ప్రీమియంతోనే పాలసీని అందించేవారు. ఇప్పుడు ఆ ప్రీమియంను రూ.436కు పెంచారు. ఆటోడెబిట్ ద్వారా బ్యాంకు/పోస్టాఫీసు ఖాతా నుంచి ఒకే వాయిదాలో ప్రీమియం మొత్తాన్ని చెల్లించాలి. పథకంలో చేరే నెలను అనుసరించి ప్రీమియం మారుతూ ఉంటుంది. జూన్- ఆగస్టు మధ్యలో చేరితే ఆ ఏడాదికి రూ.436, సెప్టెంబరు-నవంబరు మధ్య కాలంలో చేరితే రూ.342, డిసెంబరు-ఫిబ్రవరి మధ్య చేరితే రూ.228, అదే మార్చి- మే మధ్య అయితే రూ. 114 ప్రీమియం చెల్లించాలి. ఈ పథకంలో జాయిన్ అయ్యేవారు ప్రీమియం మొత్తాన్ని ఏటా ఖాతా నుంచి ఆటోమేటిక్‌గా తీసుకునేందుకు బ్యాంకులను అనుమతిం చాలి.

**ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన**

ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన ప్రీమియం ఏడాదికి కేవలం రూ.20 మాత్రమే. 18 నుంచి 70 సంవత్సరాల మధ్య వయసున్న వారు ఈ పథకంలో చేరొచ్చు. ఏదైనా బ్యాంకు/ పోస్టాఫీసులో పొదుపు ఖాతా ఉండాలి. ప్రతి సంవత్సరం జూన్ 1 నుంచి మే 31 వరకు ఈ బీమా అందుబాటులో ఉంటుంది. మే నెలాఖరులో ఆటో డెబిట్ అవుతుంది. చందాదారుడు ప్రమాదానికి గురై మరణించినా లేదా శాశ్వతంగా వైకల్యానికి గురైనా రూ.2 లక్షలు, పాక్షికంగా వైకల్యానికి గురైతే రూ.లక్ష పరిహారం లభిస్తుంది. చందాదారుడి వయసు 70 ఏళ్లు దాటినప్పుడు ఈ పథకం ఆటోమేటిక్‌గా రద్దు అవుతుంది.

# భారత్‌కు పుతిన్

### ఏడాది వ్యవధిలో రెండోసారి పర్యటన



న్యూఢిల్లీ(జనంసాక్షి): రష్యా అధ్యక్షుడు పుతిన్ ఈ ఏడాది సెప్టెంబరులో భారత పర్యటనకు రానున్నారు. క్రెమ్లిన్ ప్రతినిధి యూరీ ఉషకొవ్ ఈ విషయాన్ని వెల్లడించారు. దిల్లీ వేదికగా సెప్టెంబరు 12-13వ తేదీల్లో జరగనున్న బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పుతిన్ పాల్గొంటారని తెలిపారు. ఏడాది వ్యవధిలో పుతిన్ రెండోసారి భారత్‌లో పర్యటించనున్నారు. భారత్-రష్యా వార్షిక శిఖరాగ్ర సదస్సులో భాగంగా గతేడాది డిసెంబరులో ఆయన మనదేశానికి వచ్చిన సంగతి తెలిసిందే. రెండుదేశాల సంబంధాల బలోపేతంపై ప్రధాని నరేంద్రమోదీతో చర్చలు జరిపారు. 2026 ఏడాదికి బ్రిక్స్ ఛైర్మన్‌గా భారత్ వ్యవహరిస్తోంది. దీనిలో భాగంగా ఇటీవల జరిగిన బ్రిక్స్ విదేశాంగ మంత్రుల సమావేశానికి రష్యా విదేశాంగమంత్రి సెర్గీ లావ్రోవ్ హాజరైన సంగతి తెలిసిందే. ఆ సందర్భంగా మోదీతో భేటీ అయ్యారు. పశ్చిమాసియా ఉద్రిక్తతలు, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం సహా పలు అంశాలపై చర్చలు జరిపారు. మొదట బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనాలతో 'బ్రిక్' ఏర్పడింది. అనంతరం దక్షిణాఫ్రికా చేరడంతో బ్రిక్స్‌గా మారింది. ఇప్పుడు ఇరాన్, ఇథియోపియా, ఈజిప్ట్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఇండోనేసియా కూడా చేరాయి. ఈ పది దేశాలను కలిపి బ్రిక్స్ ప్లస్‌గా వ్యవహరిస్తున్నారు. సౌదీ అరేబియా, అర్జెంటీనాలు ఇంకా లాంఛనంగా బ్రిక్స్‌లో చేరలేదు. బ్రెజిల్‌లోని రియో డి జనీరో నగరంలో గతేడాది బ్రిక్స్ సదస్సు జరిగింది. కాగా.. పుతిన్ ప్రస్తుతం చైనా పర్యటనలో ఉన్నారు.

# అమెరికా-కెనడా రక్షణ బంధానికి బీటలు

### మిత్రుడికి షాకిచ్చిన ట్రంప్..

**న్యూఢిల్లీ:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కెనడాకు షాకిచ్చారు. రెండో ప్రపంచ యుద్ధం నుంచి కొనసాగుతోన్న రక్షణ బోర్డు నుంచి తాము వైదొలుగుతు న్నట్లు ట్రంప్ యంత్రాంగం ప్రకటించింది. ఈసందర్భంగా రక్షణ వాగ్దా నాలపై పురోగతి సాధించడంలో కెనడా విఫలమైందని నిందలు మోపింది. అమెరికా రక్షణశాఖ సహాయ కార్యదర్శి ఎల్‌బ్రిడ్జ్ కోల్బీ ఎక్స్ వేదికగా ఈ విషయాన్ని ప్రకటించారు. 1940లో నాటి అమెరికా అధ్యక్షుడు ఫ్రాంక్లిన్ డి.రూజ్‌వెల్ట్, కెనడా ప్రధాని మెకెంజీ కింగ్ ఈ రక్షణమండలిని స్థాపించారు. దీన్ని 'ఓగ్డెన్స్‌బర్గ్' ఒప్పందం అని కూడా పిలుస్తారు. ఈ రక్షణ మండలి నుంచి తాత్కాలికంగా వైదొలుగుతున్నట్లు ఎల్‌బ్రిడ్జ్ కోల్బీ తాజాగా ప్రకటించారు. 'మాటల కన్నా సైనిక శక్తికి ప్రాధాన్యమిచ్చే బలమైన కెనడా మనందరికీ ప్రయోజనకరం. దురదృష్టవశాత్తూ.. కెనడా తన రక్షణ వాగ్దానాలపై విశ్వసనీయమైన పురోగతిని సాధించడంలో విఫలమైంది. దీంతో శాశ్వత ఉమ్మడి రక్షణ మండలిద్వారా లభించే ప్రయోజనాలను పునఃపరిశీలించాలని నిర్ణయించుకున్నాం. ఈ ఉద్దేశంతోనే మండలి నుంచి తాత్కాలికంగా వైదొలుగుతున్నాం' అని పేర్కొన్నారు. ఉమ్మడి రక్షణ, భద్రత విషయంలో ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలంటూ కెనడాపై విమర్శలు చేశారు. కాగా..



అమెరికా నిర్ణయంపై కెనడా ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. కెనడా, ఇతర నాటో దేశాలు తమ సొంత సైన్యంపై చాలా తక్కువ ఖర్చు చేస్తున్నాయని, రక్షణ భారాన్ని అమెరికానే ఎక్కువగా మోస్తోందని చాలాకాలంగా ట్రంప్ ఆరోపిస్తున్నారు. మరోవైపు అధిక సుంకాలు, ట్రంప్, కెనడా ప్రధాని మార్క్ కార్నీ ల మధ్య ఉన్న వివాదంతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు పెరిగాయి. ఈ క్రమంలో అమెరికా ఇలాంటి ప్రకటన చేయడం గమనార్హం.

## ఆదానీపై అమెరికాలో కేసులు కొట్టివేత

### ఆధారాలు లేవని తేల్చిన న్యాయశాఖ

**న్యూయార్క్(జనంసాక్షి):** అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ, ఆయన మేనల్లుడు సాగర్ అదానీలపై ఉన్న కేసులను అమెరికా న్యాయ శాఖ పూర్తిగా కొట్టివేసింది. యూఎస్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (ఎస్‌ఈసీ) సహా పలు ఏజెన్సీలు ఈ కేసులను కొట్టివేశాయి. ఈ కేసులో ఎలాంటి ఆధారాలు లేవని, లంచాలు ఇచ్చినట్లుగా కూడా రుజువులు లేవని తేల్చింది. భారతదేశంలో ఒక సోలార్ పవర్ అమ్మకాల కాంట్రాక్టును గెలుచుకోవడానికి రూ. 2,000 కోట్లకు పైగా లంచాలు ఇచ్చారని, అలాగే పలు దశల్లో అమెరికన్ పెట్టుబడిదారుల నుంచి డబ్బు వసూలు చేశారని అదానీపై అమెరికాలో కేసులు నమోదయ్యాయి. అమెరికాలో ఇటువంటి ఆరోపణలను పూర్తిగా కొట్టివేయడం ఒక అసాధారణ చర్య అని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఎస్‌ఈసీ దాఖలు చేసిన కేసును పరిష్కరించుకోవడానికి అదానీ 6 మిలియన్ డాలర్లు చెల్లించడానికి అంగీకరించినట్లు కోర్టు పత్రాలు చూపిస్తున్నాయి. సాగర్ అదానీ కూడా 12 మిలియన్ డాలర్లు చెల్లించడానికి అంగీకరించారు. తఎల్‌పీజీ దిగుమతులకు సంబంధించి ఇరాన్‌పై అమెరికా విధించిన ఆంక్షలను అదానీ గ్రూప్ ఉల్లంఘించిందని ఆరోపిస్తూ యూఎస్ ట్రెజరీ డిపార్ట్‌మెంట్ యొక్క ఓఎఫ్ఏసి దాఖలు చేసిన కేసు కూడా పరిష్కరించబడింది. ఈ ఒప్పందం 275 మిలియన్ డాలర్లకు కుదిరింది. అదానీ గ్రీన్ ఎనర్జీ మరియు అమెరికాకు చెందిన అజూర్ కంపెనీ, తమ సౌర విద్యుత్‌ను కొనుగోలు చేయడానికి కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ఎస్‌ఈసీఐ తో ఒక ఒప్పందం కుదుర్చుకున్నాయి. రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు ఎస్‌ఈసీఐ నుంచే విద్యుత్‌ను కొనుగోలు చేసేలా ప్రభావితం చేయడానికి గౌతమ్ అదానీ నేరుగా జోక్యం చేసుకున్నారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియ మరింత వేగవంతం చేయండి

- కొనుగోలు నుంచి మిల్లులకు తరలింపు వరకు..
- అధికారులు యుద్ధ ప్రాతిపదికన ప్రక్రియ పూర్తి చేయాలి : కలెక్టర్ చిత్రా మిశ్రా




**కరీంనగర్ బ్యూరో, మే 19 (జనంసాక్షి) :** కరీంనగర్ జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు సేకరించి, మిల్లులకు వెంటనే తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తరలించిన ధాన్యం మిల్లుల్లో సత్వరమే అన్లోడింగ్ జరగాలని స్పష్టం చేశారు. మంగళవారం రాత్రి కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ధాన్యం కొనుగోళ్ల పురోగతిపై పౌరసరఫరాల అధికారులు, తహసీల్దార్లు, మిల్లర్లు, ట్రాన్స్‌పోర్ట్ ఆపరేటర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి జాప్యం జరగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఇబ్బందులు ఎదుర్కోకుండా చర్యలు తీసుకోవాలని, ధాన్యం నిల్వలు పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు నుంచి మిల్లుల్లో అన్లోడింగ్ వరకు ప్రతి దశలో వేగం పెంచాలని, యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టి ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డిఓకే మహేశ్వర్, జిల్లా పౌరసరఫరాల అధికారి నర్సింగారావు, పౌరసరఫరాల డిఎం రజనీ కాంత్, సహకార అధికారి రామానుజ చార్యులు, డిఆర్డిఓ, గీత జిల్లాస్థాయి అధికారులు, తహసిల్దార్లు మిల్లర్ల సంఘం నాయకులు, ట్రాన్స్పోర్ట్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.



## చిరిగిన నోట్లతో ఏటీఎం మోసాలు

**నందిపేట్ మే 19 జనం సాక్షి:** నందిపేట మండల కేంద్ర సుఖీభవ హాస్పిటల్ పక్కన గల ఇండియ 1 ఏటీఎంలో చిరిగిన, కాలిన 500 రూపాయల నోట్లు రావడంతో బాధితులు గగ్గోలు పెడుతున్నారు. మండల కేంద్రానికి చెందిన షేక్ అయ్యూబ్ తన అమ్మ గారి ఆరోగ్యం కొరకు ఎమర్జెన్సీగా అందుబాటు లో ఉన్న ఇండియా వన్ ఏటీఎంలో మంగళ వారం ఉదయం 7గంటల ప్రాంతంలో 4000 రూపాయలను డ్రా చేయగా మొత్తం చిరిగిన కాలిన సగం తుకుడలతో 500 రూపాయల నోట్లు రావడంతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు. ఇటువంటి పరిస్థితి ఎవరికి చెప్పుకోవాలో తెలియక వెంటనే పోలీస్ స్టేషన్కు వెళ్లి కంప్లైంట్ చేశాడు. వారి సలహా మేరకు బ్యాంకులో అడగగా బ్యాంకు మేనేజర్ కు కూడా కంప్లైంట్ చేయడం జరిగిందని వాపోయాడు. నిన్న కూడా ఇదే ఏటీఎంలో 4,500 చిరిగిన నోట్లు వచ్చాయని, వారికి ఏం చేయాలో తెలియక ఆ చిరిగిన నోట్లోనే తీసుకొని వెళ్లారని ఏటీఎం పక్కనే గల జ్యూస్ అమ్మే వ్యక్తి తెలిపారు. ఏటీఎంలో డబ్బులు మార్చే ఏజెన్సీలు ఇలాంటి మోసాలు చేసే అవకాశం ఉందని వెంటనే సంబంధిత అధికారులు, పోలీసులు డబ్బులు మార్చే వ్యక్తులు ఎవరో గుర్తుపట్టి వారిపై కఠిన చర్య తీసుకొని,ఏజెన్సీలపైన కూడా రేటు పడేటట్టు చూడాలని, చాలా అత్యవసర పరిస్థితు లలో ప్రజలకు బ్యాంకులు అందుబాటులో ఉండవు కాబట్టి ఇటువంటి ప్రైవేటు ఏటీఎంలు చాలా ఉపయోగపడతాయి కానీ ఇలాంటి ఘరానా మోసగాళ్ల ద్వారా బాధితులు తీవ్రంగా నష్టపోతున్నారు. వెంటనే బాధ్యులను పట్టుకొని ఏజెన్సీల పై కూడా కేసులు నమోదు చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

# సదాశివపల్లి గ్రామంలో క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపు

జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటరమణ.




**కరీంనగర్ అర్బన్, మే 19 (జనంసాక్షి) :** మంగళవారం రోజు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటరమణ, పీవో డీటిటీ డాక్టర్ ఉమాశ్రీ లతో కలిసి కరీంనగర్ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హౌసింగ్ బోర్డ్ పరిధిలోని సదాశివపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపును సందర్శించారు. ఈ సందర్భంగా క్యాంపులో నిర్వహిస్తున్న వైద్య పరీక్షలు, ప్రజలకు అందిస్తున్న ఆరోగ్య సేవలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ... గ్రామ ప్రజలకు క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించేం దుకు స్క్రీనింగ్ పరీక్షలు ఎంతో అవసరమని తెలిపారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉచిత ఆరోగ్య పరీక్షలను ప్రజలు సద్వినియోగం చేసుకొని ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ మెడికల్ క్యాంపులో పాల్గొన్న ప్రజలకు క్యాన్సర్ వ్యాధి లక్షణాలు కలిగిన వారు - 2, బిపి - 27, షుగర్ వ్యాధి లక్షణాలు కలిగిన వారు -14 మందిని గుర్తించినారు. నివారణ చర్యలు, సమయానికి పరీక్షలు చేయించుకోవడం వల్ల కలిగే ప్రయోజనాల పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం లో 14 సంవత్సరములు నిండిన బాలికలకు హెచ్.పి.వి వ్యాక్సిన్ వేయించడం జరిగినది. ఈ కార్యక్రమం లో పీవో ఎన్‌సీడీ డాక్టర్ విప్లవ శ్రీ, అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ రాజ్‌కుమార్, ఎన్సిడి కోఆర్డినేటర్ పోచయ్య, జీవన్ రెడ్డి హెచ్ఈఓ, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## లెదర్ పార్క్ స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే



**ఆర్మూర్,మే 19 (జనంసాక్షి):** ఆర్మూర్ పట్టణంలోని లెదర్ పార్క్ స్థలాన్ని ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు.లెదర్ పార్క్ స్థలంలో నివాసం ఉంటున్న వారికి శాశ్వతంగా ఎక్కడైనా ప్రభుత్వ స్థలంలో నివాసం ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ అబిజ్ఞాన్ మాల్వియాకు, ఎమ్మార్వో సత్యనారా యణకి తెలిపారు. సుందరయ్య కాలనీలో నివాసం ఉంటున్న వారికి శాశ్వత పరిష్కారం చూపాలని, వాటికి సంబంధించిన విధి విధానాలు అధికారులు రూపొందించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని ఆయన సూచించారు.కొన్ని రాజకీయ పార్టీలు వారి అవసరాల కోసం కాలనీ వాసులను వాడుకోవడం సమంజసం కాదని ఎమ్మెల్యే హితవు పలికారు.ఎమ్మెల్యే వెంట కౌన్సిలర్లు శ్రావణ్,పాన్ శీను,బొట్టు రాజు,యామాద్రి భాస్కర్, మామిడిపల్లి శ్రీనివాస్,కలిగొట గంగాధర్, పట్టణ అధ్యక్షుడు మందుల బాలు,కిషన్ మోర్చా ఉపాధ్యక్షుడు నూతుల శ్రీనివాస్,జెస్సు అనిల్ తదితరులు ఉన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

రైస్ మిల్లులకు వచ్చిన ధాన్యం లారీలను వెంటనే అన్లోడింగ్ చేయాలి

- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. ఎస్ లత



**మల్లాపూర్, మే 19(జనంసాక్షి) :** మండలం లోని ముత్యం పేట, చిట్టాపూర్, రాఘవపేట గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మరియు రాఘవపేట గ్రామంలోని పూజ ఇండస్ట్రీస్, విష్ణు ఇండస్ట్రీస్ లను మంగళవారం రోజు ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాల లో జరుగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేగంగా కొనుగోలు ప్రక్రియను కొనసాగించాలని అధికారులకు సూచించారు. కేంద్రాలలో హమలీలు తగిన సంఖ్యలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ధాన్యం లోడింగ్ ప్రక్రియను మరింత వేగవంతం చేసి లారీలను ఆలస్యం లేకుండా మిల్లులకు తరలించాలని ఆదేశించారు.

అలాగే ట్రక్ షీట్ నమోదు, ట్యాబ్ ఎంట్రీలు వంటి అన్ని డాక్యుమెంటేషన్ పనులను సమయానికి పూర్తి చేయాలని, ఎలాంటి పెండింగ్ లేకుండా చూడాలని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాలలో పారదర్శకత పాటించడంతో పాటు రైతులకు సరైన సమాచారం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలు సమయంలో తేమ శాతం, నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పరిశీలించాలని, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎటువంటి అవకతవకలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను హెచ్చరించారు. సంబంధిత అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకొని ధాన్యం కొనుగోళ్లు సజావుగా, వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ధాన్యంతో వచ్చిన లారీలు మిల్లుల వద్దా నిలుపకుండా వెనువెంటనే అన్లోడ్ చేసేలా హమాలీల సంఖ్య పెంచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మెట్ పెల్లి ఆర్డీవో నరసింహ రావు, తహసీల్దార్, డీటీ , సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, కేంద్రల నిర్వాహకులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణపై చర్చకు హైదరాబాద్ సరైన వేదిక

- దక్షిణాది రాష్ట్రాల ఆందోళనలు న్యాయబద్ధమైనవే
- జనాభా నియంత్రణలో ముందంజ వేసిన రాష్ట్రాలకు నష్టం జరగకూడదు : ఎస్.వై. ఖురేషి
- ఏకాభిప్రాయంతోనే రాజ్యాంగ సమతుల్యత సాధ్యం
- పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తి ప్రజాస్వామ్యానికి మార్గదర్శకం



**హైదరాబాద్, మే 19 (జనంసాక్షి):** నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ వంటి దేశ సమైక్యతను ప్రభావితం చేసే కీలక అంశంపై చర్చించేందుకు హైదరాబాద్ సరైన వేదిక అని మాజీ భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎస్.వై. ఖురేషి అన్నారు. భారతీయ భావనను హైదరాబాద్ నగరం ఎంత సమగ్రంగా అర్థం చేసుకుందో, మరో నగరం అంత విస్తృత దృష్టితో స్వీకరించలేదని పేర్కొన్నారు. ముషీరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లిలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం నిర్వహిం చిన 'నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ–సమైక్య భారత భవిష్యత్తు' అంశంపై పుచ్చలపల్లి సుందరయ్య 41వ స్మారకోపన్యాసంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

కార్యక్రమం ప్రారంభంలో ఎస్‌వీకే ట్రస్ట్ అధ్యక్షుడు బీవీ రాఘవులు, మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్. వినయ్‌కుమార్‌తో కలిసి కామ్రేడ్ పుచ్చల పల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఫరీద్ ఖాన్ రచించిన హిందీ మూలగ్రంథం 'నా సొంత గడ్డపైనే నేనొక పరాయి వాణ్ణి' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఖురేషి మాట్లాడుతూ, దక్షిణాది రాష్ట్రాలు వ్యక్తం చేస్తున్న ఆందోళనలు న్యాయబద్ధమై నవని, రాజ్యాంగబద్ధమైనవని స్పష్టం చేశారు. తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు జనాభా నియంత్రణలో కేంద్రం నిర్దేశించిన లక్ష్యాలను ముందుగానే సాధించాయని గుర్తుచేశారు. సంతానో త్పత్తి రేటు తగ్గడం, మహిళా అక్షరాస్యత పెరగడం, ప్రజా ఆరోగ్య వ్యవస్థ విస్తరించడం వంటి అంశాలు ఈ రాష్ట్రాల పురోగతికి నిదర్శనమని పేర్కొన్నారు.

అయితే ఇదే పరిస్థితి నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ లో కొత్త సవాళ్లకు దారితీస్తోందని అన్నారు. జనాభా ఆధారంగా ప్రాతినిధ్యం నిర్ణయించే ప్రక్రియలో జనాభా నియంత్రణలో ముందంజ వేసిన రాష్ట్రాలు నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సవాళ్లను అధిగమించేందుకు పరస్పర చర్చలు, సంప్రది ంపులు, ఏకాభిప్రాయం తప్పనిసరని సూచించారు.

2027 జనగణన భారతదేశ జనాభాను లెక్కించడం మాత్రమే కాకుండా రాజ్యాంగ నిర్మాతల దూరదృష్టిని కూడా పరీక్షించబోతు ందని ఖురేషి అభిప్రాయపడ్డారు. ఈ అంశాన్ని తెలివిగా, సంయమనంతో పరిష్కరిస్తే దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని, తొందరపాటు నిర్ణయాలు ప్రాంతీయ భావోద్వేగాలను రెచ్చగొట్టి గణతంత్ర సమతుల్యతను దెబ్బతీయవచ్చని హెచ్చరించారు.

టెలివిజన్ చర్చల వేదిమి లేదా రాజకీయ విజయోత్సాహంతో ఈ సమస్యకు పరిష్కారం దొరకదని, హేతుబద్ధమైన చర్చలు, సంప్రదింపుల ద్వారానే శాశ్వత పరిష్కారం సాధ్యమని అన్నారు. రాజ్యాంగ పునర్నిర్మాణం వంటి కీలక అంశాల్లో అన్ని వర్గాల అభిప్రాయాలను గౌరవిస్తూ ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య జీవితాన్ని స్మరించుకుంటూ, దేశంలోని ప్రతి పౌరునికి భారత రాజ్యాంగం ఇచ్చిన హక్కులు, అవకాశాలు చేరాలని ఆయన తన జీవితాన్ని అంకితం చేశారని ఖురేషి పేర్కొన్నారు. నేటి పునర్వ్యవస్థీకరణ చర్చల సారాంశమూ అదే అని, భారతదేశ వైవిధ్యాన్ని గౌరవిస్తూ ప్రజాస్వామ్య వాగ్దానాన్ని అందరికీ చేరవేయగలమా అన్నదే ప్రధాన ప్రశ్నగా నిలుస్తోందన్నారు.

ఈ కార్యక్రమంలో 'ది వైర్ తెలుగు' ఎడిటర్ కొండూరు వీరయ్య, ఎస్‌వీకే సిబ్బంది, మేధావులు, ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# కామారెడ్డికి అపర భగీరథుడు మహమ్మద్ అలీ షబ్బీర్

- 20 ఏళ్ల నీటి ఎద్దడిని శాశ్వతంగా తీర్చిన సేవ
- శ్రీరాంసాగర్ నుంచి గోదావరి జలాలు తెచ్చిన మహా యజ్ఞం
- 19 ఎంఎల్డీకి పెంచిన నీటి సరఫరా.. వాటర్ ట్యాంకర్లు చరిత్ర




**కామారెడ్డి ప్రతినిధి, మే 19 (జనంసాక్షి):** గత 20 ఏళ్లుగా కామారెడ్డి నియోజకవర్గంలో తీవ్రమైన తాగునీటి ఎద్దడిని శాశ్వతంగా పరిష్కరించిన అపర భగీరథుడిగా మంత్రి మహమ్మద్ అలీ షబ్బీర్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ అభివర్ణించారు.

మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, గతంలో వర్షాకాలం మినహా ఏ కాలంలోనూ తాగునీరు సరఫరా లేక ప్రజలు ఖాళీ బిందెలతో రోడ్లపై నిరసనలు తెలిపేవారని గుర్తు చేశారు. అప్పటి మంత్రి షబ్బీర్ అలీ తన తపస్సులా కృషి చేసి, అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్ రెడ్డిని ఒప్పించి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి గోదావరి జలాలను కామారెడ్డికి తెచ్చారని ప్రశంసించారు.

దాదాపు 110 కి.మీ. పైప్‌లైన్లు వేయించి, మల్లన్న గుట్ట వద్ద ఫిల్టర్ బెడ్ ఏర్పాటు చేసి గ్రామాలకు, పట్టణానికి తాగునీరు అందించారని తెలిపారు. గత 10 సంవత్సరాలుగా వేసవిలో వాటర్ ట్యాంకర్లు దర్శనమిచ్చేవి కానీ, షబ్బీర్ అలీ పట్టుదలతో నేడు పట్టణంలో ఎక్కడా ట్యాంకర్ల అవసరం లేకుండా నల్లాద్వారానే పుష్కలంగా నీరు అందుతోందన్నారు. ప్రస్తుతం అమృత్ 2.0 పథకంలో 9 వాటర్ ట్యాంకులు మంజూరై 11.89 కోట్ల వ్యయంతో నిర్మాణం జరుగుతోందని, ఇవి పూర్తయితే పట్టణానికి 19 ఎంఎల్డీ నీటి సరఫరా లభిస్తుందని ఉమారాణి శ్రీనివాస్ వివరించారు. కామారెడ్డి ప్రజల దాహార్తిని తీర్చిన మహమ్మద్ అలీ షబ్బీర్‌కు ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ పర్వతాలు, డీఈ హన్మంతరావు, ఏఈ వినోద్, కౌన్సిలర్లు, పబ్లిక్ హెల్త్ సిబ్బంది, మిషన్ భగీరథ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 21 నుండి ఇంటర్ సప్లిమెంటరీ మూల్యాంకనం

అధ్యాపకులను రిలీవ్ చేయకుంటే చర్యలు

**నిజామాబాద్ అర్బన్ మే 19: జనం సాక్షి :** ఈ నెల 21వ తేదీ నుండి ఇంటర్ సప్లమెంటరీ మూల్యాంకనం ప్రారంభం అవుతుందని జిల్లా ఇంటర్ విద్యా అధికారి తిరుమలపుడి రవికు మార్ తెలియజేశారు. తెలుగు, హిందీ, సంస్కృతం, ఇంగ్లీష్, మ్యాథ్స్, పొలిటికల్ సైన్స్(సివిక్స్) సబ్జెక్ట్‌ల అధ్యాపకులు అందరూ 21వ తేదీన నిజామాబాద్‌లోని ఇంటర్ మూల్యాంకనం కేంద్రంలో రిపోర్ట్ చేయాలని జిల్లా ఇంటర్ విద్యా అధికారి తిరుమలపూడి రవికుమార్ ఆదేశించారు.. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు, అన్ని రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్‌లు వారి కళాశాల లాగిన్‌లలో అధ్యాపకుల అపాయింట్మెంట్ ఆర్డర్‌లు ఇంటర్ బోర్డు నిక్షిప్తం చేసిందని ఆయన తెలియజేశారు. మూల్యాంకన విధులు ఉన్న అధ్యాపకులను 20వ తేదీన రిలీవ్ చేయాలని ప్రిన్సిపాల్ లను ఆదేశించారు. ప్రైవేటు యాజమాన్యం అధ్యాపకులను రిలీవ్ చేయకపోతే ఇంటర్ బోర్డు నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఇంటర్ విద్యా అధికారి స్పష్టం చేశారు. ఆయా సబ్జెక్ట్‌ల అధ్యాపకులందరూ 21వ తేదీ నుంచి ప్రారంభం కానున్న మూల్యాంకనంలో అధ్యాపకులు తప్పనిసరిగా పాల్గొనాలని ఆయన ఆదేశించారు.

# లారీలు రావు.. మక్కలు పోవు

- ఆందోళనలో రైతులు
- చోద్యం చూస్తున్న ప్రభుత్వ



**కామారెడ్డి ప్రతినిధి (జనం సాక్షి) :** ఆరుగాలం కష్టపడి పంటలు పండించి కొనుగోలు కేంద్రాలకు తెస్తే నెల రోజులు గడిచిన కాంటలు కావు కాంటలు చేస్తే లారీలు రావడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కామారెడ్డి జిల్లా సదాశివ నగర్ మండల కేంద్రంలో మంగళవారం భారత రాష్ట్ర సమితి నాయకులు కొనుగోలు కేంద్రాల వద్దకు వెళ్తే రైతులు కన్నీరు మున్నీరయ్యారు. వడ్లు, మక్కలు కొనుగోలు కేంద్రాలకు తెచ్చి దాదాపు నెలరోజులు గడిచిన కాంటలుకావడం లేదని ఒకవేళ కాంటల్ అయితే లారీలు రాక దాన్యం తరలించడం లేదన్నారు. రోజుల తరబడి కాంటలు చేసి తరలించకపో వడం వల్ల రైస్ మిల్లు యజమానులు తూకం సరిగా రావడం లేదని కింటాల్కు పది కిలోలు దోచుకుంటున్నారని రైతులు ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి నమ్మి ఓటు వేసినందుకు అధికారంలోకి వచ్చి అరచేతిలో వైకుంఠం చూపిస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మరో 15 రోజుల్లో వర్షాలు వస్తాయని వాతావరణ కేంద్రం చెప్పడంతో రైతుల ఆందోళన ఎక్కువైంది. దీంతో గత్యంతరం లేని రైతులు మధ్య దళారీలకు తక్కువ ధరకు దాన్యం అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతులను పరామర్శించిన బారాస నాయకులు ఉమ్మడి సదాశివనగర్ మండల మాజీ జెడ్పిటిసి పడిగెల రాజేశ్వరరావు, మాజీ జిల్లా పరిషత్ కోఆప్షన్ నెంబర్ స్థానిక సింగిల్ విండో చైర్మన్ కమలాకర్ రావు తో పాటు రైతులు కుంట సంజీవరెడ్డి రాజయ్య, ఎల్లయ్య రమేష్ రాజశేఖర్ సందర్శించారు. ఈ సందర్భంగా రాజేశ్వర్రావు మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే లారీలను పంపి కాంటలు చేసినధాన్యాన్ని తరలించాలని డిమాండ్ చేశారు. అలాగే రైస్ మిల్ల యజమానులతో అధికారులు మాట్లాడి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేదా రైతుల తరపున పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

# లారీల సంఖ్య పెంచి ధాన్యం తరలింపు వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచన
- పెద్దలింగాపూర్‌లో కొనుగోలు కేంద్రం పరిశీలన
- హమాలీలు పెంచి అన్‌లోడింగ్‌ను త్వరితం చేయాలి
- రైతులకు ఎలాంటి ఇబ్బందులు రానీయవద్దు



**ఇల్లంతకుంట, మే 19 (జనంసాక్షి):** కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం తరలించేందుకు లారీల సంఖ్యను మరింత పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ గ్రామంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి. గితేలు మంగళవారం సందర్శించారు. ఇప్పటివరకు ఎంత ధాన్యం వచ్చింది, ఎంత కొనుగోలు చేశారు, తరలింపుకు సిద్ధంగా ఉన్న ధాన్యం ఎంత ఉందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం తరలింపుకు మరిన్ని లారీలను సమకూర్చాలని ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు రానీయవద్దని సూచించారు. అదే మండలం చింతలకుంటపల్లె గ్రామంలోని శ్రీ లక్ష్మీసాయి రైస్ ఇండస్ట్రీస్‌ను కూడా కలెక్టర్, ఎస్పీలు సందర్శించి పరిశీలించారు. ధాన్యం లక్ష్యం ఎంత, ఇప్పటివరకు ఎంత అన్‌లోడ్ చేశారు, ఏ మండలాల నుంచి ధాన్యం వస్తోందని వివరాలు అడిగి తెలుసుకున్నారు. హమాలీల సంఖ్యను పెంచి అన్‌లోడింగ్ పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పరిశీలనలో డీఆర్‌డీఓ లక్ష్మీనారాయణ, డీసీఎస్ఓ బుచ్చిబాబు, మేనేజర్ నరసింహ, డీసీఓ రామకృష్ణ, తహసీల్దార్ సురేష్, ఎంపీడీఓ శశికళ తదితరులు పాల్గొన్నారు.



# లారీల కోసం తహసిల్దార్ నిలదీత

**కొల్చారం, మే 19,(జనం సాక్షి):** ధాన్యం కొనుగోలు కేంద్రంలో సుమారు 3500 బస్తాలు తూకం వేసి ఉంచామని, వారము రోజులు నడుస్తున్న లారీలు రావడంలేదని, తమకు వెంటనే లారీలు పంపించాలని పోతంశెట్టిపల్లి గ్రామ రైతులు తహసిల్దార్ ను నిలదీశారు. వరిగుంతం లోని ఎఫ్ఎంసి గోదాము వద్ద తహసిల్దార్ శ్రీనివాస్ చారి నీ కలిసి రైతులు తమ గోడు వెళ్ళబోసుకున్నారు. తహసిల్దార్ మాట్లాడుతూ పోతంశెట్టిపల్లి గ్రామంలో లారీల కొరత ఉందని ముందుగా అక్కడికే లారీలను పంపిస్తానని చెప్పడంతో అప్పాజీపల్లి రైతులు తీవ్ర అసంతృప్తికి లోనై తమకు లారీలు పంపించాలని తహసిల్దార్ తో వాదానికి దిగారు. అనంతరం పోలీసులు కలగజేసుకొని నచ్చజెప్పడంతో రైతులు శాంతించారు. తమ గ్రామానికి కనీసం ఒక్క లారీ అయినా పంపిస్తే బాగుంటదని అప్పాజీపల్లి రైతులు వాపోయారు. ఈ కార్యక్రమంలో అప్పాజీపల్లి సీతారాం తండా వరిగుంతం గ్రామ రైతులు ఉన్నారు.

# ముదిరాజ్‌లకు సీఎం పీఠమే ధ్యేయంగా ఐఐపి పార్టీ

- ఐఐపి జాతీయ అధ్యక్షులు ఐపి గుప్తా
- తెలంగాణ లో ఇండియన్ ఇంక్లూజివ్ పార్టీ (ఐఐపి) ఆవిర్భావం
- తెలంగాణ రాష్ట్ర కమిటీ ఎన్నిక




**ముషీరాబాద్, మే 19 (జనం సాక్షి):** రాష్ట్ర జనాభాలో అత్యధిక శాతం జనాభా కలిగిన ముదిరాజులకు సీఎం పీటమే ధ్యేయంగా ఇండియన్ ఇంక్లూజివ్ పార్టీ (ఐఐపి) పార్టీ కృషి చేస్తుందని, ఆ దిశగా ముదిరాజ్ నాయకులను తయారు చేస్తున్నామని ఐఐపి పార్టీ జాతీయ అధ్యక్షులు ఐపి గుప్తా అన్నారు. ఈ మేరకు మంగళవారం బషీర్బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఇండియన్ ఇంక్లూజివ్ పార్టీనీ ఆవిర్భవించారు. తెలంగాణ రాష్ట్రం కమిటీని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీహార్ లో తాను అత్యల్ప సమయంలో ఐఐపి పార్టీని స్థాపించి, ఏకంగా పోరాడి పార్టీకి ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చానన్నారు. తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్లలోనూ ముదిరాజుల సంఖ్య అత్యధికంగా ఉందని, ఆయా రాష్ట్రాల్లో ముదిరాజులు లేకుండా ఎవరు సీఎం పీఠం ఎక్కలేరని అన్నారు. రాజకీయాల్లో ముదిరాజులు కీలక పాత్ర పోషించినా ఇంతకాలం వరకు ముదిరాజులు సీఎం పీఠం దక్కలేదన్నారు. ముందుగా ముదిరాజుల కులాల్లోని అన్ని సంఘాలు ఏకం కావాలని, ముదిరాజుల ఓట్లు వారి నాయకులకి దక్కేట్టుగా అందరూ ఏకతాటిపైకి రావాలని సూచించారు. వచ్చే తరం పిల్లల భవిష్యత్తు కోసమైనా ముదిరాజ్ యువత రాజకీయాల్లోకి రావాలని సూచించారు.

**ఐఐపి తెలంగాణ రాష్ట్ర నూతన కార్యవర్గం.**

తెలంగాణ రాష్ట్ర ప్రెసిడెంట్‌గా మర్రి ప్రభాకర్ ముదిరాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ చింతల నీలకంఠం ముదిరాజ్, హనుమంతరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు గా బిక్షపతి ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి గా చింతల శ్రీనివాస్ ముదిరాజులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ జర్నలిస్టు సంఘం ప్రధాన కార్యదర్శి బోయిని శ్రీనివాస్ ముదిరాజ్, పిట్టల మోహన రాజ్ ముదిరాజ్, బాలస్వామి ముదిరాజ్, కామరపు రాజేందర్, సతీష్ ముదిరాజ్, మాడవేని శ్రీనివాస్ ముదిరాజ్, గణేష్ ముదిరాజ్, కర్ణాటక ఐఐపి పార్టీ ఇంచార్జ్ అంబరీష్ ఉప్పల్ శ్రీనివాస్ ముదిరాజ్ జర్నలిస్టులు, ఐఐపి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## కవాడిగూడలో మహిళ దారుణ హత్య

**ముషీరాబాద్, మే 19 (జనం సాక్షి):** హైదరాబాద్ నగరంలోని గాంధీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కవాడిగూడలో ఓ మహిళ దారుణ హత్యకు గురైంది. కవాడిగూడ లోని రత్నదీప్ బిల్డింగ్ నాలుగో అంతస్తులో శ్వేత అనే మహిళను గుర్తుతెలియని వ్యక్తి కత్తితో పొడిచి హత్య చేసి పరారయ్యాడు. సమాచారం అందుకున్న వెంటనే గాంధీనగర్ పోలీసులు, క్లూస్ టీం సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఘటనకు సంబంధించిన ఆధారాలను సేకరిస్తూ దర్యాప్తు చేపట్టారు.సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా నిందితుడి వివరాలను గుర్తించే ప్రయత్నం చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. హత్యకు గల కారణాలపై విచారణ కొనసాగుతోంది.

# నిప్పుల కొలిమి

## భానుడి ఉగ్రరూపం.. మండుతున్న ఎండలు

- ఉదయం తొమ్మిది దాటితే బయటకు రాలేని పరిస్థితి
- ఇంట్లో ఉన్నా తప్పని ఉక్కపోత





**సంగారెడ్డి ప్రతినిధి, మే 19 (జనం సాక్షి) :** జిల్లా వ్యాప్తంగా ఎండలు గతంలో ఎన్నడూ లేని విధంగా తీక్షణమైన వేడిమితో ప్రజలను ఆందోళనకు గురవుతున్నారు. ఉదయం 9 గంటలనుంచే మాడ చుర్రు మనిపించే విధంగా తీవ్రమైన వేడిమితో ఎండలు కాస్తుండటంతో ప్రజలు ఉదయం 10 గంటల తరువాత రోడ్డుపైకి రావాలంటేనే భయపడాల్సి వస్తోంది. జిల్లా వ్యాప్తంగా పలు మండలాలలో 40 నుంచి 45 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు గా అధికారులు తెలియచేస్తున్నారు. ఇప్పటికే వాతావరణశాఖ హెచ్చరి కలు చేస్తూ వస్తోంది. రానున్న రోజులలో ఎండలు మరింత వేడిగా ఉంటాయని చెబుతున్నన్నారు. ముఖ్యంగా ఉదయం 10 గంటల తరువా త వాహనాలపై వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్రవా హన దారులు, ఆర్టిసి బస్సులు నడిపే వారు ఎండల వేడిమితో ఎక్కడిక్కడ చల్లని నీరు తాగుతూన్నారు. జిల్లావ్యాప్తంగా మే నెల ప్రారంభం నుంచి గర్జిస్తున్న ఎండలతో వయసు మీరిన వృద్ధులు నెలలు వయసు కలిగిన పసిపిల్లలు వడగాల్పులకు తట్టుకుంటారా అనే ఆందోళన సర్వత్రా వ్యక్తం అవుతుంది. కోళ్ల పరిశ్రమతో పాటు ఇళ్లలో పెంచే పెంపుడు కోళ్లు పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు తట్టుకోలేక మృతి చెందుతున్నాయి. మొత్తంగా సంగారెడ్డి జిల్లాలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు ఆందోళన కలిగిస్తున్నాయి. సంగారెడ్డి జిల్లాలోని సంగారెడ్డి, సదాశివపేట, జహీరాబాద్, నారాయణఖేడ్, ఆందోల్ జోగిపేట్ తదితర పట్టణాలలో ఉదయం 11 గంటల తర్వాత రోడ్లపైకి వాహనదారులు, పాదాచారులు తిరగడం లేదు. రోడ్లన్నీ కర్ఫ్యూ ను తలపిస్తూ నిర్మానుషంగా ఉంటున్నాయి.

### ఎండ వేడిమికి విలవిల..

జిల్లావ్యాప్తంగా ఎండలు తీవ్రంగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు వేడిమీ తట్టుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇండ్లలోని ఫ్యాన్ లు వేసినప్పటికీ అవి కూడా వేడిగాలి అందిస్తున్నాడంతో ఇంట్లో ఉ న్నప్పటికీ వేడిగాలితో ఇబ్బందులు తప్పడం లేదు. ఇంటి బయట కూర్చుందాంమన్న ఎండతో పాటు వడగాల్పులు వస్తున్నాడంతో బయ ట కూర్చోవడానికి కూడా జంకుతున్నారు. మరో 15, 20 రోజుల వరకు ఎండలు ఇలాగే ఉంటాయేమోనని ప్రజలు ఆందోళన చెందుతు న్నారు. వచ్చేనెల 8 మృగశిర కార్తె వరకు వర్షాలు పడి వాతావరణంలో మార్పు వస్తుందేమోనని జిల్లా ప్రజలు వేచి చూస్తున్నారు.

### వృద్ధులు ఈ సూచనలు పాటించాలి..

- ఎండలో ఎక్కువసేపు ఉండకూడదు. నీడపట్టున విశ్రాంతి తీసుకోవాలి
- బయటకు వెళ్లేటప్పుడు ఓఆర్ఎస్, ఎలక్ట్రల్ పౌడరు వెంట తీసుకెళ్లాలి
- నీరసంగా అనిపించగానే నీళ్లల్లో ఎలక్ట్రికల్ పౌడర్ను కలుపుకుని తాగాలి
- నిమ్మకాయ రసం, కొబ్బరి నీళ్లు, మజ్జిగ, అంబలి వంటివి తీసుకోవడం ఉత్తమం
- హీట్ స్ట్రోక్కు గురైతే వైద్యులు సలహాల ప్రకారం మందులు వాడాలి. ఈ సమయంలో వృద్ధులకు ఓఆర్ఎస్ ద్రవం ఇవ్వాలి
- ఓఆర్ఎస్ అందుబాటులోకి లేకుంటే నీళ్లల్లో లేదా నిమ్మరసంలో ఉప్పు కలిపి తాగించాలి
- వేసవిలో వృద్ధులు వ్యాయామం జోలికి పోక పోవడం ఉత్తమం
- తేలికపాటి నడకను అలవరుచుకోవాలి
- శరీరం ఎక్కువ శ్రమకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- వడదెబ్బ తగిలితే శరీరాన్ని చల్లని నీటితో తుడవాలి
- ఫ్రిజ్ నీటి కన్నా కుండనీరు తాగడం మంచిది





### ఏ వయసు వారికైనా వడదెబ్బ

**డాక్టర్ కృష్ణమూర్తి**

వడదెబ్బ ఏ వయస్సు వారికైనా వచ్చే అవకాశం ఉంది. అయితే కొంత మం ది మాత్రమే దాని బారిన పడుతుంటా రు. వారిలో పిల్లలు, వృద్ధులు, క్రీడాకా రులు, అతిమూత్ర వ్యాధి ఉన్న వ్యక్తులు, మద్యం సేవించేవారు, విపరీతమైన సూర్యరశ్మికి, వేడికి అలవాటు లేనివారు ఉంటారు. అలాగే కొన్ని ఇంగ్లీష్/ ఆయుర్వేద మందులు కూడా మనిషిని వడదెబ్బకు గురయ్యే లా చేస్తాయి. దీంతో వేసవిలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా ఎండలో వృద్ధులు, చిన్నపిల్లలు తిరగకపోవడమే మంచిది. ఎండాకాలంలో వడదెబ్బ తగలకుండా ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలి.

# అంతరాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

### 10 తులాల బంగారం, కారు స్వాధీనం

జడ్చర్ల, మే 19 (జనంసాక్షి): జడ్చర్ల బస్ స్టాండ్‌లో బస్సు ప్రయాణికులను లక్ష్యంగా చేసుకుని వరుస దొంగతనాలకు పాల్పడుతున్న హర్యానాకు చెందిన ఆరుగురు సభ్యుల అంతరాష్ట్ర దొంగల ముఠాను స్థానిక పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి 10 తులాల బంగారం, ఒక కియా కారును స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వెంకటేశ్వర్లు వెల్లడించారు. మంగళవారం జడ్చర్ల పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. ఈ నెల 7న జడ్చర్ల బస్ స్టాండ్‌లో ఒక మహిళా ప్రయాణికురాలి బ్యాగ్ కట్ చేసి 6 తులాల బంగారం, అలాగే సోమవారం మరో మహిళ బ్యాగ్ నుండి 3 తులాల బంగారం చోరీకి గురయ్యాయి. బాధితుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన జడ్చర్ల సీఐ కమలాకర్, ఎస్ఐ మల్లేష్, సిబ్బంది కలిసి స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జ్ కింద ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అనుమానాస్పదంగా వచ్చిన హర్యానా రిజిస్ట్రేషన్ కియా కారును ఆపి, అందులోని ఆరుగురిని విచారించడంతో ఈ ముఠా గుట్టు రట్టయింది. నిందితులను హర్యానాకు చెందిన సందీప్, అశోక్, ప్రవీణ్, రాజేష్, సునీల్ కుమార్, సచిన్‌లుగా గుర్తించారు. ప్రధాన నిందితుడు సందీప్‌పై గతంలో 15 కేసులు ఉన్నాయి. వీరంతా బస్ స్టాండ్లలో ప్రయాణికుల దృష్టి మరల్చి, బ్లేడ్లతో బ్యాగులు కట్ చేసి దొంగతనాలకు పాల్పడుతుంటారని డీఎస్పీ తెలిపారు. చాకచక్యంగా దొంగలను పట్టుకున్న సీఐ కమలాకర్, ఎస్ఐ మల్లేష్, కానిస్టేబుళ్లు విష్ణు, నరసింహరాజులను జిల్లా ఎస్పీ అభినందించి రివార్డులు ప్రకటించారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

- జర్నలిస్టులు తీసుకున్న నిర్ణయానికి అభినందిస్తున్న
- ప్రజా సమస్యల పరిష్కారానికి వారధిగా జర్నలిస్టులు పని చేయాలి
- జర్నలిస్ట్ కుటుంబానికి ప్రమాద భీమా పోస్టల్ బాండ్ అందజేత
- కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ వొడితెల ప్రణవ్



**హుజురాబాద్, మే 19 (జనంసాక్షి ) :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని, ప్రజా క్షేత్రంలో పనిచేసే మీడియా మిత్రులు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా పనిచేయాలని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ కోరారు.మంగళవారం హుజురాబాద్ పట్టణంలోని హుజురాబాద్ క్లబ్ లో మీడియా సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేశారు.దీనికి ముఖ్య అతిథిగా ప్రణవ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన చిర్ర సుదర్శన్ కుటుంబానికి ప్రమాద భీమా పోస్టల్ బాండ్ ద్వారా వచ్చిన ఇన్సూరెన్స్ బాండ్ ను బాధిత కుటుంబానికి ప్రణవ్ చేతుల మీదుగా అందజేశారు.రెండు నిమిషాల పాటు మౌనం పాటించి నివాళు లు అర్పించారు.అనంతరం వారు మాట్లాడుతూ కుటుంబానికి పెద్ద దిక్కులా ప్రణవ్ వ్యవహరించడం అడిగిన వెంటనే యూనియన్ లో ఉన్న సభ్యులకు ఇన్సూరెన్స్ డబ్బులు కట్టడం ద్వారా ఒక కుటుంబానికి న్యాయం జరిగిందని భావోద్వేగానికి లోనయ్యారు.అలాగే హుజురాబాద్ పట్టణంలోని వివిధ పాఠశాలలో మంచి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థిని,విద్యార్థులకు ప్రణవ్ చేతుల మీదుగా సన్మానం చేశారు.అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ ఇలా అందరినీ ఒకే చోట కలవడం సంతోషంగా ఉందని విద్య,వైద్య విషయంలో ముందు ఉంటామని తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని,కౌన్సిలర్లు,ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కాయిత రాములు,ప్రధాన కార్యదర్శి రవీందర్, జిల్లా ఉ పాధ్యక్షుడు నంబి భరణి కుమార్, హుజురాబాద్ పట్టణ, మండల అధ్యక్షులు, మహిళ అధ్యక్షురాల్లు, జర్నలిస్టులు, సీనియర్ నాయకులు,అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అరవింద్ మతి భ్రమించిందా?

## 2034 వరకు రేవంత్‌రెడ్డి సీఎం

- రేవంత్‌పై అనుచిత వ్యాఖ్యలు.. బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి ఫైర్
- బీజేపీ అధిష్టానం కఠిన చర్యలు తీసుకోవాలి
- అరవింద్‌కు సవాల్ విసిరిన మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్



**కరీంనగర్ బ్యూరో, మే 19 (జనంసాక్షి):** నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై తెలంగాణ మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి తీవ్రంగా మండిపడ్డారు. అరవింద్ మతి భ్రమించినట్లు ఉందని, రాజకీయ విమర్శలు ప్రజా సమస్యలపై ఉ ండాలని, దేశ అత్యున్నత పదవుల్లో ఉన్న నాయకులపై ఆధారాలు లేని వ్యాఖ్యలు చేయడం సరికాదని ఆయన హెచ్చరించారు. బరాబర్ 2034 వరకు రేవంత్ రెడ్డి గారే ముఖ్యమంత్రిగా ఉంటారని రాసిపెట్టుకోమని సవాల్ విసిరారు. బీజేపీ అధిష్టానం వెంటనే అరవింద్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని, సస్పెన్షన్ వేటు వేయాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డిని విమర్శించడానికి ప్రధాని మోదీ, పశ్చిమ బెంగాల్ ప్రతిపక్ష నేత సువేందు అధికారిని లాగడం బాధ్యతాయుత రాజకీయాలకు సరిపోదని మండిపడ్డారు. అరవింద్ కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి వెళ్లిన వ్యక్తి కాబట్టి డీఎస్ కొడుకు అని చెప్పుకుంటున్నాడని, కానీ రేవంత్ రెడ్డికి మోదీతో ఉన్న సంబంధాలు దేశానికి తెలుసని ఎద్దేవా చేశారు.
అరవింద్‌కు రాజకీయ జీవితం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని ఇప్పుడు ఎందుకు ఎత్తి పొడుస్తున్నాడని ప్రశ్నించారు. నిజామాబాద్ అభివృద్ధికి ఏం చేశాడని కూడా సవాల్ విసిరారు. రాజకీయాల్లో హుందాతనం పాటించాలని, రేవంత్ రెడ్డిపై చేసిన వ్యాఖ్యలను బేషరతుగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే కాంగ్రెస్ శ్రేణులు తీవ్ర స్థాయిలో స్పందిస్తాయని హెచ్చరించారు.

# వైద్యుల నిర్లక్ష్యంతో 8 నెలల పసికందు మృతి

### ఆసుపత్రి ముందు కుటుంబీకుల ఆందోళన



**నర్సాపూర్ మే 19 (జనం సాక్షి) :** వైద్యం వికటించి ఓ పసికందు మృతి చెందిన సంఘటన నర్సాపూర్ పట్టణంలోని మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు కుటుంబీ కుల కథనం ప్రకారం ఇలా ఉన్నాయి. నర్సాపూర్ మండల పరిధిలోని జక్కపల్లి గ్రామానికి చెందిన మంజుల ఆంజనేయులు దంపతుల 8 నెలల పసికందు మణిదీప్ కు సోమవారం మూడు గంటల సమయంలో జ్వరం వచ్చిందని నర్సాపూర్ లోని అమ్మ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకువచ్చారు. అనంతరం బాలుడికి పరీక్షలు నిర్వహించిన ఆసుపత్రిలో అడ్మిట్ చేసుకొని చికిత్సలు జరిపారు. అయితే మంగళవారం ఉదయం వైద్యులు పసికందు చిన్నారి మణి దీప్ పరిస్థితి విషమంగా ఉందని సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లాలని వైద్యులు చెప్పారు. వెంటనే కుటుంబీకులు బాలుడిని అంబులెన్స్ లో సంగారెడ్డి ఆసుపత్రికి తీసుకు వెళ్లారు. సంగారెడ్డి ఆసుపత్రిలో అక్కడి వైద్యులు పరీక్షించగా అప్పటికే బాలుడు చనిపోయినట్లు చెప్పారు. అమ్మ ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యంతోనే బాలుడు మృతి చెందాడని కావాలని పరిస్థితి విషమంగా ఉందని సంగారెడ్డి ఆస్పత్రికి తరలించే విధంగా చేశారని కుటుంబీకులు ఆరోపించారు. పసి కందు బాలుడు మణికంఠ మృతికి కారణమైన వైద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కుటుంబీకులు డిమాండ్ చేశారు. అమ్మ ఆసుపత్రిలో ఇటువంటి అల్లర్లు జరగకుండా ఎస్సై రంజిత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు చేశారు.

## పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో

# సామాన్యుడి నడ్డి విరుగుతోంది

- నీట్ పేపర్ లీక్‌కు మోదీ సర్కార్ వైఫల్యమే కారణం
- బీజేపీ నేతల మాటల గారడీ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోంది
- ధరలు వెంటనే తగ్గించాలి.. కేంద్రానికి సుడా చైర్మన్ డిమాండ్



**కరీంనగర్ బ్యూరో, మే 19 (జనంసాక్షి):** కేంద్ర ప్రభుత్వం నాలుగు రోజుల్లో పెట్రోల్, డీజిల్ ధరలను లీటరుకు నాలుగు రూపాయల చొప్పున పెంచి సామాన్యుడి నడ్డి విరుస్తోందని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మండిపడ్డారు. ధరల పెంపును వెంటనే వెనక్కి తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్, పలువురు కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులతో కలిసి మాట్లాడుతూ, మోదీ సర్కార్ మొదటి నుంచి మాటల గారడీ చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని ఆరోపించారు. కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తూ ప్రజాధనాన్ని దారదత్తం చేస్తోందని విమర్శించారు.
పెట్రోల్, డీజిల్ ధరలు ఒక్కసారి పెంచితే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుందని గ్రహించి, విడుదల వారీగా పెంచుతూ సామాన్యులపై భారం మోపాలని బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని నరేందర్ రెడ్డి ఆరోపించారు. ఇప్పటికైనా ధరల పెంపును ఆపి, పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని హెచ్చరించా రు. లేకపోతే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని స్పష్టం చేశారు. నీట్ పరీక్షా పత్రం లీక్‌ను కూడా కేంద్ర ప్రభుత్వ వైఫల్యంగా అభివర్ణించారు. దేశవ్యాప్తంగా 26 లక్షల మంది, రాష్ట్రంలో 70 వేల మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు. బీజేపీ నాయకులు దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు చేసినా, కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కడా ధరలు పెంచలేదని, అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని నరేందర్ రెడ్డి తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో తాజొద్దీన్, పిట్టల రవీందర్, కార్పొరేటర్లు మల్లికార్జున రాజేందర్, గంట శ్రీనివాస్, జగన్ రెడ్డి, పర్వతం మల్లేశం, వరాల నర్సింగం, చాడగొండ బుచ్చిరెడ్డి, టెల భూమయ్య, సరిల్ల ప్రసాద్, బాలరాజు, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, జీడి రమేష్, మ్యాకల నర్సయ్య, బత్తిని చంద్రయ్య, సుదర్శన్, మాసుం ఖాన్, శ్రీధర్ రెడ్డి, షెహెన్షా, భారీ, బషీర్, ఖలీల్, హనీఫ్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి సభలను విజయవంతం చేయాలి

- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి సూచనలు
- మే 22న జిల్లా స్థాయి సభలు
- ప్రజా ప్రతినిధులు, అధికారులు, సంఘాలు భాగస్వామ్యం
- సమన్వయంతో సభలు నిర్వహించాలని ఆదేశం

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మే 19 (జనంసాక్షి):** ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రంగారెడ్డి జిల్లాలో ఈ నెల 22న నిర్వహించే జిల్లా స్థాయి సభలను విజయవంతం చేయాలని పలు శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అదనపు కలెక్టర్లు, సంబంధిత జిల్లా అధికారులతో జూమ్ మీటింగ్ ద్వారా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మే 22న జిల్లా స్థాయి సభలు సమర్థవంతంగా నిర్వహించాలని ప్రభుత్వ సూచనల మేరకు అనువైన వేదికను ఏర్పాటు చేసి ఉదయం 10 గంటలకు సభను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయి సభలో ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు ముందస్తు సమాచా రం అందించాలని తెలిపారు. సభను రాష్ట్ర గీతంతో ప్రారంభించి, ముఖ్యమంత్రి సందేశాన్ని చదవాలని, ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను చదివి వినిపించాలని సూచించారు. ప్రస్తుతం అమలులో ఉన్న సంక్షేమ-అభివృద్ధి పథకాలపై చర్చించాలని, ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, వార్డు సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, యువత, రైతు లు, మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు ఉండేలా చూడాలని కలెక్టర్ సూచించారు. మహిళలు, వృద్ధులు కూర్చునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు, త్రాగునీరు, నీడ, స్క్రీన్, ప్రొజెక్టర్, బ్యానర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.
అధికారులందరూ సమన్వయంతో పని చేసి జిల్లా స్థాయి సభలను విజయవంతం చేయాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి సూచించారు. ఈ జూమ్ మీటింగ్‌లో అదనపు కలెక్టర్లు చంద్రా రెడ్డి, కిరణ్మయి, డీఆర్ఓ శారద, జిల్లా పరిషత్ సీఈఓ కృష్ణ రెడ్డి, సిపిఓ సౌమ్య, డిపిఓ సురేశ్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం

- నిబంధనలు ఉల్లంఘించే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు
- జిల్లా కలెక్టర్, చైర్మన్ చిత్రా మిశ్రా
- పీసీపీఎన్‌డీటీ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి శివకుమార్



**కరీంనగర్ బ్యూరో, మే 19 (జనంసాక్షి) :** గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని, నిబంధనలు ఉల్లంఘించే స్కానింగ్ సెంటర్ల పై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. మంగళవారం కరీంనగర్ కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అప్రోప్రియేట్ అథారిటీ సమావేశం చైర్మన్, జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. గర్భస్థ పూర్వ లింగ నిర్ధారణ నిషేధ చట్టం (పీసీపీఎన్‌డీటీ) అమలు పై సమీక్ష చేపట్టారు. ఈ సమావేశానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి శివకుమార్, డీసీపీ వెంకట రమణ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ, వైద్యాధికారులు, ఎన్జీవో ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ... గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే స్కానింగ్ సెంటర్ల పై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే కేంద్రాలు, ఆస్పత్రుల పై అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వైద్య బృందాలు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ, అవసరమైతే పోలీసు శాఖ సహకారంతో పర్యవేక్షణ మరింత బలోపేతం చేయాలని సూచించారు. పీసీపీఎన్‌డీటీ చట్టం ప్రకారం లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరమని, జిల్లాలో చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రజలందరికీ ఈ చట్టం పై అవగాహన కల్పించాలని సూచించారు. అధికారులు సంయుక్తంగా స్కానింగ్ సెంటర్లలో తరచూ తనిఖీలు నిర్వహించాలని నిబంధనలు పాటించని కేంద్రాల పై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వైద్య ఆరోగ్యశాఖ, పోలీస్ శాఖ, మహిళా సంక్షేమ శాఖ, స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో లింగ నిర్ధారణ పరీక్షలు ఎక్కడా జరగకుండా పర్యవేక్షణ, తనిఖీలు నిర్వహించాలని తెలిపారు.
జిల్లా ప్రధాన న్యాయమూర్తి శివకుమార్ మాట్లాడుతూ... భ్రూణ హత్యలను పూర్తిగా నివారించడంతో పాటు ఆడపిల్లల పట్ల వివక్షను తగ్గించి, మహిళల హక్కులను పరిరక్షించే దిశగా సమాజంలో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. పీసీపీఎన్‌డీటీ చట్టాన్ని సమర్థవంతంగా అధికారులు అమలు చేయాలని సూచించారు. ఈ చట్టాన్ని ఉల్లంఘించిన వారికి మూడు నుంచి ఐదు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు జరిమానా విధించే అవకాశం ఉందని తెలిపారు.
ఈ కార్యక్రమంలో డీసీపీ వెంకటరమణ, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, పీసీపీఎన్‌డీటీ ప్రోగ్రాం ఆఫీసర్ సనా, ప్రకృతి, ప్రశాంతి, భువన, ఎన్జీవో ప్రతినిధులు, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దోపిడీ జరిగిన 11 రోజుల్లోనే అంతరాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- ప్రజల్లో విశ్వాసం నింపిన కరీంనగర్ సీపీ గౌస్ అలంకు అభినందనలు
- శాంతి భద్రతల విషయంలో రాజీపడని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం
- జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ చైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్



**కరీంనగర్ బ్యూరో, మే 19 (జనంసాక్షి) :** గత కొద్ది రోజుల క్రితం కరీంనగర్ లోని పీఎంజే జువెలరీలో జరిగిన భారీ నగల దోపిడీ కేసును కేవలం 11 రోజుల వ్యవధిలోనే ఛేధించి, అంతరాష్ట్ర దొంగల ముఠాను అరెస్ట్ చేసి రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టను, పోలీస్ వ్యవస్థ పై ప్రజల్లో నమ్మకాన్ని మరింత పెంచిన కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ అలంకు, పోలీసు బృందానికి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ చైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డితో కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం పులి ఆంజనేయులు గౌడ్, పలువురు కాంగ్రెస్ నేతలతో కలిసి పోలీస్ కమిషనరేట్‌లో కమిషనర్ గౌస్ ఆలంను ప్రత్యేకంగా కలిసి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం పులి ఆంజనేయులు గౌడ్, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డితో కలిసి మాట్లాడుతూ... రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో ఎక్కడా రాజీ పడకుండా పనిచేస్తుందని స్పష్టం చేశారు. దొంగతనం జరిగిన 11 రోజుల్లోనే దుండగులను పట్టుకోవడం పోలీసు శాఖ చిత్తశుద్ధికి, ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పై, పోలీసుల పై ప్రతిపక్షాలు కావాలని దుష్ప్రచారం చేయాలని ఉబలాటపడటం సిగ్గుచేటని ఆయన ధ్వజమెత్తారు. పోలీసులు రేయింబవళ్లు కష్టపడి కేసును ఛేధిస్తుంటే, ప్రతిపక్ష నాయకులు మాత్రం ఇంట్లో కూర్చుని అసత్య ఆరోపణలు చేయడం వారి దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణ కోసం పనిచేసే పోలీస్ వ్యవస్థపై పౌరులు, ముఖ్యంగా రాజకీయ నాయకులు గౌరవంగా, హుందాగా ప్రవర్తించాలని హితవు పలికారు. ప్రతిపక్షాలకు చిత్తశుద్ధి ఉంటే పోలీసులను అభినందించాలే తప్ప, రాజకీయ లబ్ధి కోసం నిందలు వేయడం మానుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నేరస్తులు ఎంతటివారైనా తప్పించుకోలేరని, ఇదే ఘటన దానికి నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, తాడిజెర్రి సర్పంచ్ రామిడి రాజిరెడ్డి, కిసాన్ సెల్ వైస్ ప్రెసిడెంట్ నూనె గోపాల్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు వంగల విద్యాసాగర్, కుంబాల రాజ్ కుమార్, గంగుల దిలీప్ కుమార్, బండిపెల్లి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ పర్యటనకు బయలుదేరిన తెలంగాణ ప్రభుత్వ ఎన్నారై కమిటీ

- ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి ఆధ్వర్యంలో బయలుదేరిన బృందం
- గల్ఫ్ వలస కార్మికుల సంక్షేమంపై అధ్యయనం చేయనున్న కమిటీ



**హైదరాబాద్ (జనంసాక్షి) :** గల్ఫ్ ఎన్నారై పాలసీ రూపకల్పన కోసం తెలంగాణ ప్రభుత్వం నియమించిన ఎన్నారై అడ్వయిజరీ కమిటీ మంగళవారం సాయంత్రం హైదరాబాద్ ప్రజాభవన్ నుంచి ఆంధ్ర ప్రదేశ్ లోని విజయవాడకు అధికారిక పర్యటనకు బయలుదేరిం ది. సీఎం ప్రజావాణి నోడల్ ఆఫీసర్ దివ్యా దేవరాజన్ యాత్రను ప్రారంభించారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి, కమిటీ ఛైర్మన్ డా. బిఎం వినోద్ కుమార్ లు ఈ బృందానికి నాయకత్వం వహిస్తున్నారు. ఈ కమిటీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 20, 21వ తేదీలల్లో పర్యటించి.. గల్ఫ్ వలస కార్మికుల సంక్షేమం కోసం అమలుచేస్తున్న కార్యక్రమాలపై అధ్యయనం చేయనుంది. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డి, మెంబర్లు సింగిరెడ్డి నరేష్ రెడ్డి, నంగి దేవేందర్ రెడ్డి, చెన్నమనేని శ్రీనివాస రావులతో పాటు సాయిరెడ్డి, శేఖర్ గౌడ్, వాలంటీర్ కర్రి పద్మారాణి, ప్రొఫెసర్లు జునుగురు శ్రీనివాస్, విజయ్ కొర్రా, ప్రవాసీ ప్రజావాణి కోఆర్డినేటర్ బొజ్జ అమరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

# ప్రగతిశీల భావజాలంతోనే సమస్యల పరిష్కారం సాధ్యం

- సీఎం ప్రజావాణి ఇంచార్జ్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి
- ఆదిలాబాద్ జిల్లా ప్రజావాణి పైలెట్ ప్రాజెక్టు నివేదిక ఆవిష్కరణ



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ప్రగతిశీల భావజాలం ఉంటే ప్రజావాణికి వచ్చే సమస్యల మూలాలు అర్థమై వాటి పరిష్కారానికి మార్గం సుగమం అవుతుందని సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి అన్నారు. మంగళవారం మహాత్మా జ్యోతిబాపూలే ప్రజా భవన్ లో ఆదిలాబాద్ జిల్లాలో ప్రజావాణి అమలు తీరుపై పైలెట్ ప్రాజెక్టు నివేదికను చిన్నారెడ్డి, సీఎం ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ నిర్వాహకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ ప్రజావాణికి వివిధ సమస్యలతో వచ్చే దరఖాస్తుదారుల పట్ల అధికారులు, సిబ్బంది సానుకూల ధోరణితో స్పందించాలని, అప్పుడే పిటిషనర్ల ముఖంలో సంతోషం చూడగలుగుతామని పేర్కొన్నారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో కొనసాగుతున్న ప్రజావాణిని డివిజన్ స్థాయికి రాష్ట్ర ప్రభుత్వం విస్తరించిందని, రానున్న కాలంలో మండల స్థాయిలో కూడా ప్రజావాణిని నిర్వహించాలనే ఆలోచన ప్రభుత్వానికి ఉందని చిన్నారెడ్డి తెలిపారు. సీఎం ప్రజావాణిలో ఓపికతో ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నట్లు చిన్నారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎం ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్, నిర్వాహకులు హర్ష, ఆనందిత, అభిషేక్, అఖిల్, సీఎం ప్రజావాణి అధికారులు రాకేష్ రెడ్డి, జగన్, సహదేవ్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

## సీఎం ప్రజావాణిలో 392 దరఖాస్తులు



మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో మంగళవారం నిర్వహించిన 223వ సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 392 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 156, రెవెన్యూ శాఖకు సంబంధించి 34, ఇందిరమ్మ ఇండ్ల కోసం 118, ప్రవాసి ప్రజావాణికి 02 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 82 దరఖాస్తులు అందాయి. సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏ.సీ.పీ. ఉమేందర్, ఎన్.ఆర్.ఐ. సమన్వయ మండలి వైస్ చైర్మన్ మంద భీం రెడ్డి, ప్రవాసి ప్రజావాణి సమన్వయకర్త బొజ్జా అమరేందర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఫల్తా నియోజకవర్గంలో మమతకు షాక్

**21న జరిగే రీ-పోలింగ్ నుంచి తప్పుకున్న పార్టీ అభ్యర్థి**



**కోల్‌కతా, మే19 (జనంసాక్షి) :** పశ్చిమ బెంగాల్‌లోని ఫల్తా నియోజకవర్గంలో మమతా బెనర్జీకి షాక్ తగిలింది. 21రీ పోలింగ్ జరగునున్న సమయంలో తృణమూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి జహంగీర్ ఖాన్.. పార్టీ అధినేత మమతా బెనర్జీకి షాక్ ఇచ్చారు. మే 21న జరగనున్న రీపోలింగ్ నుంచి తాను వైదొలుగుతున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మీడియా సమావేశం నిర్వహించిన ఆయన పలు కీలక విషయాలను వెల్లడించారు. నియోజకవర్గ ప్రజా ప్రయోజనాల దృష్ట్యా పోటీ నుంచి తాను తప్పుకుంటున్నట్లు జహంగీర్ ఖాన్ చెప్పారు. తాను ఫల్తా నియోజకవర్గ బిడ్డనని, ఈ ప్రాంతమంతా శాంతియుతంగా ఉండి అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నట్లు జహంగీర్ పేర్కొన్నారు. ఫల్తా అభివృద్ధికి ముఖ్యమంత్రి సువేందు అధికారి ప్రత్యేక ప్యాకేజీని ఇస్తున్నారని.. అందుకే తాను పోటీ నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. టీఎంసీ ఎమ్మెల్యే అభ్యర్థి నిర్ణయంతో మమతా బెనర్జీకి ఎదురుదెబ్బ తగిలినట్లు అయ్యింది. మరోవైపు మే 21న జరిగే ఎన్నికల్లో బీజేపీ తరపున దేబాంగ్షు పాండా, కాంగ్రెస్ తరపున అబ్దుర్ రజాక్ మొల్లా, కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్) తరపున శంభు నాథ్ కుర్మి పోటీ పడనున్నారు. ఏప్రిల్ 29న రెండో దశ ఎన్నికల్లో భాగంగా ఫల్తా అసెంబ్లీ నియోజకవర్గానికి పోలింగ్ జరిగింది. మొత్తం 285 పోలింగ్ బూత్‌లలో ఓటు హక్కును వినియోగించు కునేందుకు ఓటర్లు తరలివెళ్లారు. ఈ సందర్భంగా పలు బూత్‌ల వద్ద అల్లర్లు చోటుచేసుకున్నాయి. బీజేపీ అభ్యర్థి దేబాంగ్షు పాండా కూడా పలు ఆరోపణలు చేశారు. ఈవీఎంలపై ఉన్న బీజేపీ బటన్‌ను తెల్లటి జిగురుతో కప్పివేశారని, దీంతో ఓటర్లు తమ పార్టీకి ఓటు వేయలేకపోయారని ఆరోపించారు. ఈ మేరకు ఫల్తా నియోజకవర్గానికి మే 21న రీపోలింగ్ నిర్వహించాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. కాగా, ఏప్రిల్ 23, ఏప్రిల్ 29 తేదీల్లో జరిగిన పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించింది.

# దేశంలో చాపకింద నీరులా మతమార్పిళ్లు

- నాసిక్ ఘటన మరువక ముందే మరో ఘటన
- యూపిలో నెట్‌వర్క్‌ను ఛేదించిన పోలీసులు
- పదిమంది నిందితుల అరెస్ట్..ముమ్మర దర్యాప్తు



**లక్నో, మే19 (జనంసాక్షి) :** నాసిక్‌లోని ఓ బహుళజాతి కంపెనీలో బలవంతపు మత మార్పిళ్లు, లైంగిక వేధింపులు చోటుచేసుకోవడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అటువంటి మరో ఘటన ఉత్తర్‌ప్రదేశ్ లోని మిర్జాపూర్‌లో వెలుగులోకి వచ్చింది. జిమ్‌లలో చేరే మహిళలను లక్ష్యంగా చేసుకొని మత మార్పిళ్లు చేస్తున్న నెట్‌వర్క్‌ను పోలీసులు గుర్తించారు. వారు వెల్లడించిన వివరాల ప్రకారం.. మిర్జాపూర్‌లోని ఓ జిమ్ యజమాని మతం మారాలని బలవంతం చేస్తున్నట్లు ఓ యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ కేసుపై విచారణ చేస్తుండగా.. దీని వెనుక పెద్ద నెట్ వర్క్ ఉన్నట్లు గుర్తించారు. నిందితులు రాష్ట్రంలోని వివిధ జిమ్‌లు, సోషల్‌మీడియాల్లో ముందుగా మహిళలతో పరిచయాలు పెంచుకొని.. అనంతరం మత మార్పిడి చేసుకోవాలని వారిపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. దాదాపు 50 మందికి పైగా మహిళలను లక్ష్యంగా చేసుకుని ఈ ఆపరేషన్ చేపట్టినట్లు అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ కేసులో సన్నో అనే మహిళ ప్రధాన పాత్ర పోషిస్తున్నట్లు తెలిపారు. ముందుగా జిమ్‌లలో చేరి అక్కడి యువతులతో పరిచయం పెంచుకుం టుందని.. అనంతరం తన స్నేహితులుగా పేర్కొంటూ పలువురు ముస్లిం యువకులను వారికి పరిచయం చేస్తుందని పేర్కొన్నారు. మరికొందరు మహిళలను నిందితులు ఇన్‌స్టాగ్రామ్‌లో ఫ్రెండ్ రిక్వెస్ట్‌ల ద్వారా పరిచయం పెంచుకొని.. వారిలో మతమార్పిడి ఆలోచనలు కలిగేలా బ్రెయిన్ వాష్ చేసేవారని పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న సెల్ ఫోన్‌లలో వందలాది మంది మహిళల ఫొటోలు, వీడియోలు, చాట్‌లు ఉన్నాయని.. వాటిపై దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ కేసు యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ దృష్టికి వెళ్లడంతో ఆయన తీవ్రంగా స్పందించారు. నిందితులపై గ్యాంగ్‌స్టర్ చట్టం కింద కేసు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కేసులో ఇప్పటివరకు 10మంది అనుమానితులను అరెస్ట్ చేశామని.. దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు పేర్కొన్నారు.



# మంటలు చెలరేగి కారు దగ్ధం

**అదిలాబాద్, మే19 (జనంసాక్షి) :** అదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని రహదారిపై మంగళవారం కారు అగ్నికి ఆహుతైంది. అదిలాబాద్ నుంచి నిర్మల్ వైపు వెళుతున్న సమయంలో ఒక్కసారిగా కారులో మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన స్థానికులు కారులో ఉన్న ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీసుకురావడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అనంతరం మంటలు వేగంగా వ్యాపించి కారు పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

## ధర్మపురిలో దొంగలు బసచేసిన లాడ్జి సీజ్

**కరీంగనర్, మే19 (జనంసాక్షి) :** కరీంనగర్‌లోని పీఎంజే నగల దుకాణం దొంగతనం కేసు ధర్మపురిలో మరో కీలక అంశాన్ని వెలుగులోకి తీసుకొచ్చింది. దొంగతనానికి పాల్పడ్డ నిందితులు ఈ నెల 1 నుండి 3న ఉదయం 6 గంటల వరకు ధర్మపురిలో బస చేసిన విజయలక్ష్మి లాడ్జ్‌ను ఉన్నతాధికారుల ఆదేశాలతో మున్సిపల్, పోలీస్ శాఖలు సంయుక్తంగా సీజ్ చేసారు. ఇంతకాలం ఈ లాడ్జ్ నిబంధనలు ఉల్లంఘిస్తూ నడుస్తుంటే అధికారులకు కనిపించలేదా..? దొంగలు బస చేసిన తర్వాతే అక్రమాలు గుర్తొచ్చాయా..? ధర్మపురి వంటి ఆధ్యాత్మిక క్షేత్రంలో ప్రతీ రోజు వందలాది మంది భక్తులు, యాత్రికులు బస చేస్తుంటారు. అలాంటి ప్రాంతంలో వసతి గృహాలు నిబంధనల ప్రకారం నడుస్తున్నాయా..? అతిథుల పూర్తి వివరాలు నమోదు చేస్తున్నారా..? సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయా..? పోలీస్ వెరిఫికేషన్ జరుగుతోందా..? వంటి అంశాలపై క్రమం తప్పకుండా పర్యవేక్షణ ఉండాలని అంటున్నారు. కానీ ఘటన జరిగిన తర్వాత మాత్రమే అధికార యంత్రాంగం ఒక్కసారిగా కదలికలోకి రావడం అనేక అనుమానాలకు తావిస్తోంది.

# లులూ మార్కెట్‌లో పనికిరాని ఆహారపదార్థాలు

**ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులతో బట్టబయలు**



**హైదరాబాద్, మే 19 (జనంసాక్షి) :** నగరంలో కూకట్‌పల్లిలోని లులు హైపర్ మార్కెట్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజారోగ్యానికి హాని కలిగించే విధంగా ఉన్న దాదాపు 150 కిలోల ఆహార పదార్థాలను వారు సీజ్ చేశారు. మంగళవారం ఈ హైపర్ మార్కెట్‌లో తనిఖీలు చేపట్టిన అధికారులకు.. పలు ఆహార పదార్థాల్లో పురుగులు ఉండటాన్ని గుర్తించారు. అలాగే నాసిరకం ఆహార పదార్థాలు నిల్వ చేసినట్లు కనుగొన్నారు. కిచెన్ అపరిశుభ్రంగా ఉండడాన్ని అధికారులు గుర్తించారు. పాడైపోయిన కూరగాయలతోపాటు పరిసర ప్రాంతాలలో పురుగులు సంచరిస్తున్నట్లు ఈ తనిఖీల్లో అధికారులు గమనించారు. గడువు సమీపించిన ఆహార పదార్థాలపై తప్పుదారి పట్టించే విధంగా లేబుళ్లు అతికించినట్లు గుర్తించారు. గడువు ముగిసిన ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్‌తో ప్యాక్‌డ్ ఫుడ్ విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఈ హైపర్ మార్కెట్ నుంచి బయటకు వెళ్లే డ్రైనేజ్ కూడా మాంసాహార వ్యర్థాలతో మూసుకుపోయినట్లు ఈ తనిఖీల్లో తేలింది. కల్తీ, అధిక కృత్రిమ రంగుల అనుమానంతో పలు ఆహార పదార్థాల నమూనాలను కూడా అధికారులు సేకరించారు.

# నగరంలో వరుస అత్యాచారాలు

- సినిమా షూటింగ్ పేరుతో మాయమాటలు
- యువతిపై ఇద్దరు యువకుల అత్యాచారం
- బిటెక్ స్టూడెంట్‌పై తోటి స్టూడెంట్ అత్యాచారం

**హైదరాబాద్, మే19 (జనంసాక్షి) :** నగరంలో దారుణాలు వెలుగు చూస్తున్నాయి. అమ్మాయిలను మోసం చేసి అత్యాచారాలు చేస్తున్నారు. కేసులు నమోదవుతున్నా భయం లేకుండా తెగిస్తున్నారు. సికింద్రాబాద్‌లో ఓ యువతిపై ఇద్దరు యువకులు రెండ్రోజుల పాటు అత్యాచారం సాగించారు. ఇబ్రహింపట్నంలో ఓ బిటెక్ విద్యార్థినిపై తోటి విద్యార్థి అత్యాచారం చేశారు. వివరాల్లోకి వెళితే...సినిమా షూటింగ్ ఆశచూపి ఓ యువతిపై ఇద్దరు యువకులు లైంగిక దాడికి పాల్పడటం తీవ్ర కలకలం రేపుతోంది. జూబ్లీహిల్స్ మెట్రో స్టేషన్ సమీపంలో ఇద్దరు యువతులు నివసిస్తున్నారు. సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వారిలో ఓ యువతికి సినిమా షూటింగ్ ఉందంటూ యువకుడు మాయమాటలు చెప్పి నమ్మించాడు. సినిమా షూటింగ్ అనడంతో నమ్మిన యువతి.. యువకుడితో కలిసి సికింద్రాబాద్‌కు వెళ్లింది. సికింద్రాబాద్‌లోని గదికి తీసుకెళ్లిన యువకుడు.. తన స్నేహితుడితో కలిసి యువతిపై రెండు రోజుల పాటు లైంగిక దాడికి పాల్పడ్డాడు. నిందితులు ఈనెల 16న ర్యాపిడో బుక్ చేయించి తిరిగి యువతిని ఇంటికి పంపించేశారు. బాధితురాలి శరీరంపై గాయాలు ఉండటంతో స్నేహితురాలు ఆమెను గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించింది. అక్కడ వైద్యులు ఏం జరిగిందని ప్రశ్నించగా.. లైంగిక దాడి జరిగిన విషయాన్ని బాధితురాలు చెప్పింది. ఈ ఘటనపై బాధితురాలు జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో ఇద్దరు గుర్తుతెలియని యువకులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇకపోతే ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం జరిగింది. మద్యం తాగించి బీటెక్ చదువుతున్న యువతిపై తోటి విద్యార్థి అత్యాచారం చేశాడు. దీంతో బాధితురాలు ఇబ్రహీం పట్నం పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు ఉడుతల విజయ్‌ను అరెస్ట్ చేశారు. అనంతరం అతడిని రిమాండ్‌కు తరలించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని చౌటుప్పల్‌కు చెందిన ఉడుతల ఉదయ్.. ఇబ్రహీంపట్నం సమీపంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతు న్నాడు. మే 14వ తేదీన తనతోపాటు చదువుతున్న యువతిని టీ తాగుదామని ఆహ్వానించాడు. ఇద్దరు కారులో దిల్‌సుఖ్‌నగర్‌కు వెళ్లారు. టీ తాగిన అనంతరం తిరుగు ప్రయాణంలో ఉడుతల విజయ్ మద్యం కొనుగోలు చేశాడు. ఆ తర్వాత బీడీఎస్ రోడ్డులోని నిర్మానుష్య ప్రదేశానికి కారులో ఆ యువతిని తీసుకెళ్లాడు. విద్యార్థినితో అతడు మద్యం తాగించాడు. మత్తులో ఉన్న ఆమెను తన గదికి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. దీంతో ఇబ్రహీంపట్నం పోలీసులకు యువతి ఫిర్యాదు చేసింది. దీంతో ఉడుతల ఉదయ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. యువతిని వైద్య పరీక్షల నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

# ఇందిరమ్మ ఇంటి కోసం మహిళకు వేధింపులు

**కాంగ్రెస్ నేతపై పోలీసుల కేసు నమోదు**




**కామారెడ్డి, మే19 (జనంసాక్షి) :** ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయిస్తానని నమ్మబలికి, దానికి ప్రతిఫలంగా తన కోరిక తీర్చాలంటూ ఓ మహిళను వేధించిన ఘటన కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం కేంద్రంలో చోటుచేసుకుంది. బాధితురాలు ఫిర్యాదు మేరకు రాజంపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం రాజంపేట మండల కేంద్రం చెందిన ఒక మహిళకు ఇందిరమ్మ ఇండ్లు కావాలని కాంగ్రెస్ పార్టీకి చెందిన సదరు నాయకుడిని సంప్రదించింది. అయితే ఇల్లు మంజూరు చేయాలంటే తన కోరిక తీర్చాలని, తనకు లొంగిపోవాలని అతడు ఆమెను తీవ్రంగా వేధించడం ప్రారంభించాడు. ఈ వేధింపులు తట్టుకోలేక బాధితురాలు చివరికి రాజంపేట పోలీస్టేషన్లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి రాతపూర్వక ఫిర్యాదు మేరకు సదరు కాంగ్రెస్ నాయకుడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల విషయంలో మహిళపై అసభ్యంగా ప్రవర్తించినందుకు, పలువురిని డబ్బులు డిమాండ్ చేసినట్లు ఆరోపణ రావడంతో కాంగ్రెస్ పార్టీకి చెందిన బెస్తాం చంద్రంను పార్టీ అధిష్టానం మేరకు వాటి నుండి సస్పెండ్ చేశామని రాజంపేట మండల అధ్యక్షుడు కృష్ణారావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

# ఆదిలాబాద్ జిల్లాలో మండుటెండలు

**జనం బయటకు రాలేక నానా తిప్పలు**



**ఆదిలాబాద్, మే19 (జనంసాక్షి) :** ఆదిలాబాద్ జిల్లాలో భానుడి ప్రతాపం కొనసాగుతున్నది. సోమవారం 44.6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కాగా.. మంగళవారం కూడా అదే పరిస్థితి నెలకొంది. మండుటెండల తో ప్రజలు బయటకు రావడానికి జంకుతున్నారు. ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఎండ తీవ్రత.. సాయంత్రం ఆరు గంటల వరకు కొనసాగుతున్నది. ఎండకు వడగాలులు తోడవడంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారులు జనసంచారం లేక నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందడానికి ప్రజలు గొడుగులు, టోపీలు, తలకు టవల్స్ చుట్టుకుంటున్నారు. మంచినీరు, మజ్జిగ, లస్సీ ఇతర చల్లని పానీయాలు తీసుకుంటున్నారు. మరో నాలుగు రోజులపాటు ఎండ తీవ్రత ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని.. ఉదయం, సాయంత్రం పనులు చేసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.



# ఎండల్లో హాయ్.. హాయ్!

**చెన్నారావుపేట, మే 19 (జనంసాక్షి) :** అసలే భగభగ మండుతున్న ఎండలు... ఆపై విపరీతమైన ఉక్క పోత.... వాటి భారి నుండి తట్టుకోలేక బయటికి రావాలంటేనే ప్రజలు జంకుతున్నారు. అలాంటిది చెన్నారావుపేట గ్రామ శివారులోని ఓ వ్యవసాయ బావిలో ఎండ వేడిమి నుండి తట్టుకోలేక మంగళవారం మిట్ట మధ్యాహ్నం కొందరు యువకులు, విద్యార్థులు ఉపశమనం పొందడానికి ఇలా సరదాగా ఈతలు కొడుతూ కొద్దిసేపు నీటిలో హాయి హాయిగా గడుపుతూ ఉపశమనం పొందారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370